



# మనసులో మాట

KANCHARLA

సంచలన తెలుగు దిన పత్రిక






ప్రచురణ:-విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర :- సంపుటి:1 సంచిక: 127గురువారం 25 డిసెంబర్ 2025:- ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు:-పేజీలు24:- వెలరూ/ 7-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్


## ఇస్రో మరో మైలురాయి

### బాహుబలి రాకెట్ ప్రయోగం విజయవంతం




కక్ష్యలోకి చేరిన అత్యంత భారీ ఉపగ్రహంగా బ్లూబర్డ్ బ్లాక్-2 రికార్డు

భారత వాణిజ్య అంతరిక్ష సామర్థ్యానికి అంతర్జాతీయ గుర్తింపు

అమెరికా పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టామన్న ఇస్రో చైర్మన్

భారత అంతరిక్ష పరిశోధాన సంస్థ ఇస్రో మరో మైలురాయిని చేరింది. శ్రీహరి కోటలో బాహుబలి రాకెట్ ప్రయోగం విజయవంతం అయ్యింది. అమెరికాకు చెందిన భారీ కమ్యూనికేషన్ శాటిలైట్ బ్లూ బర్డ్ బ్లాక్-2ను ఈ రాకెట్ విజయవంతంగా నింగిలోకి తీసుకెళ్లింది. తొలిసారిగా ఇంతటి భారీ ఉపగ్రహాన్ని ఇస్రో నింగిలోకి పంపింది. కేవలం 15 నిమిషాల్లోనే బ్లూబర్డ్ ప్రయోగం విజయవంతమైంది.

### ఇస్రో ప్రయోగంతో బలమైన పునాదులు


అంతరిక్షంలో ప్రపంచసహకారంతో ముందుడుగు

ఇస్రోకు ప్రధాని మోడీ అభినందనలు..



## 20 లక్షల ఉద్యోగాలే లక్ష్యం

### స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనపై సీఎం చంద్రబాబు సమీక్ష



20 లక్షల ఉద్యోగాల కల్పనే మొదటి ప్రాధాన్యత అని స్పష్టీకరణ

పది సూత్రాలను పది మిషన్లుగా అమలు చేయాలని అధికారులకు ఆదేశం

నీటి భద్రత, వ్యవసాయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన

'మేడ్ ఇన్ ఆంధ్ర' బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తం చేయాలని దిశానిర్దేశం

**అమరావతి :** స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్య సాధన కోసం రూపొందించిన పది సూత్రాలను పది మిషన్లుగా స్వీకరించి పనిచేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. పాలనలో వేగాన్ని పెంచి, ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు ప్రతి ప్రభుత్వ శాఖ పనితీరును తెలిపే ప్రత్యేక సూచికలను (ఇండికేటర్లు) సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. సచివాలయంలో ఇవాళ ఆయన స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలు, పది సూత్రాల అమలుపై నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం

మిగతా 2 లో

### పేదలకు నాణ్యమైన వైద్యంలో రాజీలేదు

పీపీపీ విధానం దేశవ్యాప్తంగా అమలువుతోంది

విమర్శలను సమర్థంగా తిప్పి కొట్టాల్సిందే

అధికారులతో సమీక్షలో సీఎం చంద్రబాబు స్పష్టీకరణ

.. వివరాలు 2లో



### ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రత

శిలాజ ఇంధనాల వాడకం కూడా ఓ కారణం

నేను మూడ్రోజుల్లోనే ఇన్‌ఫెక్షన్ బారిన పడ్డా

కేంద్ర మంత్రి గడ్కరీ వెల్లడి

.. వివరాలు 3లో




### హెచ్-1 వీసా ఫీజుపై కోర్టులో సవాల్

దావాను తిరస్కరించిన ఫెడరల్ జడ్జ్

.. వివరాలు 3లో

## అధికారంలో ఉన్నప్పుడూ.. ఇప్పుడూ విమర్శలే

### టీడీపీ, జనసేనలపై మండిపడ్డ జగన్

**అమరావతి :** టీడీపీ, జనసేన పార్టీల అబద్ధపు ప్రచారాలపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్ర స్థాయిలో స్పందించారు. ఎక్స్ వేదికగా ఆయన చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. టీడీపీ, జనసేన పార్టీలు అధికారం లోకి రాకముందు కూడా, అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా గత వైసీపీ ప్రభుత్వంపై నిరంతరం ఆరోపణలు చేస్తున్నాయని

మిగతా 2 లో



### జగన్‌కు జ్వరం.. కార్యక్రమాలు రద్దు



## మాట నిలబెట్టుకున్న పవన్ కల్యాణ్

### మూడేళ్ల హామీ నెరవేర్చిన డిప్యూటీ సీఎం

ఇచ్చిన మాట ప్రకారం ఇండ్ల నాగేశ్వరమ్మను కలిసిన జనసేనాని

ఆమెకు రూ.50 వేల సాయం, మనవడి చదువుకు రూ.లక్ష ప్రకటన

ప్రతి నెలా రూ.5 వేల వ్యక్తిగత సహాయానికి హామీ ఇచ్చిన పవన్

ఇప్పటం గ్రామంలో భావోద్వేగ వాతావరణం

**గుంటూరు :** గ్రామస్థురాలు ఇండ్ల నాగేశ్వరమ్మకు ఇచ్చిన హామీ మేరకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జిల్లాలోని ఇప్పటం గ్రామంలో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా వృద్ధురాలు ఇండ్ల నాగేశ్వరమ్మ నివాసానికి వెళ్లి ఆమెను పరామర్శించారు. నీ బిడ్డగా నీ ఇంటికి వచ్చానంటూ నాగేశ్వరమ్మ కాళ్లకు పవన్ నమస్కరించారు. ఆపై వృద్ధురాలికి కొత్త బట్టలు ఇవ్వడంతో పాటు

మిగతా 2 లో



### వాజ్‌పేయ్ ఆశయాలకు అనుగుణంగా మోడీ పాలన

నేటి తరానికి వాజ్‌పేయ్ విలువలు ఆదర్శం

నేడు వాజ్‌పేయ్ విగ్రహావిష్కరణ

బీజేపీ ఏపీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్

2



### హాస్పిటాలిటీ ఇండస్ట్రీకి రుషికొండ ప్యాలెస్

అన్ని విధాలుగా ఆలోచన చేస్తున్నాం

ప్యాలెస్ వినియోగంపై ఉపసంఘం చర్చ

2

# 20 లక్షల ఉద్యోగాలే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి



మాట్లాడుతూ.. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే అత్యంత ప్రాధాన్యతాంశమని స్పష్టం చేశారు. నైపుణ్యం పోర్టల్ ద్వారా ఉద్యోగాల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలని సూచించారు. జీరో పావర్టీ మిషన్‌లో భాగంగా రాష్ట్రంలోని 30 లక్షల పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా కలిగే ప్రయోజనాన్ని అంచనా వేయాలని, ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యమన్నారు. నీటి భద్రతను కీలక మిషన్‌గా పరిగణించి, నీటి వనరుల సమర్థ వినియోగంపై దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు తెలిపారు. నీటి ఆడిట్ నిర్వహించాలని, వివాదాలకు తావులేకుండా చూడాలని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు సస్యశ్యామలంగా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని పేర్కొన్నారు. రైతుల ఆత్మహత్యల నివారణకు పటిష్టమైన కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. 'మేడ్ ఇన్ ఆంధ్ర' బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తంగా ప్రోత్సహించాలని, అరకు కాఫీ తరహాలో రాష్ట్ర ఉత్పత్తులకు నాణ్యతతో కూడిన గుర్తింపు తీసుకురావాలని సీఎం సూచించారు. రవాణా వ్యయాన్ని తగ్గించేందుకు లాజిస్టిక్స్ మాస్టర్ ప్లాన్, స్వచ్ఛాంధ్ర కోసం సర్క్యులర్ ఎకానమీ, సాంకేతికత వినియోగంతో పౌర సేవలను సులభతరం చేయడం వంటి అంశాలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పేదలకు నాణ్యమైన వైద్యంలో రాజీలేదు

**పీపీపీ విధానం దేశవ్యాప్తంగా అమలువుతోంది**

**విమర్శలను సమర్థంగా తిప్పి కొట్టాల్సిందే**

**అధికారులతో సమీక్షలో సీఎం చంద్రబాబు స్పష్టీకరణ**

**అమరావతి :** పేదలకు నాణ్యమైన వైద్యంలో రాజీలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వైద్య ఆరోగ్య శాఖపై సమీక్ష నిర్వహించిన సీఎం.. పీపీపీ విధానంపై ముందుకేనని తేల్చి చెప్పారు. తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచించారు. కేంద్రం మార్గదర్శకాల మేరకు వీజీఎఫ్‌కు నిర్ణయం తీసుకున్నామన్నారు. వీజీఎఫ్ కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 30 శాతం చొప్పున ఆర్థిక మద్దతు ఉంటుందని తెలిపారు. టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్‌లో మెడికల్ కాలేజీల వ్యవహారం కూటమి సర్కార్, వైసీపీ మధ్య తీవ్రమైన యుద్ధానికే తెరలేపింది.. పీపీపీ మోడ్‌ను వ్యతిరేకిస్తూ వైసీపీ పెద్ద ఎత్తున ఆందోళన, నిరసన కార్యక్రమాలు నిర్వహించి.. చివరకు కోటికి పైగా సంతకాలను గవర్నర్‌కు అందజేసిన విషయం విదితమే కాగా.. ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా నిర్మించనున్న మెడికల్ కాలేజీల టెండర్ల ప్రక్రియపై సీఎం నారా చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో వైద్య విద్య, వైద్య మౌలిక సదుపాయాల కల్పన విషయంలో వెనక్కి తగ్గేదే లేదని ఆయన స్పష్టం చేశారు. అమరావతిలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. టెండర్ల ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అంతేకాదు, బిడ్డర్స్ తో నేరుగా సంప్రదింపులు జరపాలన్న సూచన కూడా చేశారు. ఆదోని మెడికల్ కాలేజీ విషయంలో ముందుకొచ్చిన సంస్థతో ఒప్పందం ఖరారు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. కాలేజీ నిర్మాణం త్వరగా ప్రారంభమయ్యేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా పీపీపీ విధానం విజయవంతంగా అమలులో ఉందని గుర్తుచేసిన చంద్రబాబు.. ఏపీలో కూడా మెడికల్ కాలేజీలను అదే విధానంలో నిర్మించి, ప్రజలకు భారంలేకుండా మెరుగైన వైద్య విద్య అందిస్తామని తెలిపారు. మెడికల్ కాలేజీల నిర్మాణం రాష్ట్ర అభివృద్ధిలో కీలకం. ఇందులో రాజీ లేదు. ఆలస్యం లేకుండా ముందుకు వెళ్లాలి

అని తేల్చి చెప్పారు సీఎం చంద్రబాబు నాయుడు.. సీఎం వ్యాఖ్యలతో టెండర్ల ప్రక్రియ మరింత వేగం పుంజుకునే అవకాశం కనిపిస్తోంది. వైద్య రంగ విస్తరణలో ప్రభుత్వం దూకుడుగా ముందుకెళు ుండటంతో.. రాష్ట్రంలో వైద్య విద్యకు కొత్త ఊపు రానుంది అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆదోని మెడికల్ కాలేజ్ నిర్మాణానికి ముందుకొచ్చిన సంస్థతో ఒప్పందం చేసుకోవాలన్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్, వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

# అధికారంలో ఉన్నప్పుడూ.. ఇప్పుడూ విమర్శలే



మొదటి పేజీ తరువాయి

జగన్ విమర్శించారు. వైసీపీ పాలనలో ఏపీ బ్రాండ్ దెబ్బతిందని, రాష్ట్రం నుంచి పరిశ్రమలు తరలిపోయాయని, పారిశ్రామికవేత్తలు పారిపోయారని, ఎలాంటి పారిశ్రామిక పురోగతి లేదంటూ కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలు నిజమైతే రాష్ట్రంలోని తయారీ, పారిశ్రామిక రంగాల పనితీరు అత్యంత దారుణంగా ఉండేదని జగన్ వ్యాఖ్యానిం చారు. కానీ వాస్తవ గణాంకాలు మాత్రం పూర్తి భిన్నమైన పరిస్థితిని స్పష్టంగా చూపిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. భారత రిజర్వ్ బ్యాంక్ ఈ నెల విడుదల చేసిన అధికారిక గణాంకాల ప్రకారం, 2019-2024 కాలంలో ఉత్పత్తి రంగంలో ఆంధ్రప్రదేశ్ దక్షిణ భారతదేశంలో ప్రథమ స్థానంలో, యావత్ దేశంలో 5వ స్థానంలో నిలిచిందని జగన్ గుర్తుచేశారు. అదే విధంగా, పారిశ్రామిక రంగం మొత్తం పురోగతిలో కూడా ఆంధప్రదేశ్ దక్షిణ భారతంలో నెం.1గా, దేశవ్యాప్తంగా 8వ స్థానంలో నిలిచిందని తెలిపారు. ఇలాంటి గణాంకాలు ఉన్నప్పటికీ బ్రాండ్ ఏపీ నాశనమైందని ఎలా చెబుతారని ప్రశ్నించిన జగన్, ఇది సమర్థవంతమైన పాలన ఫలితమా? లేక కావాలనే చేసిన దుష్ప్రచారమా? అని నిలదీశారు. చివరగా, నిజాలు ఎప్పటికైనా బయటకు వస్తాయని పేర్కొంటూ 'సత్యమేవ జయతే' అంటూ తన వ్యాఖ్యలను ముగించారు.

**జగన్‌కు జ్వరం..కార్యక్రమాలు రద్దు**

**పులివెందుల :** వైసిపి అధినేత వైఎస్.జగన్ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. జ్వరంతో బాధపడుతున్న కారణంగా డాక్టర్ల సూచన మేరకు బుధవారం)కార్యక్రమాలను రద్దు చేసుకున్నారు. ఈ మేరకు వైసిపి ఎక్స్ వేదికగా ఈ ప్రకటనను విడుదల చేసింది. పులివెందుల పర్యటనలో భాగంగా వైఎస్ జగన్ ఇడుపులపాయలో ప్రార్థనల్లో పాల్గొనాల్సి ఉంది. అలాగే, మధ్యాహ్నం పులివెందుల క్యాంపు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండాల్సి ఉండగా, అనారోగ్యం కారణంగా ఈ కార్యక్రమాలు రద్దయ్యాయి. క్రిస్మస్ సందర్భంగా గురువారం పులివెందుల సీఎస్ఐ చర్చి క్రిస్టమస్ వేడుకల్లో వైఎస్ జగన్ పాల్గొనే అవకాశం ఉంది.

# జగన్ హయాంలో తిరుమల భ్రష్టు

**కల్తీ నెయ్యి వ్యవహారాలు బయటపడుతున్నాయి : మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి**



**అమరావతి :** జగన్ ప్రభుత్వ హయాంలో తిరుమల తిరుపతి దేవస్థానం టీటీడీలో అనేక అవినీతి కార్యక్రమాలు జరిగాయని.. అన్ని ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. బుధవారం అమరావతిలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. స్వామి వారి లడ్డు ప్రసాదం తయారీలో వినియోగించిన కల్తీ నెయ్యి వ్యవహారంలో సైతం సంచలన విషయాలు బయటకు వస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే భక్తులనే కాకుండా.. దేశవిదేశాల నుంచి వచ్చే భక్తులను కూడా అనేక ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు. అంతేకాదు.. తిరుమల వచ్చే భక్తులకు సౌకర్యాల కల్పించే విషయంలో కూడా గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిం దంటూ మండిపడ్డారు. టీటీడీ చైర్మన్‌గా వైవీ సుబ్బారెడ్డి ఉన్న సమయంలో అనేక అక్రమాలు జరిగాయని ఆరోపించారు. నేడు ఆయన నేడు బయటకు వచ్చి ఎటువంటి అక్రమాలు జరగలేదని చెప్తున్నాడంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత ప్రభుత్వ పాలనలో అన్నప్రసాదంలో కానీ, వసతి విషయంలో కానీ అక్రమాలన్నీటిని బయటకు తీస్తున్నామని మంత్రి జనార్దన్ రెడ్డి వివరించారు. డిసెంబర్ 30వ తేదీన వైకుంఠ ఏకాదశి అని.. ఆ రోజు 90 శాతానికి పైగా సామన్య భక్తులకు సౌకర్యాలు కల్పించాలనే ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. అలాగే, లడ్డు ప్రసాదం తయారీకి వినియోగిస్తున్న నెయ్యిని కూడా అన్ని పరీక్షలు నిర్వహించి తరువాతే లడ్డు తయారీకి ఉపయోగిస్తున్నామని వివరించారు. ఇవన్నీ చూసి ఓర్వలేక.. పత్రికల ద్వారా తిరుమలపై అసత్య ప్రచారాలు చేయిస్తున్నారంటూ వైసీపీ నాయకులపై మండిపడ్డారు. దేవుడి మీద నమ్మకం లేని భూమన కరుణాకర్ రెడ్డికి టీటీడీ పదవిని కట్టబెట్టడమే గత ప్రభుత్వ తప్పు అని ప్రజలందరూ అనుకుంటున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ పాలన పట్ల ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని.. ఇది చూసి వైసీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారు. ఇటీవల విశాఖపట్నం వేదికగా నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సు ద్వారా రాష్ట్రానికి కోట్లాది రూపాయల పెట్టుబడులుగా వచ్చాయన్నారు. దీంతో దేశం మొత్తం ఆంధ్రరాష్ట్ర పురోగతి చూస్తుందని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు.

# వైకాపా విమర్శలతో ఒరిగేదేమీ లేదు: పార్థసారథి

**అమరావతి :** వైకాపా తనచుగా చేస్తున్న విమర్శలతో ఎపికి నష్టమే తప్ప లాభం లేదని సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఐదేళ్ల విధ్వంసం నుంచి ఇప్పుడిప్పుడే రాష్ట్రం గాడిలో పడుతోందన్నారు. అసలు పునాదే లేని పరిస్థితుల్లో వైకాపా ఐదేళ్ల విధ్వంసం నుంచి అమరావతిని అభివృద్ధి చేస్తుంటే.. మీరు ఇలా మాట్లాడటం తగదని పేర్కొన్నారు. ఇకపోతే తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌కు భాష, యాస, ప్రాసపై పట్టుందని ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం తగదని పార్థసారథి అన్నారు. రాష్ట్రం, పెట్టుబడులపై కేసీఆర్ మాట్లాడిన తీరు బాధాకరమని పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలన్నదే సీఎం చంద్రబాబు ధ్యేయమని, ఈ విషయాన్ని ఆయన పలుమార్లు చెప్పారని గుర్తు చేశారు. 'ఆంధప్రదేశ్‌కు వస్తున్న పెట్టుబడులపై మీకు ఏమైనా అనుమానాలు ఉంటే, మేం వాటిని పారదర్శకతతో చూపిస్తాం. ఆ పెట్టుబడిదారులు తెలంగాణలో కూడా పెట్టారు.. అది తెలుసుకోండి. హైదరాబాద్ నగరానికి బలమైన పునాది ఉంది. దానిని మీరు అభివృద్ధి చేసి ఉండొచ్చన్నారు.

# మాట నిలబెట్టుకున్న పవన్ కల్యాణ్

మొదటి పేజీ తరువాయి



రూ.50 వేల నగదు, వికలాంగుడైన ఆమె మనవడికి లక్ష రూపాయలను డిప్యూటీ సీఎం అందజేశారు. అంతే కాకుండా పవన్ కళ్యాణ్ తన ఎమ్మెల్యే జీతం నుంచి రూ.5 వేలు ప్రతినెల పెన్షన్ రూపంలో వృద్ధురాలికి ఇస్తామని హామీ ఇచ్చారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న ఇండ్ల నాగేశ్వరమ్మ కుమారుడు కోసం రూ.3 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్‌ను అందజేశారు. భవిష్యత్తులో అండగా ఉంటామని వృద్ధురాలికి హామీ ఇచ్చారు. ఎప్పుడు ఎలాంటి సహాయం కావాలన్నా పార్టీ ఆఫీస్‌కు రావాలని ఇండ్ల నాగేశ్వరమ్మకు పవన్ కళ్యాణ్ చెప్పారు. పవన్ రాకతో నాగేశ్వరమ్మ సంతోషం వ్యక్తం చేసింది. గత వైసీపీ హయాంలో రోడ్డు విస్తరణ పేరుతో ఇప్పటంలో జనసేన కార్యకర్తల ఇళ్లను కూల్చివేసిన విషయం తెలిసిందే. జనసేన ఆవిర్భావ సభకు భూములు ఇచ్చారనే కక్షతోనే ఇళ్లను కూల్చేశారనే ఆరోపణలు ఉన్నాయి. విషయం తెలిసిన వెంటనే అప్పట్లో గ్రామంలో పర్యటించిన పవన్.. బాధితులకు అండగా నిలిచారు. ఈ క్రమంలో వృద్ధురాలు ఇండ్ల నాగేశ్వరమ్మ కూడా పవన్‌ను కలిశారు. ఎన్నికల్లో గెలిచాక తమ గ్రామానికి రావాలని పవన్‌ను వృద్ధురాలు కోరారు. ఆమెకు ఇచ్చిన మాట ప్రకారం బుధవారం పవన్ ఇప్పటం గ్రామంలో పర్యటించి వృద్ధురాలిని పరామర్శించడంతో పాటు ఆమెకు ఆర్థిక సాయాన్ని అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు

# హాస్పిటాలిటీ ఇండస్ట్రీకి రుషికొండ ప్యాలెస్

**అన్ని విధాలుగా ఆలోచన చేస్తున్నాం**

**ప్యాలెస్ వినియోగంపై ఉపసంఘం చర్చ**



**అమరావతి :** విశాఖ రుషికొండ ప్యాలస్‌పై మంత్రి వర్గ ఉపసంఘం సమావేశం జరిగిందని... హాస్పిటాలిటీ ఇండస్ట్రీకి ప్యాలెస్‌ను ఇచ్చే అంశంపై పరిశీలించినట్లు ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. కానీ కొంతమంది హోటల్ కోసం అదనపు స్థలం కావాలని అడిగారని చెప్పారు. రుషికొండ కింద ఉన్న 9 ఎకరాలు స్థలంలో ఏడు ఎకరాలు సీఆర్‌జెడ్ నిబంధనలోకి వస్తాయని.. ఆ 7 ఎకరాల్లో ఎలాంటి నిర్మాణం చేయకూడదన్నారు. తమకు ఇదో సవాల్‌గా మారిందన్నారు. ఎల్లుండి మరోసారి సమావేశం అవనున్నట్లు చెప్పారు. రుషికొండ నిర్మాణాలపై మళ్ళీ నిర్మాణాలు చేసే అవకాశం ఉందని.. పైన రెండు ఫ్లోర్లు వేసుకునే అవకాశం ఉందన్నారు. రుషికొండ చివరి రెండు బ్లాక్‌లు ప్రజలకు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణకు, టూరిస్ట్ అవసరాల కోసం ఉంచుతామని చెప్పారు. తాజ్ గ్రూప్, లీలా హోటల్ గ్రూప్, అట్మాస్ఫియర్ కోర్ వంటి గ్రూప్ హోటల్స్ ముందుకు వచ్చాయని మంత్రి పయ్యవుల కేశవ్ పేర్కొన్నారు. రుషికొండపై ఇప్పుడు తలబద్దలు కొట్టుకోడానికి ఆనాటి ప్రభుత్వమే కారణమని ఏపీ టూరిజం శాఖా మంత్రి కందుల దుర్గేష్ విమర్శించారు. ఆదాయం వచ్చే భవనాలు కూల్చి ప్యాలెస్ కట్టారని మండిపడ్డారు. మరోసారి రుషికొండ వినియోగంపై చర్చ జరుగుతుందన్నారు. అనేక ప్రపోజల్స్ వస్తున్నాయని.. వయబుల్ ప్రాజెక్ట్ ఏంటి అనే అంశంపై దృష్టి పెట్టామని తెలిపారు. సముద్రం ఆటు పోట్ల వల్ల రుషికొండ కింద 9 ఎకరాల్లో 2 ఎకరాలు మాత్రమే అందుబాటులోకి వస్తాయన్నారు. ఏడు ఎకరాలు సీఆర్‌జెడ్ నిబంధనల పరిధిలోకి ఉంటాయని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. ఃూగా.. రుషికొండ ప్యాలెస్‌ను ఎలా వినియోగించాలన్న అంశంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ 3వ భేటీ బుధవారం జరిగింది. సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, టూరిజం ఎండీ, ఏపీ టీఏ సీఈఓ ఆమ్రపాలి కాట, పర్యాటక శాఖ అధికారులు పాల్గొనగా... మంత్రి మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి వర్చువల్‌గా పాల్గొన్నారు.

# వాజ్‌పేయ్ ఆశయాలకు అనుగుణంగా మోడీ పాలన

**నేటి తరానికి వాజ్‌పేయ్ విలువలు ఆదర్శం**

**నేడు వాజ్‌పేయ్ విగ్రహావిష్కరణ : బీజేపీ ఏపీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్**

**విజయవాడ :** అటల్ మోదీ సుపరిపాలన యాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని బీజేపీ ఏపీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి జిల్లాలో వాజ్‌పేయి విగ్రహాలను చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. నేటి తరానికి వాజ్‌పేయి విలువలు ఆదర్శమని అన్నారు. వాజ్‌పేయి ఆశయాలకు అనుగుణంగా మోదీ అద్భుతమైన పాలన సాగిస్తూ దేశాన్ని ముందుకు తీసుకువెళుతున్నారని తెలిపారు. 2047 నాటికి వికసిత భారత్, వికసిత్ ఏపీ కోసం అందరం కలిసి పని చేస్తామని స్పష్టం చేశారు. సుపరిపాలన యాత్రలకు, సభలకు సహకారం అందించిన వారందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఈనెల 25న జరిగే వాజ్ పేయి భారీ విగ్రహం ఆవిష్కరణ సభకు పెద్ద ఎత్తున ప్రజలు తరలి రావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ పిలుపునిచ్చారు. వాజ్‌పేయి గొప్పతనం తెలుసుకుని అందరూ ఆశ్చర్యవ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ సుపరిపాలన యాత్ర గురించి సీఎం చంద్రబాబుకు చెప్పిన వెంటనే ఆనందం వెలిబుచ్చారని తెలిపారు. ఈ యాత్రకు కూటమిపరంగా , ప్రభుత్వపరంగా సహకారం అందించారని చెప్పారు. ఈ యాత్రలు, సభల్లో కూటమి పార్టీల నేతలను భాగస్వామ్యం చేశారన్నారు. అటల్, చంద్రబాబులకు మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయని తెలిపారు. సైబరాబాద్, శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లకు నాడు వాజ్‌పేయి సహకారం అందించారని గుర్తుచేశారు. సుపరిపాలన యాత్రలో బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారన్నారు. వాజ్‌పేయి ఈ దేశానికి చేసిన సేవకు, త్యాగాలను గురించి అందరూ ముక్త కంఠంతో కీర్తిస్తున్నారని తెలిపారు. ఈనెల 25న వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా అమరావతిలో స్మృతి వనం, విగ్రహాన్ని ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, పలువురు కేంద్ర మంత్రులు పాల్గొంటారని తెలిపారు. ధర్మవరం నుంచి అమరావతి వరకు తమ యాత్రకు ప్రజలు నుంచి విశేష ఆదరణ లభించిందన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం, గ్రామాలకు రోడ్లు, ఐటీ, టెలికం, పొలిటికల్ కనెక్టివిటీలకు ఆద్యులు వాజ్‌పేయి అని కొనియాడారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా అనే తేడా లేకుండా ప్రజలు నుంచి వస్తున్న స్పందన అపూర్వమన్నారు. నేటి యువతరం, భవిష్యత్తుతరాలు వాజ్‌పేయి గొప్పతనం తెలుసుకోవాలని సూచించారు. తాము ఏర్పాటు చేసిన విగ్రహాలు, యాత్ర ద్వారా వాజ్‌పేయి నుంచి చాలా మంది స్ఫూర్తి పొందుతున్నారన్నారు.

# ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రత

## శిలాజ ఇంధనాల వాడకం కూడా ఓ కారణం

## నేను మూడ్రోజుల్లోనే ఇన్‌ఫెక్షన్ బారిన పడ్డా

## కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రతపై కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరిఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు తన శాఖ కూడా ఒక కారణమనే విషయాన్ని అర్ కరిస్తున్నానని అన్నారు. బుధవారంనాడు ఢిల్లీలో మాజీ కేంద్ర సమాచార కమిషనర్ ఉదయ్ మాహూర్‌కర్ రాసిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, భారతదేశం ఏటా రూ.22 లక్షల కోట్ల విలువైన శిలాజ ఇంధానాలను దిగుమతి చేసుకుంటోందని, ఇది కాలుష్యానికి ఒక కీలక కారణమవు తోందని అన్నారు. 'నేను ఇక్కడ రెండ్రోజులుగా ఉంటున్నాను. దీంతో ఇన్‌పెక్షన్ బారినపడ్డాను. ఢిల్లీ తీవ్ర కాలుష్యం గుప్పిట్లో ఉంది. నేను రవాణా శాఖ మంత్రిగా ఉన్నాను. రవాణా వల్లే 40 శాతం కాలుష్యం వస్తోంది. పెద్దఎత్తున శిలాజ ఇంధనం వాడకమే ఇందుకు కారణమవుతోంది. మనం ప్రత్యామ్నాయ పరిష్కరాలను అభివృద్ధి చేస్తున్నప్పటికీ వాటిని అందిపుచ్చుకునేందుకు ప్రజలు వెనకాడుతున్నారు' అని గడ్కరి అన్నారు. బయో ఇంధనాల వాడకం ద్వారా స్వయం సమృద్ధి భారత్ దిశగా మనం ముందుకు వెళ్లలేమా అని గడ్కరి ప్రశ్నించారు. తాను 100 శాతం ఇథనాల్‌తో కారును వాడుతున్నానని, ఇది 60 శాతం ఎలక్ట్రిసిటీని జనరేట్ చేస్తోందని, పొల్యూషన్ అనేదే లేదని చెప్పారు. గతంలోనూ నితిన్ గడ్కరి ఢిల్లీలో గాలి నాణ్యత రోజురోజుకూ పడిపోతుండటంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ ఎప్పుడు వచ్చినా రెండు మూడు రోజులే ఉంటానని, ఎప్పుడెప్పుడు వెళ్లిపోదామా అని అనుకుంటానని చెప్పారు. నేను ఇక్కడ మూడు రోజులుగా ఉంటున్నాను. ఈ కాలుష్యం వల్ల నాకు అలర్జీ వచ్చింది. నేను రవాణా శాఖ మంత్రిగా ఉన్నాను. రవాణా వల్లే 40 శాతం కాలుష్యం వస్తోంది. శిలాజ ఇంధనాల వాడకాన్ని గణనీయంగా తగ్గించాల్సిన అవసరం ఉంది. శిలాజ ఇంధనాలు పరిమితంగా ఉన్నాయి. కానీ కాలుష్యం మాత్రం పెరిగిపోతోంది. మనం వాటి వాడకాన్ని తగ్గించలేమా..? కాలుష్యాన్ని తగ్గించే ఎలక్ట్రిక్ వాహనాలు, హైడ్రోజన్ ఆధారిత వాహనాలకు ప్రోత్సాహం లభించాలని గడ్కరీ వ్యాఖ్యలు చేశారు. భారతదేశం శిలాజ ఇంధనాలపై ఏటా దాదాపు రూ.22 లక్షల కోట్లు ఖర్చు చేస్తోంది.కేంద్ర మంత్రి ఇథనాల్ వాడకాన్ని ప్రోత్సహిస్తోన్న సంగతి తెలిసిందే. ప్రముఖ కార్ల తయారీ సంస్థ టయోటా తయారుచేసిన తొలి ఫ్లెక్స్‌ఫ్యూయల్ కారును ఇప్పటికే నితిన్ గడ్కరీ ఆవిష్కరించారు. పెట్రోల్, ఇథనాల్‌ను కలిపి వినియోగించడాన్నే ఫ్లెక్స్‌ఫ్యూయల్ అని పిలుస్తారు. ఇది కాలుష్యాన్ని, శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గిస్తుందని మంత్రి పేర్కొన్నారు. దిల్లీ లో గాలి నాణ్యత రోజురోజుకూ పడిపోతోంది. మంగళవారం అతి తీవ్రస్థాయికి దిగజారింది. బుధవారం ఉదయం కాస్త మెరుగుపడింది. ఇదిలాఉంటే.. గతంలోనూ ఆయన దిల్లీ కాలుష్యం గురించి మాట్లాడారు. 'నేను రెండు లేదా మూడు రోజులు మాత్రమే దిల్లీలో ఉంటాను. ఇక్కడికి వచ్చినప్పుడు ఎప్పుడెప్పుడు వెళ్లిపోదామా అని ఆలోచిస్తుంటా. నేను ముందే రిటర్న్ టికెట్లను బుక్ చేసుకుంటా' అని వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

# హెచ్-1 వీసా ఫీజుపై కోర్టులో సవాల్

### దావాను తిరస్కరించిన ఫెడరల్ జడ్జ్

**వాషింగ్టన్ :** హెచ్-1బి వీసాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన లక్ష డాలర్ల భారీ ఫీజును సవాలు చేస్తూ యుఎస్ చాంబర్ ఆఫ్ కామర్స్ వేసిన దావాను ఫెడరల్ జడ్జి మంగళవారం తిరస్కరించారు. ఇది వలసల నియంత్రణపై అధ్యక్షుని విస్తృత అధికారాల పరిధి కిందకు వస్తుందని అన్నారు. ఈ రుసుము సమాఖ్య వలస చట్టానికి విరుద్ధంగా ఉందని, దీంతో పలు కంపెనీలు, ఆస్పత్రులు, ఇతర యజమానులు ఉద్యోగాలను, ప్రజలకు అందించే సేవలను తగ్గించుకోవాల్సి వస్తుందన్న యుఎస్ చాంబర్ ఆఫ్ కామర్స్ వాదనలను వాషింగ్టన్ డిసిలోని యుఎస్ డిస్టిక్ట్ జడ్జి బెరిల్ హోవెల్ తోసిపుచ్చారు. విధాన నిర్ణయం చట్టబద్ధతను అంచనా వేయడం మాత్రమే కోర్టు పరిధిలో ఉందని, దాని అర్హతను నిర్ణయించడం కాదని జడ్జిహోవెల్ పేర్కొన్నారు. విధాన నిర్ణయం నిర్దేశించిన ప్రకటనలో వ్యక్తీకరించబడిన చర్యలు చట్టం పరిమితులకు లోబడి ఉన్నంతవరకు వాటిని సమర్థించాల అని అన్నారు. హెచ్-1బి వీసాలతో అమెరికా కార్మికులను స్థానభ్రంశం చేస్తుందనే తన వాదనకు ట్రంప్ తగిన మద్దతు ఇచ్చారని జస్టిస్ హోవెల్ పేర్కొన్నారు. హెచ్-1బి వీసాల కోసం వేలాది మంది అమెరికన్లను తొలగించిన కంపెనీలను కూడా ఉదహరించారని అన్నారు. స్టిస్ హోవెల్‌ను అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా నియమించారు. చిన్న మరియు మధ్యతరహా వ్యాపారాలు ఈ రుసుమును భరించలేవని చాంబర్ ఆఫ్ ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు, చీఫ్ కౌన్సిల్ డారిల్ జోసెఫర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోర్టు నిర్ణయంతో తాము నిరాశ చెందామని అన్నారు. మరిన్ని చట్టపరమైన ఎంపికలను పరిశీలిస్తున్నామని అన్నారు. హెచ్1బి వీసా రుసుము పెంపుపై పలు కార్మికసంఘాలు, విద్యావేత్తలు, మతసంస్థలు కూడా కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

# అమెరికా నార్త్‌కరోలినాలో కూలిన వ్యాపార జెట్

### విమానంలోని ఏడుగురు దుర్మరణం

**న్యూయార్క్ :** అమెరికాలోని నార్త్ కరోలినా రాష్ట్రంలో ఒక వ్యాపార జెట్ కూలిపోయి, విమానంలో ఉన్న ఏడుగురు మరణించారు. నాస్కర్ బృందాలు మరియు ఫార్చ్యూన్ 500 కంపెనీలు ఉపయోగించే నార్త్ కరోలినాలోని ప్రాంతీయ విమానాశ్రయంలో ఈ ప్రమాదం జరిగింది. రిటైర్డ్ నాస్కర్ డ్రైవర్ గ్రెగ్ బిఫిల్, అతని కుటుంబంతో సహా విమానంలో ఏడుగురు వ్యక్తులు ఉన్నారని అధికారులు తెలిపారు. ప్రమాదం తర్వాత విమానం పేలి పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదం గ్రెగ్ బిఫిల్ నడుపుతున్న కంపెనీకి రిజిస్టర్ చేయబడిన సెస్నా అ550 విమానం షార్లెట్‌కు ఉత్తరాన 72 కిలోమీటర్ల దూరంలో ఉన్న స్టేట్స్‌విల్లే ప్రాంతీయ విమానాశ్రయం నుండి బయలుదేరింది. కానీ ల్యాండ్ చేయడానికి ప్రయత్నిస్తుండగా కూలిపోయిందని నార్త్ కరోలినా హైవే పెట్రోల్ తెలిపింది. ప్రమాదం జరిగిన సమయంలో చినుకులు, మేఘావృతమైన వాతావరణం ఉందని ంఇఇబీచి।జీబిఠ।స వాతావరణ సంస్థ నివేదించింది. ఈ÷తిణఠబింలిజీస।.ఇనీప పోస్ట్ చేసిన ట్రాకింగ్ డేటా ప్రకారం, విమానం ఉదయం 10 గంటల తర్వాత విమానాశ్రయం నుండి బయలుదేరింది, కానీ తిరిగి ల్యాండ్ అయ్యే ప్రయత్నంలో కూలిపోయి మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంపై జాతీయ రవాణా భద్రతా బోర్డు ,ఎఫ్ఎ దర్యాప్తు ప్రారంభించాయి.

# ఇస్రో మరో మైలురాయి

### కక్ష్యలోకి చేరిన అత్యంత భారీ ఉపగ్రహంగా బ్లూబర్డ్ బ్లాక్-2 రికార్డు

### భారత వాణిజ్య అంతరిక్ష సామర్థ్యానికి అంతర్జాతీయ గుర్తింపు

### అమెరికా పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టామన్న ఇస్రో చైర్మన్



**తిరుపతి :** భారత అంతరిక్ష పరిశోధాన సంస్థ ఇస్రో మరో మైలురాయిని చేరింది. శ్రీహరి కోటలో బాహుబలి రాకెట్ ప్రయోగం విజయవంతం అయ్యింది. అమెరికాకు చెందిన భారీ కమ్యూనికేషన్ శాటిలైట్ బ్లూ బర్డ్ బ్లాక్-2ను ఈ రాకెట్ విజయవంతంగా నింగిలోకి తీసుకెళ్లింది. తొలిసారిగా ఇంతటి భారీ ఉపగ్రహాన్ని ఇస్రో నింగిలోకి పంపింది. కేవలం 15 నిమిషాల్లోనే బ్లూబర్డ్ ప్రయోగం విజయవంతమైంది. అమెరికాకు చెందిన ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ సంస్థతో కలిసి ఇస్రో ఈ ప్రయోగం నిర్వహించింది. ప్రపంచంలో ఎక్కడి నుంచైనా 4.జి, 5జి సేవలను బ్లూ బార్డ్ బ్లాక్-2 అందించనుంది. ఎల్‌వీఎం 3 రాకెట్ సిరీస్‌లో ఇది 9వ ప్రయోగం. ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్ నారాయణన్ మాట్లాడుతూ.. బాహుబలి ప్రయోగం విజయవంతమైందన్నారు. ఎల్‌వీఎంప్రయోగాల్లో సంపూర్ణ విజయాలు సాధిస్తున్నామని తెలిపారు. అతి తక్కువ సమయంలో రాకెట్ రూపొందించి విజయవంతం చేశామన్నారు. అమెరికన్ కస్టమర్ కోసం ప్రయోగం చేపట్టామని చెప్పారు. ప్రపంచంలో అత్యుత్తమ ప్రయోగాల్లో ఇది ఒకటన్నారు. 34 దేశాలకు ఇస్రో సేవలందిస్తోందని అన్నారు. గగన్‌యాన్ కోసం ఈ ప్రయోగం మరింత ఆత్మవిశ్వాసం కలిగిస్తోందని తెలిపారు. ఇస్రోపై అమెరికా పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టామని ఇస్రో చైర్మన్ తెలిపారు. ఈ ప్రయోగం ఇస్రోకి చారిత్రాత్మకమైన విజయమన్నారు. వాణిజ్య ప్రయోగాలలో మరోసారి సత్తా చాటామని తెలిపారు. అత్యంత కీలకమైన ఈ ప్రయోగం 52 రోజుల్లోనే సిద్ధం చేసి ప్రయోగం చేపట్టామని చెప్పారు. మన శాస్త్రవేత్తల సమిష్టి విజయం.. ఎల్‌వీఎం 3 - ఎం 6 రాకెట్ ప్రయోగం అని చెప్పుకొచ్చారు. ఈ ప్రయోగ విజయం తమకు అత్యంత ధైర్యాన్ని కల్పించిందన్నారు. ఎల్‌వీఎం ప్రయోగాలలో ఈ ప్రయోగం మూడవ వాణిజ్య ప్రయోగమని వెల్లడించారు. ఎల్‌వీఎం రాకెట్లనే చంద్రయాన్ 4, 5కు ఉపయోగిస్తున్నామన్నారు. భవిష్యత్తులో మానవ రహిత ప్రయోగాలని చేపట్టబోతున్నామని ప్రకటించారు. వాణిజ్య ప్రయోగ ఒప్పందాలు పూర్తయిన వెంటనే వరస వాణిజ్య ప్రయోగాలని చేపడుతున్నామన్నారు. భవిష్యత్తులో నావిగేషన్ ప్రయోగాలు, అంతరిక్షంలో స్పేస్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నామని ఇస్రో చైర్మన్ నారాయణన్ పేర్కొన్నారు.

# ఇస్రో ప్రయోగంతో బలమైన పునాదులు

### అంతరిక్షంలో ప్రపంచ సహకారంతో ముందుడుగు

### ఇస్రోకు ప్రధాని మోడీ అభినందనలు..

### చంద్రబాబు, లోకేశ్ అభినందనల

**న్యూఢిల్లీ :** శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి బుధవారం ప్రయోగించిన బాహుబి రాకెట్ ఎల్‌వీఎం3- ఎం6 ప్రయోగం విజయవంతమైంది. అమెరికాకు చెందిన అధునాతన కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూ బర్డ్ బ్లాక్ 2 ను ఇస్రో విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశ పెట్టింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంపై దేశంలోని పలువురు ప్రముఖులు స్పందించారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రాబబు నాయుడు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తమ ఎక్స్ ఖాతాల వేదికగా వేర్వేరుగా స్పందించారు. ప్రధాని మోదీ స్పందిస్తూ.. భారతదేశ యువత శక్తితో.. మన అంతరిక్ష రంగం మరింత అభివృద్ధి చెందుతోందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇది ప్రభావ వంతంగా మారుతోందని ఆయన ఆకాంక్షించారు. ఎల్‌వీఎమ్ 3 నమ్మకమైన హెవీ లిఫ్ట్ పనితీరును కనబరుస్తుందన్నారు. గగన్‌యాన్ వంటి భవిష్యత్ మిషన్ల కోసం బలమైన పునాదులు వేస్తున్నామని తెలిపారు. అలాగే వాణిజ్య ప్రయోగ సేవలను సైతం విస్తరిస్తున్నామని పేర్కొన్నారు. ప్రపంచ భాగస్వామ్యంతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ఇది భవిష్యత్తు తరాల సామర్థ్యంతోపాటు స్వావలంబను మరింత బలోపేతం చేస్తుందని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు. శ్రీహరికోట నుంచి ఎల్‌వీఎమ్3- ఎమ్6ను బుధవారం ఇస్రో విజయవంతంగా ప్రయోగించింది. ఈ సందర్భంగా ఇస్రో బృందానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. యూఎస్ కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూబర్డ్ బ్లాక్ 2 మోసుకెళ్లి.. అందుకు నిర్దేశిరచిన కక్ష్యలో ఈ ఉపగ్రహం ఉంచిందన్నారు. భారత్ నేలపై నుంచి ఇప్పటి వరకు అత్యంత బరువైన ఉపగ్రహాన్ని ప్రయోగించ లేదని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తాజాగా ఈ ఉపగ్రహాన్ని ప్రయోగించడం ద్వారా మన దేశ వాణిజ్య అంతరిక్ష సామర్థ్యం, ప్రపంచ ప్రయోగ భాగస్వామిగా దాని స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు.

ఈ అద్భుతమైన మిషన్ విజయానికి దోహదపడిన శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు ఇలా ప్రతి ఒక్కరికీ సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. బాహుబలి రాకెట్ అని పిలువబడే ఎల్‌వీఎమ్3 - ఎమ్ రాకెట్‌ను శ్రీహరికోట నుంచి ఈ రోజు విజయవంతంగా ప్రయోగించినందుకు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)లోని శాస్త్రవేత్తలు, సిబ్బందికి రాష్ట్ర ఐటీ విద్య శాఖ మంత్రి లోకేశ్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. భారతదేశ వాణిజ్య ప్రయోగ సామర్థ్యాలను ప్రపంచం ఎదుట ప్రదర్శించడానికి ఇది ఒక ముఖ్యమైన అడుగుగా ఆయన అభివర్ణించారు. రానున్న రోజుల్లో ఇస్రో మరిన్ని విజయాలు సాధించుకోవాలని కోరుకుంటున్నట్లు మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు.

# ఇకపై సినిమా టిక్కెట్ ధరల హేతుబద్దీకరణ

### బడ్జెట్ పేరుతో ఎడాపెడా పెంచకుండా చర్యలు

### ఆంధ్రప్రదేశ్ సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్



**అమరావతి :** ప్రతిసారి సినిమా బ్జడెట్ ప్రకారం టికెట్ రేట్లు పెంచుతున్నామని, ఇకపై ఇందుకోసం ఓ నూతన విధానాన్ని రూపొందిస్తామని ఆంధ్రప్రదేశ్ సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం సచివాలయంలో సినిమా టికెట్ల హేతుబద్ధీకరణపై కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా అనేక అంశాలపై అధికారులతో మంత్రి చర్చించారు. ఇప్పటి వరకూ పాత జీవో, సినిమా బడ్జెట్ ప్రకారం సినిమా టికెట్ రేట్లు పెంచుతున్నాం. ఇక నుంచి అలా కాకుండా ఓ విధానాన్ని రూపొందించాలని నిర్ణయించాం. అన్నింటికీ కేటగిరీ ప్రకారం సమానంగా టికెట్లు రేట్లు పెంచే విధానాన్ని పరిశీలిస్తున్నాం అని అన్నారు.. సినిమాలకు టికెట్ ధరను ఎంత నిర్ణయించాలనే విషయమై కమిటీ చర్చిస్తోంది. నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబ్యూటర్ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తుది నిర్ణయం తీసుకుంటాం. పాన్ ఇండియా సినిమా వల్ల నిర్మాతలకు బడ్జెట్ విపరీతంగా పెరుగుతోంది. నిర్మాతలకు ప్రభుత్వం మద్దతు నిచ్చేలా కమిటీ నిర్ణయం తీసుకుంటుంది. అదే సమయంలో సామాన్యులకూ భారం కాకుండా, సినీ పరిశ్రమకు మేలు జరిగేలా నిర్ణయాలు ఉంటాయని అన్నారు. ఈ సందర్భంగా తెలుగు సినీ దర్శకుడు తేజ మాట్లాడుతూ.. సినిమా థియేటర్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. థియేటర్‌లో టికెట్ ధర కంటే పాప్‌కార్న్ ధర ఎక్కువగా ఉందని, దీనిపై దృష్టిసారించాలి కోరినట్లు వివరించారు. ఓటీటీ పైరసీ వల్ల సినిమా పరిశ్రమ నష్టపోతోందన్న తేజ.. సినిమా ఇండస్ట్రీ వైపు నుంచి తమ అభిప్రాయాన్ని కమిటీలో చెప్పినట్లు పేర్కొన్నారు.

# కావాలనే తమపై నిందలు మోపారు

### ఆరోపణలపై విచారణలో నిజాలు నిగ్గు తేలుతాయి

### మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆవేదన

**అమరావతి :** రాజకీయంగా ఎదుర్కోలేకే.. తన కుటుంబం, వ్యక్తిగత సహాయకుడి(పీఏ)పై నింద మోపారని ఏపీ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఎలాంటి తప్పు చేయకపోయినా తీవ్ర ఆరోపణలు చేశారని చెప్పారు. వాస్తవాలు తెలుసుకోకుండా కొన్ని ఛానళ్లు నా కుటుంబాన్ని అభాసుపాలు చేశాయని మండిపడ్డారు. నెల రోజుల పాటు నన్ను ఎంతో బాధపెట్టారని ఆమె ఆవేదన చెందారు. నన్ను, నా కుమారుడిని బాధపెట్టిన ఎవర్నీ విడిచిపెట్టేది లేదు. ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ చేయాలని సైబర్ క్రైమ్ అధికారులను కోరానని సంధ్యారాణి తెలిపారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వ్యక్తిగత సహాయకుడు (పీఏ) సతీశ్, ఆమె కుమారుడిపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ మాధవరెడ్డి మంగళవారం స్పష్టం చేశారు. వాట్సప్‌లో అసభ్యకర సమాచారం పంపినట్లు ఓ మహిళ చేసిన ఆరోపణల్లో నిజం లేదని చెప్పారు. ఈ నేపథ్యంలో మంత్రి దీనిపై బుధవారం మాట్లాడారు. నిజాలు తెలుసుకోకుండా బురదజల్లడం సరికాదన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న తమను టార్గెట్ చేయడం దారుణమని అన్నారు.

# రైలులో యువకుడికి గుండెపోటు

### అధికారుల నిర్లక్ష్యంతో చికిత్స అందక మృతి

**ముంబై :** ముంబైలోని స్థానిక రైలులో ప్రయాణిస్తున్న యువకుడు గుండెపోటుకు గురై చికిత్స పొందలేక మృతి చెందాడు. ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్-పన్వేల్ రైలులో ప్రయాణిస్తున్నప్పుడు ఛాతీ నొప్పి వచ్చి హర్ష్ పటేల్ (25) కుప్పకూలిపోయాడు. తోటి ప్రయాణికులు వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ఆ యువకుడిని వెంటనే వాషి స్టేషన్‌లో దింపి 108 అంబులెన్స్‌లో ఉంచారు. కానీ ఈ సమయంలో అంబులెన్స్ డ్రైవర్ భోజనం చేయడానికి వెళ్ళాడు. చాలా సేపటి తర్వాత, హర్ష్‌ను చివరకు పోలీసు జీపులో నవీ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఆసుపత్రికి తరలించారు. కానీ ఆ యువకుడు ఆసుపత్రికి చేరుకునే సమయానికి ప్రాణాలు కోల్పోయాడు. మరణానికి కారణం గుండెపోటు అని, సకాలంలో చికిత్స పొంది ఉంటే యువకుడిని కాపాడి ఉండేవారని వైద్యులు తెలిపారు. 24 గంటలూ అంబులెన్స్‌లో ఉండాల్సిన డ్రైవర్లు ప్రత్యామ్నాయ మార్గాలు తీసుకోకుండా భోజనం చేయడానికి వెళ్లకూడదని, జరిగినది తీవ్రమైన నిర్లక్ష్యం అని యువకుడి కుటుంబం ఆరోపించింది. రైల్వే పోలీసులు కూడా తీవ్ర నిర్లక్ష్యంగా ఉన్నారని ఆ కుటుంబం చెబుతోంది. వాషి స్టేషన్‌లో స్ట్రెచర్లు, వీల్‌చైర్లు, ప్రథమ చికిత్స పెట్టెలు లేదా సిపిఆర్-శిక్షణ పొందిన రైల్వే అధికారులు లేరని హర్ష్ పటేల్ అత్యవసర సంరక్షణ, చికిత్స పొందకుండానే మరణించారని ఆమె సోదరి అమిక ఆరోపించింది.

# మహిళపై లైంగిక వేధింపుల కేసు

### మాజీ ఎమ్మెల్యే పీటీ కుంజు ముహమ్మద్ అరెస్ట్

**తిరువనంతపురం :** మలయాళ చిత్ర దర్శకుడు, మాజీ ఎమ్మెల్యే పీటీ కుంజు ముహమ్మద్ అరెస్ట్ అయ్యారు. మహిళపై లైంగిక వేధింపుల కేసులో ఆయన్ని అరెస్ట్ చేసినట్లు పోలీసులు బుధవారం తెలిపారు . అయితే, కాసేపటికే అతను బెయిల్‌పై విడుదలైనట్లు చెప్పారు. ఇటీవలే జరిగిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ కేరళ కోసం మలయాళ చిత్రాలను ఎంపిక చేసే ప్రక్రియ కోసం కుంజు ఓ హోటల్‌లో బస చేశారు. ఆ సమయంలో ఓ మహిళను కుంజు లైంగిక వేధింపులకు గురి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. బాధితురాలు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై ఈ నెల ఆరంభంలో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా కుంజు పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. ఆ సమయంలో అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఈ కేసులో కుంజు ఇప్పటికే కోర్టు నుంచి ముందస్తు బెయిల్ పొందడంతో.. అతన్ని విడుదల చేశారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



సంపాదకీయం

# పేదరిక నిర్మూలనపై దొంగ లెక్కలు!

ఇప్పటికే ప్రకృతి విధ్వంసం యధేచ్ఛగా సాగుతోంది. దేశంలో ప్రకృతిని రక్షించాలన్న బాధ్యత ప్రభుత్వాలకు లేకుండా పోయింది. యధారాజా తథా ప్రజా అన్నట్లుగా ప్రజలు కూడా ఈ విధ్వంసంలో పాలుపంచుకుంటున్నారు. గ్రామాల్లో చెరువులు, కుంటలు, చిన్నచిన్న గుట్టలు మాయం అవుతున్నాయి. ఇసుకను తోడేస్తున్నారు. అడవులను ధ్వంసం చేస్తున్నారు. దీని ప్రభావంతో వాతావరణ మార్పులు తీవ్రంగా చోటుచేసుకుంటున్నాయి. దీనికతోడు విపరీతమైన ప్లాస్టిక్ ఎక్కడ పడితే అక్కడ గుట్టలుగా పేరుకుపోతోంది. చెరువులు, నదులు, సముద్రాలు కలుషితం అవుతున్నా ప్రభుత్వాల్లో చీమకుట్టినట్లుగా కూడా లేదు. దీంతో పర్యావరణంతో పాటు ప్రజల ఆరోగ్యం దెబ్బతింటున్నా కఠిన చర్యలు తీసుకోవడం లేదు. దీనికితోడు ప్రకృతి విధ్వంసం ఆపాల్సిన ప్రభుత్వాలు చోద్యం చూడడమే గాకుండా ప్రకృతిని విధ్వంసం చేస్తున్నాయి. ఆంధ్రాలో సముద్రతీరంలో ఉన్న మడ అడువులను ధ్వసం చేశార. అలాగే రుషికొండను ధ్వంసం చేసి జగన్ విలాసవంతమైన భవనాలు కట్టుకున్నాడు. కొల్లేరు సరస్సు పూర్తిగా ధ్వంసం అయ్యింది. హైదరాబాద్ లో హుస్సేన్ సాగర్ కాలుష్య కాసారంగా మారింది. ఇవన్నీ కొన్ని మాత్రమే. ఎందరో ఆందోళనలు చేసినా, చిప్కో లాంటి ఉద్యమాలు వచ్చినా కదలిక రాకపోవడం దారుణం కాక మరోటి కాదు. కేరళ విలయం చూసిన తరవాత కూడా ప్రభుత్వాలు కళ్లు తెరవడం లేదు. ఉత్తరాఖండ్ విలయం చూసినా కొండలను విధ్వంసం చేయడం ఆపడం లేదు. తాజాగా ప్రకృతి నిర్మించిన రక్షణ కవచం ఆరావళి పర్వత శ్రేణులను కూడా విధ్వంసం చేసే కార్యక్రమం మొదలు కావడం ఈ దేశం చేసుకున్న దౌర్భాగ్యం తప్ప మరోటి కాదు. అటవీ, జల, ఖనిజ ఇతర సహజ వనరులను అందిస్తూ.. నాలుగు రాష్ట్రాల సామాజిక, ఆర్థిక ప్రగతికి దోహద పడుతున్న ఆరావళిలోని 90 శాతం ప్రాంతాలకు మైనింగ్, రియల్ ఎస్టేట్ ముప్పు పొంచి వుంది. దేశ రాజధాని ఢిల్లీతోపాటు హర్యానా, రాజస్థాన్, గుజరాత్ వరకూ దాదాపు 700 కిలోమీటర్ల మేర విస్తరించివున్న ఈ పర్వత శ్రేణి థార్ ఎడారి నుంచి వచ్చే ఇసుక, ధూళిని అడ్డుకోవడంలో కీలకమైనవని ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా నివేదిక స్పష్టం చేస్తోంది. యూరోపియన్ దేశాల్లో ప్రకృతిని రక్షించేందుకు పాటుపడుతుంటే, మనం మాత్రం విధ్వంస రచన చేస్తున్నాం. మైనింగ్, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు దోచిపెట్టేందుకు కేంద్రం రంగం సిద్ధం చేస్తున్నట్లుగా వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి..

వందల కోట్ల సంవత్సరాల క్రితం ఆవిర్భవించిన ప్రపంచంలోనే అతి పురాతన మడత పర్వత శ్రేణుల్లో ఒకటైన ఆరావళిని విధ్వంసం చేసుకోవ డమంటే మనదేశాన్ని మనం నాశనం చేసుకోవడమే. కూర్చున్న కొమ్మను నరుక్కోవడమే అవుతుంది. ఇక్కడ ఖనిజాల కోసం పర్వత శ్రేణులను ధ్వంసం చేసే యత్నాలు అడ్డుకోవాల్సిందే. ఇక్కడ తవ్వకాలకు ఆమోదం తెలపడం అంటే పర్యా వరణానికి, జీవ కారుణ్యానికే కాదు.. మానవ మనుగడకే ప్రమాదకరంగా భావించాలి. సామాజిక మాధ్యమ వేదికల్లో ఉత్తరాదిన ప్రారంభమైన 'సేవ్ ఆరావళి క్యాంపెయిన్' రోజురోజుకూ దేశవ్యాప్తంగా విస్తరిస్తోంది. ఉత్తర భారతానికి పచ్చని పరుపులా ఉన్న ఆరావళిని కాపాడాలన్న హ్యాష్ ట్యాగ్‌లతో విద్యావంతులు, మేధావులు, పర్యావరణ వేత్తలు, నిపుణులు ముక్తకంఠంతో నినదిస్తున్నారు. అక్రమ మైనింగ్‌ను ఎలా చట్టబద్ధం చేస్తారని కేంద్రాన్ని నిలదీస్తున్నారు. పీపుల్ ఫర్ ఆరావళీస్' సంస్థ ఇచ్చిన నివేదిక ప్రకారం అనూహ్యంగా పెరిగిన పట్టణీకరణ, ఖనిజాన్వేషణలతో అడవుల్లో ముమ్మరంగా సాగుతున్న తవ్వకాలు, నివాస ప్రాంతాల విస్తరణ వల్ల హర్యానా, రాజస్థాన్‌లోని ఛార్ఖీ దాద్రి, భివాని జిల్లాల్లో పర్వతాలు ధ్వంసమై జీవవైవిధ్యం నాశనమైంది. ఒక్క రాజస్థాన్‌లోనే దాదాపు 25శాతం కొండలు హరించుకు పోయాయని 2018లోనే సుప్రీంకోర్టు నియమించిన కేంద్ర సాధికార సంఘం తేల్చిచెప్పింది. 25 వేలకుపైగా ఎకరాల్లో కొండలు కనుమరుగయ్యాయి. 2011-17 మధ్యలో ఆరావళి శ్రేణుల నుంచి 9.80 లక్షల టన్నుల ఖనిజ వనరులను అక్రమంగా తరలించారనేది కాగ్ నివేదిక తెలిపింది. మైనింగ్, రియల్ ఎస్టేట్ అక్రమాలపై నాలుగు వేలకుపైగా కేసులు న్యాయస్థానాల్లో మూలుగున్నాయి. హర్యానాలోని ఫరీదాబాద్ పరిసర ప్రాంతాల్లో ఖనిజ తవ్వకాలను 2002లోనూ, నాలుగు రాష్ట్రాల్లో తవ్వకాలను 2009లోనూ నిషేధిస్తూ సుప్రీంకోర్టు తీర్పులిచ్చినా అమలు చేసే బాధ్యతల నుంచి ప్రభుత్వాలు తప్పుకున్నాయి. పర్వతాల స్వరూపం మార్చకూడదన్న సుప్రీంకోర్టు తాజా ఆదేశాలు చుట్టూ మైనింగ్ జరుగుతుంటే ఎలా అమలవు తాయన్న ఆలోచన చేయడం లేదు. ఢిల్లీ నుంచి థార్ వరకూ ఎడారిగా మారుతుందని, భూగర్భ జలా లు అడుగంటతాయని, వాయు కాలుష్యంతో ఢిల్లీసహా ఆయా రాష్ట్రాల నుంచి వలస పో వాల్సిన దుస్థితి ఏర్పడుతుందంటున్న పర్యావరణవేత్తల హెచ్చరికలు పాలకుల చెవికె క్కడం లేదు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5న 'ఆరావళి గ్రీన్ వాల్ ప్రాజెక్టు'ను ప్రారంభించిన ప్రధాని ఢిల్లీ నుంచి గుజరాత్ వరకూ అడవులు పెంచడమే లక్ష్యమన్నారు. వేలాది ఏళ్ళుగా పర్యావరణానికి పెట్టని కోటగా ఉన్న ఆరావళిని కాపాడుకోవడం, భవిష్యత్ తరాలకు భద్రంగా అప్పగించడం, 'సేవ్ ఆరావళి'కి మద్దతు పలకడం మనందరి బాధ్యత. మన రాష్ట్రంలోనూ లేటరైట్, బాక్సైట్ తదితర విలువైన ఖనిజాలను తవ్వి కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు అత్యుత్సాహం చూపే పర్యావరణ వినాశక చర్యలకు అడ్డుకట్ట పడాలి. పర్యావరణ విధ్వంసం చేసే ఎ లాంటి చర్యలనైనా ప్రజలు ప్రతిఘటించాలి. మన కెందుకులే అనుకుంటే రేపటి తరం అంతం కావడం ఖాయం.



కంచర్ల అచ్యుత్ రావు
ఎడిటర్

# ప్రతి వినియోగదారుడు హక్కులపట్ల అవగాహన కలిగి ఉండాలి

**ఈ-జాగృతి పోర్టల్ ద్వారా ఫిర్యాదులను ఆన్ లైన్ లో చేయొచ్చు**

**సోక్రటీస్ చెప్పినట్లు ప్రతి వినియోగదారుడు ప్రశ్నించే తత్వాన్ని కల్గి ఉండాలి**

**రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. ఢిల్లీ రావు**





**విజయవాడ:** వినియోగదారులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండటంతోపాటు డిజిటల్ లావాదేవీలపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. దిల్లీ రావు తెలిపారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం-2025 సందర్భంగా స్థానిక తుమ్మలపల్లి కళా క్షేత్రంలో బుధవారం రాష్ట్ర స్థాయి వేడుకలను డిజిటల్ న్యాయపాలన ద్వారా సమర్థ సత్వర పరిష్కారం అనే థీమ్ తో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ వైస్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. ఢిల్లీ రావు హాజరై మాట్లాడుతూ ప్రముఖ తత్వవేత్త సోక్రటీస్ పేర్కొన్న విధంగా ప్రశ్నించే తత్వాన్ని ప్రతి వినియోగదారుడు కల్గి ఉండాలన్నారు. వినియోగదారుల కోర్టుల తీర్పులు వేగంగా, సమర్థవంతంగా వెలువడటంలో డిజిటల్ పద్ధతుల ప్రాముఖ్యతను వివరించారు. పెరుగుతున్న సాంకేతికతతోపాటు వినియోగదారులకు ఇబ్బందులు కూడా ఏర్పడుతున్నాయన్నారు. 1986 వినియోగదారుల హక్కుల రక్షణ చట్టానికి, 2019 నాటి వినియోగదారుల హక్కుల రక్షణ చట్టానికి మధ్య ఉన్న వ్యత్యాసాలను వివరించారు. ముఖ్యంగా ఈ-కామర్స్ ఆన్ లైన్, సైబర్ మోసాల నేపధ్యంలో వినియోగదారులు మరింత అప్రవత్తంగా ఉండాలన్నారు. గతంలో ఎక్కడైతే వస్తువు కొనుగోలు చేస్తామో ఆ కోర్టులోనే కేసు వేయాల్సి ఉండేదని ప్రస్తుత కొత్త చట్టం ప్రకారం, వినియోగదారుడు ఎక్కడ నివసిస్తుంటే అక్కడి నుండే ఆన్ లైన్ లో కేసు ఫైల్ చేసుకునే సౌకర్యం ఏర్పడిందన్నారు. కోర్టు విచారణలకు స్వయంగా హాజరు కావాల్సిన అవసరం లేకుండా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరు కావచ్చునన్నారు. బిస్ కేర్ యాప్ ద్వారా హాల్‌మార్క్, క్వాలిటీ కంట్రోల్ వంటి అంశాలపై ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు అన్నారు. ఈ-జాగృతి యాప్ ద్వారా కేసు ప్రస్తుత స్థితి, ట్రాకింగ్, ఆన్ లైన్ లో ఫీజుల చెల్లింపు తదితరమైనవి ట్రాక్ చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. కొత్త చట్టం ప్రకారం, జిల్లా కోర్టులో పరిహారం ఎంతైనా అడగవచ్చు కానీ ఆ వస్తువు లేదా సేవ కోసం చెల్లించిన విలువ 50 లక్షల లోపు ఉండాలన్నారు. వ్యక్తిగత అవసరాల కోసం వస్తువులను కొనేవారు మాత్రమే వినియోగదారులు అవుతారన్నారు. వ్యాపార లావాదేవీల కోసం వస్తువులు కొనేవారు ఈ చట్టం పరిధిలోకి రారన్నారు. ఫిర్యాదు చేసిన 21 రోజుల్లోపు సిసి (కన్స్యూమర్ కంప్లైంట్) నంబర్ ఇవ్వకపోతే, అది ఆమోదించబడినట్లుగా పరిగణించబడుతుందని వీసీ మరియు ఎండీ ఎస్. ఢిల్లీ రావు తెలియజేశారు. పౌర సరఫరాల సంస్థ సంచాలకులు ఆర్. గోవిందరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా బంగారు దుకాణాల్లో ఒక మిల్లీగ్రామ్ స్కేల్ ఖచ్చితత్వాన్ని అమలు చేయడం ఒక గొప్ప విజయమని, దీన్ని దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నారన్నారు. యూరోపియన్ దేశాలతో పోలిస్తే భారతదేశంలో వినియోగదారుల అవగాహన ఇంకా పెరగాల్సి ఉందన్నారు. పాఠశాలల్లో కన్స్యూమర్ క్లబ్‌ల ద్వారా విద్యార్థులకు వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించాలని, డైరెక్టర్ ఆఫ్ కన్స్యూమర్ అఫైర్స్, జిల్లా యంత్రాంగం చేస్తున్న కృషిని అభినందించారు. వినియోగదారులు తమకు అన్యాయం జరిగినప్పుడు బిల్లులు, వోచర్లు వంటి ప్రాథమిక ఆధారాలతో కేసు ఎలా ఫైల్ చేసుకోవాలో, ఆ విషయంలో జిల్లా యంత్రాంగం, సంబంధిత అధికారులు అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు. జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ మాట్లాడుతూ సమాజంలో మనం ఏ వృత్తిలో ఉన్నా మనందరం వినియోగదారులమేనని, ప్రతి ఒక్కరూ తమ హక్కులను గురించి తెలుసుకోవాలన్నారు. వినియోగదారుడు ప్రశ్నించే హక్కును కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం స్మార్ట్ ఫోన్లు, ఇంటర్నెట్ వినియోగం పెరగడంతో డిజిటల్ ఫ్రాడ్స్ పెరుగుతున్నాయని, దీనిపై వినియోగదారులు అవగాహన కల్గి ఉండాలన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించాలని అప్పుడే చైతన్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. బిస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) డైరెక్టర్ ప్రేమ్ సజానీ పట్నాలా మాట్లాడుతూ వినియోగదారులు కొనుగోలు చేసిన వస్తువు హాల్ మార్క్ క్వాలిటీ కంట్రోల్ వంటి అంశాల పై ఫిర్యాదు చేయాలనుకుంటే బిస్ కేర్ యాప్ లో ఉచితంగా ఫిర్యాదు చేయొచ్చు అన్నారు. లీగల్ మెట్రాలజీ శాఖ జాయింట్ కంట్రోలర్ కృష్ణ చైతన్య మాట్లాడుతూ ప్రతి వినియోగదారుడు తూకాల మోసాలను ప్రశ్నించినప్పుడే వ్యాపారస్థులు భయానికి గురై మోసానికి పాల్పడరన్నారు. కార్యక్రమం అనంతరం వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించే పోస్టర్ ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా, సివిల్ సప్లైస్ అదనపు సంచాలకులు కె. రంగ కుమారి, జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఏ. పాపారావు, ఏఎస్వో వేంపాటి శ్రీనివాసులు, విద్యార్థులు, ఎన్జీవోలు, తదితరులు పాల్గొన్నారు.


# శ్రద్ధగా చదవాలి

**టెన్త్ విద్యార్థులకు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సూచనలు**

**కృష్ణాజిల్లా రాష్ట్రంలో టాప్-5లో రావాలి**

**అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆకాంక్ష**

**మూడు మండలాల టెన్త్ విద్యార్థులకు విద్యానికేతన్ లో ఒకరోజు శిక్షణ కార్యక్రమం**



**అవనిగడ్డ:** శ్రద్ధగా చదవాలి.. మననం చేసుకోవాలి.. సరైన విశ్రాంతి తీసుకోవాలి.. అని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ టెన్త్ విద్యార్థులకు సూచించారు. బుధవారం అవనిగడ్డ విద్యానికేతన్ స్కూల్లో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాల ప్రభుత్వ పాఠశాలల టెన్త్ విద్యార్థులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ తమ స్వరాష్ట్రం కర్ణాటకలో తాను టెన్త్ పరీక్షల్లో మొదటి స్థానం సాధించేందుకు అనుసరించిన స్వీయ అనుభవం చెప్పి స్ఫూర్తినిచ్చారు. విద్యార్థులు నిద్రాహారాలు మాని చదివితే బుర్రకు ఎక్కదన్నారు. మెదడుకు, శరీరానికి రోజుకు తగిన విశ్రాంతినిచ్చి చదివితే గుర్తుండిపోయేలా చదివే శక్తి లభిస్తుందన్నారు. చదివే ముందు ఐదు నిమిషాలు ప్రాణాయామం, చదివిన తరువాత మననం చేసుకోవటం ముఖ్యం అన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించాలనే పట్టుదలకు తోడు గ్రూప్ స్టడీ ఇంపార్టెంట్ అన్నారు. విద్యార్థులు తమకు పట్టున్న సబ్జెక్ట్ గురించి ఆ సబ్జెక్టులో బలహీనంగా ఉన్న విద్యార్థికి వివరించే ప్రయత్నం చేస్తే ఇద్దరికీ పాఠం బాగా గుర్తుంటుందన్నారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ కృష్ణాజిల్లా టెన్త్ ఫలితాల్లో స్టేట్ టాప్-5లో రావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ప్రతి హైస్కూల్లో టాపర్స్ 590/600 మార్కులు సాధించాలని పిలుపునిచ్చారు. గత ఏడాది టెన్త్ ఫలితాల్లో నియోజకవర్గం ఉత్తమ స్థానంలో నిలిచినప్పటికి, తప్పిన కొద్దిమంది విద్యార్థులు ఎక్కువ సబ్జెక్టుల్లో తప్పిన అంశాన్ని గమనించి ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు తమలోని భయాన్ని పూర్తిగా విడనాడి పట్టుదల, క్రమశిక్షణతో చదివి నియోజకవర్గానికి జిల్లాలో రాష్ట్రంలో మంచి పేరు తేవాలని పిలుపునిచ్చారు.

జిల్లా విద్యాశాఖ అధికారి యూవీ సుబ్బారావు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, విద్యానికేతన్ విద్యాసంస్థల చైర్మన్ పంద్రాజు లంకమ్మ ప్రసాద్, ఆరు మండలాల ఎంఈఓలు, మూడు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, విద్యా శాఖ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురిటిగడ్డ హైస్కూల్ ప్లస్ తెలుగు అధ్యాపకురాలు ఓలేటి ఉమా సరస్వతి తమ హైస్కూల్ విద్యార్థులు రచించిన కవితలతో ముద్రించిన తేనె చినుకులు పుస్తకాన్ని జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, డీఈఓ ఆవిష్కరించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ రంగాల్లో నిపుణులతో అవగాహన, శిక్షణ ఇచ్చారు. అతిధులను చైర్మన్ లంకమ్మ ప్రసాద్ ఘనంగా సత్కరించారు.

# మత్స్యకారుల సమస్యలపై క్షేత్రస్థాయి సమీక్ష

**బీవీ పాలెంలో కొల్లు పెద్దిరాజు పర్యటన**

**తడ:** బీవీ పాలెంలో మత్స్యకారుల సమస్యలు, అవసరాలను ప్రత్యక్షంగా తెలుసుకునే కార్యక్రమం జరిగింది. ఏపీ మత్స్యకార సంక్షేమ, అభివృద్ధి చైర్మన్ కొల్లు పెద్దిరాజు, ఏపీ రాష్ట్ర బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన శ్రీధర్ కలిసి బీవీ పాలెం ల్యాండింగ్ సెంటర్‌ను సందర్శించి తడ మండల మత్స్యకారులతో విస్తృతంగా సంభాషించారు. ఈ సందర్భంగా మత్స్య అభివృద్ధి అధికారి, టీడీపీ నాయకులు, మత్స్యకారులు, విఎఫ్ఏలు, సాగర్ మిత్రలు పాల్గొన్నారు. మత్స్యకారులకు ప్రస్తుతం ఎదురవుతున్న సమస్యలు, వేటకు సంబంధించిన సదుపాయాలు, మౌలిక వసతులు, ఉపాధి భద్రత, ప్రభుత్వ పథకాల అమలు స్థితిగతులపై చర్చ జరిగింది. మత్స్యకారులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పథకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని కొల్లు పెద్దిరాజు భరోసా ఇచ్చారు. వేటకు అవసరమైన సదుపాయాలు, ల్యాండింగ్ సెంటర్ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో ఉన్న లోపాలను గుర్తించి తక్షణమే



పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. మత్స్యకారుల ప్రతి అవసరాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని ఆయన పేర్కొన్నారు. బొమ్మన శ్రీధర్ మాట్లాడుతూ మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా బెస్త కార్పొరేషన్ ద్వారా అన్ని విధాలా సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశం మత్స్యకారుల్లో నూతన ఆశలు కలిగించిందని, తమ సమస్యలను నేరుగా నాయకులకు చెప్పుకునే అవకాశం లభించిందని మత్స్యకారులు తెలిపారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం విజయనగరం విశాఖపట్నం


# ఉచిత ఫిజియోథెరపీ మెడికల్ క్యాంపు కు విశేష స్పందన

## - ముఖ్యఅతిథి అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ సందర్శన



**అనకాపల్లి, డిసెంబర్ 24 (మనసు లో మాట):** అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా గవర్నమెంట్ హాస్పిటల్ లో బుధవారం నిర్వహించిన ఉచిత ఫిజియోథెరపీ మెడికల్ క్యాంపు కు విశేష స్పందన లబించింది. ముఖ్యఅతిథి మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు రామకృష్ణ మాట్లాడుతూ సీనియర్ ఫిజియోథెరపీ డాక్టర్ ప్రియాంక (ఎన్ఆర్ఐ) ప్రోత్సాహంతో విశాఖపట్నం ది అబిలిటీ పీపుల్ సహకారంతో అనకాపల్లి రోటరీ క్లబ్ భాగస్వామ్యంతో, డిఎం అండ్ హెచ్ఓ, ప్రభుత్వ జిల్లా హాస్పిటల్ డిసీహెచ్ఎస్, సూపరింటెండెంట్ మరియు జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుల సహకారంతో వివిధ కార్పొరేట్ హాస్పిటల్ నుంచి వచ్చిన వైద్యులచే ఈ మెడికల్ క్యాంపు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇదిలావుంటే వికలాంగుల కోసం ఆరోగ్య నిపుణులు చే ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తూ దీర్ఘకాలిక సమస్యలతో బాధపడే వారికి నడుము, ముడుకులు, పక్షవాతం ఉన్నవారికి ఫిజియోథెరపీ పై అవగాహన కలిగించి అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. అలాగే ది అబిలిటీ పీపుల్ వారి సహకారంతో కృత్రిమ అవయవాలు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని, ఇది ఎవరికైతే అవసరం ఉందో ఈ సంస్థ ద్వారా ఇచ్చే అవకాశం ఉందన్నారు. ఫిజియోథెరపీ ద్వారా పక్షవాత పేషెంట్లు కూడా త్వరగా మెరుగయ్యే అవకాశం ఉందని, వారు అశ్రద్ధ చేయకూడదన్నారు. జిల్లా ఎన్టీఆర్ హాస్పిటల్ కూడా రోజు ఫిజియోథెరపీ డాక్టర్ అందుబాటులో ఉన్నారని అవసరమైన వాళ్ళు వినియోగించు కోవాలని అన్నారు. ఈ కార్యక్రమాన్ని అందరూ వినియోగించుకుని మెరుగైన జీవనం సాగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్లు అందరికీ ఎమ్మెల్యే రామకృష్ణ అభినందనలు తెలియజేశారు.



## భూ సమస్యపై ఎస్సీ కమిషన్ చైర్మన్ కు వినతి పత్రం

**దేవరాపల్లి, డిసెంబర్ 24, (మనసులో మాట) :** మండలంలోని ముషిడిపల్లి రెవిన్యూ కె.ఎం పాలెం గ్రామానికి చెందిన దళిత బాధితుడు కణితి అర్జునరావు భూ సమస్యపై జిల్లా ఎమ్మార్పీఎస్, దళిత సంఘం ప్రతినిధులు ఆధ్వర్యంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కొత్తపల్లి శ్యామల్ జవహర్ కు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ సానుకూలంగా ఎస్సీ కమిషన్ చైర్మన్ స్పందించి విచారణ జరిపి జిల్లా అధికారులుతో మాట్లాడుతానని సంఘం ప్రతినిధులకు హామీ ఇచ్చారు. ఆనంతరం ఎస్సీ కమిషన్ చైర్మన్ కొత్తపల్లి శ్యామల్ జవహర్ కు మర్యాద పూర్వకంగా శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భూమి సమస్య బాధితులు కణితి అర్జునరావు కుటుంబ సభ్యులు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కొల్లి చిన అప్పారావు, చోడవరం నియోజకవర్గం ఎం.ఎస్.పి ఇన్చార్జి మంజేటి రాజుబాబు, తదితరులు పాల్గొన్నారు.

## హ్యాపీ కిడ్స్ ప్లే స్కూల్లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

### కరస్పాండెంట్ ఎస్ గిరీష్ కుమార్ ఆధ్వర్యంలో



**మునగపాక, డిసెంబర్ 24, మనసులో మాట..** స్థానిక వుడ్ పేట హ్యాపీ కిడ్స్ ప్లే స్కూల్లో కరస్పాండెంట్ శేశెట్టి గిరీష్ కుమార్ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిట్టి పొట్టి చిన్నారులంతా బుజ్జి బుజ్జి శాంటా క్లాస్, దేవదూత, జీసస్ తదితర క్రిస్మస్ ప్రధాన వేషధారణలతో పాఠశాలకు విచ్చేసి చూపరులను విశేషంగా ఆకర్షించారు. ప్రిన్సిపల్ సునీత క్రిస్మస్ గీతాలు ఆలపిస్తూ చిన్నారులచే నృత్యం చేయించారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు తల్లిదండ్రులు విశ్రాంత ఏఈ మల్ల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

## 66వార్డు లో స్వచ్ఛ భారత రాలీ




**గాజువాక(మనసులోమాట) డిసెంబర్ 24..** 66 వార్డులో స్వచ్ఛత పాటిస్తే ఆరోగ్యమని విడిఏ డిగ్రీ కాలేజ్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ స్టూడెంట్స్ అందరూ స్వచ్ఛభారత్ ర్యాలీ చేయడం జరిగింది స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కావాలని స్వచ్ఛస్ఫూర్తితో ప్రతి ఒక్కరు కూడా అడుగు ముందుకు వేయాలని మన ఇంటి పరిసర ప్రాంతాలన్నీ కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతి ఒక్కరు కూడా ప్లాస్టిక్ వాడకాన్ని ఆపివేయాలని ప్లాస్టిక్ రహిత గాజువాకగా తీర్చిదిద్దాలని వి డి ఏ కాలేజ్ డైరెక్టర్స్ అయినటువంటి డిఎస్ఎస్ కృష్ణకుమార్ మరియు బి శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ ర్యాలీ జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 66 వార్డు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ పాల్గొని జండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ %×% సీతాలక్ష్మి ఇంటర్ ప్రిన్సిపల్ బిటి నాయుడు డిగ్రీ కాలేజీఎన్ యస్ యస్ పి ఓ శ్రీదేవి మరియు కాలేజ్ స్టూడెంట్స్ అందరూ కూడా 66 వార్డులో స్వచ్ఛభారత్ గురించి అవగాహన చేస్తూ కనితి రోడ్ నుండి గాజువాక మెయిన్ రోడ్డు నుండి పాత గాజువాక వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు

# మానవాళి రక్షణకై జన్మించిన యేసు క్రీస్తు

## - క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన చర్చిలు



**దేవరాపల్లి, డిసెంబర్ 24, (మనసులో మాట) :** ప్రపంచంలోని ప్రతి ఒక్కరూ సంతోషంతో జరుపుకునే పండుగ క్రిస్మస్. రక్షకుడైన యేసుక్రీస్తు సర్వ మానవాళిని రక్షించడానికి భూమిపై అరుదెంచిన శుభదినం.. క్రిస్మస్ వేడుక. నేడు అన్నిచోట్ల కోట్లాదిమంది కులమతాలకతీతంగా క్రిస్మస్ ను ఒక పండుగగా ఆచరిస్తున్నారు. క్రిస్మస్ సమయంలో ప్రతి చర్చిలోనూ క్రైస్తవులు బైబిల్ వాక్యాలను తప్పక చదువుతారు. ఏసుక్రీస్తు పాటలు పాడి ప్రత్యేకంగా ప్రార్థనలు చేసి ఆయన దీవెనలను పొందుతారు. ఏసుప్రభు మరణించి పునరుద్దానుడైన 50 సంవత్సరాల లోపే సువార్తలు, నూతన నిబంధనలోని చాలా పత్రికలు రాయబడ్డాయి. ప్రపంచంలో దైవ గ్రంథం అని పిలవబడుతున్న ఏ గ్రంథం ఇంత తక్కువ వ్యవధిలో రాయబడలేదు. క్రీస్తు ప్రభువు జీవితంలో జరిగిన ప్రతి సంఘటన అతి తక్కువ సమయంలోనే రాయబడింది గనుక వాస్తవికతకు నిలువెత్తు నిదర్శనంగా బైబిల్ నిలిచింది. గతి తప్పిన మనిషి జీవితాన్ని తన ప్రేమ ద్వారా ఉద్ధరించాలని దేవుడు సంకల్పించాడు. క్రిస్మస్ తెచ్చిన ఆనందం, క్రీస్తులోని ఆనందం వర్ణనాతీతం. ఓపికతో శ్రమ పడితే కచ్చితంగా గమ్యాన్ని చేరుకుంటామని నిరూపించారు. ఆకాశంలో కనువిందు చేసిన నక్షత్రం వారిని సృష్టికర్త అయిన దేవుని దగ్గరకు నడిపించింది. ఆ సందర్భంలో వారు అత్యానందభరితులయ్యారు అని మత్తయి తన సువార్తలో రాశారు. దైవ జ్ఞానపు తీరు అవగతమైన సమయాన మనిషికి కలిగే ఆనందం వర్ణనాతీతం. లోకంలో ఎన్నో ఆకర్షణలు, ఆనందాలు కానీ.. క్రిస్మస్ అందించిన ఆనందం శాశ్వతమైనది. మొదలేకాని ముగింపు లేనిది.

**నేడు క్రిస్మస్ సంబరాలు**

విద్యుత్ కాంతులతో ముస్తాబైన చర్చిలు.. ఆనందానికి ప్రతిరూపం, శాంతికి నిదర్శనమైన క్రిస్మస్ పండుగ వేళ దేవరాపల్లి మండలంలో పండుగ శోభను సంతరించుకుంది. డిసెంబర్ 25 ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలు నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా క్రైస్తవ సోదరులు భక్తిశ్రద్ధలతో వేడుకలకు సిద్ధమయ్యారు. మండలంలోని సీయోను ప్రార్థన మందిరం (కాశీపురం), కల్వరి రాక్ చర్చి (దేవరాపల్లి) మండలంలోని వివిధ చర్చిల్లో రంగురంగుల విద్యుత్ దీపా లతో సర్వాంగ సుందరంగా అలంకరించబడ్డాయి. చర్చి ప్రాంగణాల్లో ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీలు, నక్షత్రాలు, గొర్రెల కాపరుల ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. గురువారం అర్ధరాత్రి నుంచి చర్చిల్లో ప్రత్యేక దివ్యబలి పూజలు, కీర్తనల కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాలలో చర్చిల వద్ద భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. శాంతి, ప్రేమల సందేశాన్ని పంచే ఈ క్రిస్మస్ పండుగ అనకాపల్లి జిల్లా ప్రజల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలని స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు కోరుకున్నారు.

# ఉద్యాన పంటల విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ

## అదనంగా 10వేల ఎకరాల్లో సాగుకు ప్రణాళిక - జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి



**విజయనగరం (మనసులోమాట) డిసెంబర్ 24:** జిల్లాలో ఉద్యానసాగు విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందింది. జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి వినూత్న ఆలోచనతో త్వరలోనే అదనంగా జిల్లాలో సుమారు పదివేల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు మొదలు కానుంది. దీనికోసం వివిధ ప్రభుత్వ శాఖలు సమన్వయంతో, సమష్టిగా అమలుకు రంగం సిద్ధమయ్యింది. డిఆర్డిఏ నోడల్ ఏజెన్సీగా, వ్యవసాయ, ఉద్యాన, సూక్ష్మ సేద్యం, విద్యుత్ తదితర శాఖలతో కన్వర్జెన్సీ సమావేశాన్ని కలెక్టరేట్లో బుధవారం నిర్వహించి, ఈ కార్యక్రమం అమలుకు జిల్లా కలెక్టర్ దిశానిర్దేశం చేశారు.వ్యవసాయాన్ని లాభసాటి చేయాలన్న ఉద్దేశ్యంతో సంప్రదాయ పంటలకు బదులు ఉద్యాన పంటలను సాగు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రాబాబునాయుడు ఆదేశాలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్ ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించారు. దీనిలో భాగంగా ప్రస్తుత రబీ సీజన్లో 4వేల ఎకరాలు, ఖరీఫ్లో 6 వేల ఎకరాలు, మొత్తంగా 10వేల ఎకరాల్లో అదనంగా వివిధ ఉద్యాన పంటల సాగు చేపడతారు. దీనిలో సేంద్రీయ పంటల సాగుకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. కూరగాయలు, ఆకుకూరలతోపాటు ఆయిల్ పాం లాంటి పంటలతోపాటు, మునగ పంట సాగును ప్రోత్సహించనున్నారు. సంప్రదాయ పంటలు బదులు ఉద్యాన పంటలవైపు మళ్లేందుకు ఆసక్తి ఉన్న ఉత్సాహవంతులైన రైతులను ఎంపిక చేసి, వారి పంట పొలాలతో ఐఎఫ్సి (ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ క్లష్టర్లు)గా ఏర్పాటు చేస్తారు. వీరిలో ప్రతీ గ్రామం నుంచి ఒక రైతును మార్గదర్శిగా ఎంపిక చేస్తారు. వీరి ద్వారా సాటి రైతులను ప్రేరేపిస్తారు. వీరిని ప్రోత్సహించే ఉద్దేశ్యంతో మండలానికి ఉత్తమ మార్గదర్శిని ఎంపిక చేసి సత్కరిస్తారు. మార్గదర్శిలను ఎంపిక చేసే బాధ్యతను ఉద్యాన శాఖ అధికారుల సూచనల మేరకు ఆ గ్రామంలోని వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, డిఆర్డిఏ ఆర్పిలు, ఎపిఎంలు, సిసిలుతో కూడిన బృందాలు చేపడతాయి.పండిరచిన పంటకు సరైన మార్కెట్ ఉన్నప్పుడే పండిరచేందుకు రైతులు ముందుకు వస్తారు. దీనికోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

15 రోజుల్లో మార్గదర్శుల ఎంపిక పూర్తి చేయాలి :

జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఉద్యాన పంటల సాగు పెంచే లక్ష్యంతో అమలు చేయనున్న ఈ వినూత్న కార్యక్రమంలో కీలక పాత్ర పోషించే మార్గదర్శుల ఎంపికను 15 రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. వివిధ శాఖల అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉత్సాహవంతులైన రైతులను మార్గదర్శులుగా ఎంపిక చేయాలని సూచించారు. అలాగే కార్యక్రమం అమలు చేయడానికి మండల స్థాయి అధికారులతో ఈ నెలాఖరున ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమం అమలు కోసం రూపొందించిన పిపిటిని డిఆర్డిఏ శ్రీనివాస్ పాణి ప్రదర్శించారు. సమావేశంలో వ్యవసాయశాఖ జెడి విటి రామారావు, ఉద్యానశాఖ డిడి చిట్టిబాబు, ఏపిఎంఐపి పిడి పిఎన్వి లక్ష్మీనారాయణ, ఏపిఈపిడిసిఎల్ ఎస్ఈ ఎం.లక్ష్మణరావు, ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ప్రతి ఇంటి పెద్ద కొడుకు చంద్రబాబు


## పేదలను ఆర్థికంగా ఆదుకోవడం కోసమే సీఎం సహాయ నిధి



**అనకాపల్లి రూరల్, డిసెంబర్ 24 (మనసులో మాట):** రాష్ట్రంలో ప్రతి ఇంటికి చంద్రబాబు నాయుడు పెద్ద కొడుకు మాజీ ఎమ్మెల్యే పీల గోవింద సత్యనారాయణ అన్నారు. బుధవారం అనకాపల్లి మండలం సిహెచ్ ఎన్ అగ్రహారం, రేబాక, కాపుశెట్టి వాని పాలెం, గోలగాం, గోపాలపురం, అక్కిరెడ్డి పాలెం, తుమ్మపాల మేజర్ పంచాయతీ, మార్టూరు గ్రామాలలో సీఎం సహాయనిది చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సీఎం సహాయ నిధి చెక్కుల ను ఆయా గ్రామాలలో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి సీఎం సహాయ నిధి చెక్కులను అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ శాసనసభ్యులు, అనకాపల్లి నియోజవర్గం టిడిపి ఇంచార్జ్ పీలా గోవింద సత్యనారాయణ పంపిణీ చేశారు. గ్రామాలలో సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధి వైపు తీసుకువెళు _న్న ఘనత నారా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ దే అని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలుపరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

# అప్పలరాజుపై తప్పుడు కేసులు వెంటనే ఎత్తివేయాలి

## - దేవరాపల్లిలో సిపిఎం కార్యకర్తలు ఆందోళన




**దేవరాపల్లి, డిసెంబర్ 24, (మనసులో మాట) :** సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. అప్పలరాజుపై ప్రభుత్వం, పోలీసులు పెట్టిన తప్పుడు కేసులు వెంటనే ఎత్తివేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. అయనపై ప్రమాదకర నివారణ సెక్షన్ 3 (1) కింద బూట్లెగ్గర్స్ డకాయిట్స్, డ్రగ్ నేరస్థులు, గూండాల కార్య కలాపాలు,అనైతిక ట్రఫిక్ నేరస్థులు, ల్యాండ్ గ్రాబర్స్ చట్టం1986 నేరం క్రింద కేసులు పెట్టి అరెస్టు చేసి జైలుకు పంపించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ బుధవారం దేవరాపల్లిలో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి. వెంకన్న మాట్లాడుతూ నక్కపల్లి మండలం రాజయ్యపేటలో బల్క్ డ్రంగ్ పార్క్ కు వ్యతిరేకంగా మత్స్యకారులు చేస్తున్న ఉద్య మానికి మద్దతు ఇచ్చినందుకు ఆగస్టు 6 నుంచి అక్టోబర్ 12 వరకు మూడు నెలల కాలములో ఏడు సార్లు అప్పలరాజు అరెస్టు అయ్యారని అన్నారు. అప్పలరాజు పై అనేక ఆరోపణలు మోపి అతడిని అన్ని విధాల ఇబ్బందులు పెట్టేందుకు ప్రభుత్వం, పోలీసులు చేస్తున్న కుట్రలను వెంటనే ఆపాలన్నారు. ఈ కేసులు అన్ని సిపిఎం నాయుడుపై పెట్టడం అంటే ప్రజాస్వామ్యన్ని అపహాస్యం చేసి రాజ్యంగాన్ని హేలనచేయమేనని పేర్కొన్నారు. రాజయ్యపేటలో బల్క్ డ్రంగ్ పార్క్ పరిశ్రమకు వ్యతిరేకంగా ఐదు నెలలు నుండి మత్స్యకారులు అందోళన చేస్తున్నారని దీనికి మద్దతు ఇచ్చినందుకు అప్పలరాజుపై ఇంతటి ఘాతాకానికి ప్రభుత్వం, పోలీసులు పూనుకున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అప్పలరాజుపై పెట్టిన తప్పుడు కేసులను వెంటనే ఎత్తి వేయాలని, బేషరతుగా విడుదల చేయాలని వెంకన్న డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ దేముడు, సిహెచ్ రాంబాబు, పి. దేముడు, కె. శ్రీను, కె.



## పాత తంగేడును పంచాయతీగా

# ఏర్పాటు చేయాలి

**కోటవురట్ల(మనసులో మాట) డిసెంబర్24:** కోటవురట్ల మండలం పాత తంగేడును పంచాయతీలో ఏర్పాటు చేయాలని ఆ గ్రామస్తులు డిమాండ్ చేశారు. పంచాయతీ విభజనపై తంగేడులో బుధవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామ సభలో తంగేడు, పాత తంగేడు గ్రామస్తులు రెండు వర్గాలుగా విడిపోయారు. ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలని పాత తంగేడు గ్రామస్తులు ప్లకార్డులు ప్రదర్శించారు. పంచాయతీ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న పనికి పెద్ద పనికి తంగేడు గ్రామం రావాల్సి వస్తుందన్నారు. తమ గ్రామం అభివృద్ధికి తప్పనిసరిగా పంచాయతీని ఏర్పాటు చేయాలన్నారు. ఒకే పంచాయతీగా కొనసాగించాలని తంగేడు గ్రామస్తులు డిమాండ్ చేశారు. గ్రామ సర్పంచ్ కొరుప్రోలు శివ అధ్యక్షతన జరిగింది. పోలీస్ బందోబస్తుతో గ్రామసభ నిర్వహించారు.

## పిడి యాక్ట్ క్రింద సిపిఎం నేత

# అప్పలరాజు అరెస్టు



**ఎస్. రాయవరం, డిశంబర్ 24,(మనసులో మాట):** సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం అప్పలరాజు ను ఎస్. రాయవరం మండలం ధర్మవరం గ్రామంలోని ఆయన స్వగృహంవద్ద బుధవారం ఉదయం పోలీసులు పిడియాక్ట్ క్రింద అరెస్ట్ చేసారు. భారీ సంఖ్యలో అప్పలరాజు ఇంటివద్ద మోహరించిన పోలీసులు ఆయనను అదుపులోని తీసుకుని పోలీసు వాహనంలో అడ్డురోడ్డులోని సర్కిల్ కార్యలయంకు తరలించారు. కమ్యూనిస్ట్ పార్టీకిచెందిన అప్పలరాజు ప్రజాసమస్యలు పై స్పందించి భాదితులుకు అండగా పలు పోరాటాలు లో పాల్గొన్నారు. ఇటీవల రాజయ్యపేట గ్రామస్తులు బల్క్ డ్రగ్స్ పరిశ్రమలు ఏర్పాటును వ్యతిరేకిస్తూచేపట్టిన పోరాటంలో పాల్గొన్నారు. 2013 నుండి ఆయన పై ఇప్పటివరకు 19 కేసులు నమోదుచేసారు. మూడునెలలువరుసగా ఏడుకేసులు నమోదు కావటంతో ఆయన పై పిడి యాక్ట్ ను ప్రయోగించిన పోలీసులు ఆయనను అరెస్టు చేసి సెంట్రల్ జైలుకు తరలించారు. అప్పలరాజు కు మద్దతుగా ఎటువంటి అందోళనలు చేపట్టకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు.

# స్మశాన వాటికలో ప్రహారీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన



**దేవరాపల్లి, డిసెంబర్ 24, (మనసులో మాట) :** మండలంలోని నాగయ్యపేట పంచాయితీ శివారు సీతంపేట గ్రామంలో స్మశానవాటిక ప్రహారి గోడ నిర్మాణానికి స్థానిక ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మీ, జెడ్పీటీసీ కర్రి సత్యం బుధవారం శంఖుస్థాపన చేశారు. స్థానిక సీతంపేట ప్రహారిగోడ నిర్మాణానికి మండల పరిషత్ నిధులు రూ. 4 లక్షలు కేటాయించారు. ఈ నిధులతో ప్రహారి గోడ నిర్మాణానికి స్థానిక ఎంపీటీసీ వంటాకు పైడితల్లమ్మతో కలిసి కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. ప్రహారి గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎంపీపీ బుల్లిలక్ష్మీ, జెడ్పీటీసీ కర్రి సత్యం, ఎంపీటీసీ పైడితలమ్మకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ వంటాకు పైడితల్లమ్మ, ఏ. కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, స్థానిక నాయుకులు వంటాకు శ్రీను, జాగరపు లక్ష్మయ్య, కర్రి వెంకన్న, నొడగల వెంకటరావు, వాకాడ రామకృష్ణ, సంగపల్లి గంగరాజు, ఆదపురెడ్డి రమణ, పుల్లి వినోద్, కర్రి రాము తదితర గ్రామ పెద్దలు, నాయుకులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ శేఖర్ పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక



## యాదవుల రాజ్యాంగ అధికార యాత్ర

### - గొలగాని రమేష్ యాదవ్

విజయనగరం:(మనసులోమాట): డిసెంబర్ 24::యాదవుల రాజ్యాంగ అధికార యాత్రను జిల్లాలో 100 గ్రామాల్లో జరపాలని నిర్ణయించామని యాదవ యువ సేవ రాష్ట్ర బిసి గొలగాని రమేష్ యాదవ్ తెలిపారు. బుధవారం మానసులో మాట ప్రతినిధితో ఆయన మాట్లాడుతూజిల్లా ఆవిర్భావం అయి 56 ఏళ్ళు గడిచినా ఒక్క జెడ్పీటిసిస్థానం %ు%వనీ, ఒక్క ఎంపిటిసి స్థానం కానీ యాదవులకు కేటాయించకుండా వెనకసెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కారణం బిసి రిజర్వేషన్లలో లోపాలేనని తెలిపారు. ఇతర జిల్లాల్లో ఓసిలుగా ఉన్న కాపులు ఉత్తరాంధ్ర జిల్లాలకు వచ్చేసరికి తూర్పుకాపులుగా బిసిరిజర్వేషన్ జాబితాలోకి వస్తున్నారని అన్నారు. 8లక్షల కాపులున్న స్థానాల్లో 90 శాతం వారు పొందుతున్నారని... యాదవుల నాయకత్వంలో ఉన్న వారికి కనీసం 50 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన రిజర్వేషన్ల దామాషా పద్ధతిపై యాదవులకు ఇవ్వాలని కోరారు. విజయనగరంలో ఉన్న ఏడు అసంబ్లీ నియోజకవర్గాలని పరిశీలిస్తే విజయనగరంలో 56వేలు, నెల్లిమర్లలో 60వేలు, గజపతినగరంలో 22వేలు, ఎస్.కోటలో 32వేలు. చీపురుపల్లిలో 26వేలు, రాజాంలో 36వేలు బొబ్బిలిలో 40వేలు యాదవులు ఓటర్లుగా ఉన్నారని తెలియజేశారు. అందుకే 100రోజులు 100 గ్రామాల పేరుతో యాదవుల రాజ్యాధికార యాత్రను ప్రారంభిస్తున్నామని తెలిపారు.

## బత్తుల తాతయ్య బాబుకు జిల్లా తెలుగు మహిళలు అభినందనలు

### జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆడారి మంజు ఆధ్వర్యంలో



**మునగపాక, డిసెంబర్ 24, మనసులో మాట..** అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షునిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన బత్తుల తాతయ్య బాబుకు అనకాపల్లి జిల్లా పార్లమెంటు నియోజకవర్గం తెలుగు మహిళ కమిటీ ఆయన స్వగృహంలో స్వయంగా కలిసి అభినందనలు తెలియజేశారు. తాతయ్య బాబు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతమై స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం తమ సత్తా చాటుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆడారి మంజు, జనరల్ సెక్రెటరీ చుక్కలరమణమ్మ, కొత్తకోట నీ లవేణి, కోశాధికారి విలక్ష్మి, తెలుగు మహిళ ఆర్గనైజింగ్ కార్యదర్శి రత్నమాల, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ స్వర్ణలత, తులసి, సిడి కాడ మండలం మాజీ జడ్పిటిసి పోతల రమణమ్మ, ఎలమంచిలి నియోజకవర్గ తెలుగు మహిళ నాయకురాలు లాలం శాంతి స్వయంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

## నైపుణ్య శిక్షణ అందించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి



**విజయనగరం:(మనసులోమాట) డిసెంబర్ 24:** విజయనగరం జిల్లాలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జిల్లా కలెక్టర్ కలిసి చర్చించారు. పెండింగ్ అంశాలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విజయనగరం జిల్లాకు పారిశ్రామికంగా పెద్దపీట వేస్తున్న నేపథ్యంలో, కొత్తగా వచ్చే పరిశ్రమలకు అవసరమైన మౌళిక వసతుల కల్పన, త్వరిత గతిన పరిశ్రమల ఏర్పాటు కోసం సత్వర చర్యలు తీసుకోవాలని, పరిశ్రమల్లో వచ్చే ఉద్యోగాలకు అనుగుణంగా నిరుద్యోగులకు స్కిల్ డెవలప్మెంట్ ద్వారా నైపుణ్య శిక్షణ అందించి, ఎక్కువ ఉద్యోగాలు స్థానికులకు దక్కేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పారదర్శకంగా అమలయ్యే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.ఇందుకు సంబంధించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు వేగవంతం చేసేందుకు పలు సూచనలు చేశారు. ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు వీలైనంత త్వరగా బిల్లును చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని, ఈ అంశానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి త్వరిత కట్టిన బిల్లు చెల్లించే విధంగా పనిచేయాలని అన్నారు. ఇదేవిధంగా సామాన్య ప్రజల నుంచి మంత్రికి వచ్చిన విజ్ఞప్తులను అధికారులు సత్వర పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.

### లింగంపేట పంచాయతీ శివారు బుచ్చింపేట గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలో

## జనసేన పార్టీ ఆధ్వర్యంలో పుస్తకాలు పంపిణీ



**నాతవరం డిసెంబర్24( మనసులో మాట)..** నాతవరం మండలం, లింగంపేట పంచాయతీ శివారు బుచ్చింపేట గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో పుస్తకాలు పంపిణీ చేశారు. జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రాజాన వీర సూర్యచంద్ర సొంత నిధులతో విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను ఇతర సామాగ్రి సమకూర్చారు. వీటిని బుధవారం ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో పుస్తక సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ సమాజం అన్ని విధాల అభివృద్ధి చెందాలంటే విద్యుత్తోనే సాధ్యపడుతుందని అన్నారు. దీనిలో భాగంగానే విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు సామాగ్రి పంపిణీ చేయడం ముఖ్య ఉద్దేశమని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో విద్యారంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు. ఇప్పటికే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాఠశాలను విద్యారంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలో స్పీకర్ అయ్యన్న పాత్రుడు విద్య తో పాటు ఆరోగ్యం మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రత్యేక దృష్టి సాధించమని అన్నారు. ఇప్పటికే ప్రతి పాఠశాలకు ఐదు లక్షల చొప్పున నిధులు మంజూరు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు ఊడి చక్రవర్తి, జిల్లా సెక్రెటరీ పంచాడ హరినాథ్, అల్లాడి సురేష్, నాతవరం మండల పార్టీ అధ్యక్షులు వెలగల వెంకటరమణ, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు బొడ్డు శేఖర్, సీనియర్ నాయకులు వర్రే నరసింహ, మాకిరెడ్డి వెంకటరమణ, జనసేన కార్యకర్తలు అధిక సంఖ్యలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### యం అప్పలరాజు పై పెట్టిన

## తప్పుడు కేసులు వెంటనే ఎత్తి వేయాలి



**రోలుగుంట మనసులో మాట డిసెంబర్ 23.** అనకాపల్లి జిల్లా రోలుగుంట,సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యం అప్పలరాజు పై ప్రభుత్వం పోలీసులు పెట్టిన తప్పుడు కేసులు ఆంధ్రప్రదేశ్ ప్రమాదకర నివారణ సెక్షన్ 3 (1) కింద బూట్లె గ్గర్స్ దకాయిట్స్,డ్రగ్ నేరస్థులు, గూండాల కార్య కలాపాలు,అ నైతిక ట్రఫిక్ నేరస్థులు మరియు ల్యాండ్ గ్రాబర్స్ చట్టం,1986 నేరం క్రింద కేసులు పెట్టి ఆరెస్టు చేసి జైల్ కు పంపించ డాన్ని తీవ్రంగా ఖండిస్తూ బుధవారం రోలుగుంట. పిత్రి గడ్డ పనసలపాడు గ్రామాల్లో సిపిఎం అద్వర్యం పెద్ద ఎత్తున ఆందోళన చేసిన అనంతరం సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఈ చిరంజీవి గిరిజన సంఘం జిల్లా కన్వీనర్ మర్రి కామేశ్వరరావు మాట్లాడారు. నక్కపల్లి మండలం రాజయ్యపేట లో బల్క్ డ్రంగ్ పార్క్ కు వ్యతిరేకంగా మత్స్యకారులు చేస్తున్న ఉద్య మానికి మద్దతు ఇచ్చినందుకు తేది: 06.08.2025 నుండి తేది: 12.10.2025 ల మద్య మూడు నెలల కాలములో ఏడు పర్యాయములు అప్పలరాజు అరెస్టు అయ్యారని నేపంతో హత్య యత్నం,అక్రమ సమూహం, అక్రమ ప్రవేశం వంటి కేసులలో పునరావృతంగా పాల్గొంటూ ప్రజలలో భయం మరియు కలవరాన్ని సృష్టిస్తు న్నాడని మరియు సదరు వ్యక్తిని ఆంధ్ర ప్రదేశ్ అక్రమ మద్యం రవాణాదారులు, బంది పోట్లు,మాదక ద్రవ్య నేర స్తులు,గుండాగిరి వ్యభిచార నేరస్తులు మరియు భూ కబ్జాదారుల ప్రమాద కర కార్య కలాపములు నిరోధించు చట్టం 1986 సెక్షన్ 3 (1) (2) ఆర్/డబ్ల్యు 3 2(జి) ప్రకారము గుండాగా గుర్తించడ మైనదని,సదరు వ్యక్తి పై ఈ కింద పేరుకున్న కేసులు నక్కపల్లి పోలీస్ స్టేషన్ నందు నమోదు అయివున్నవని పోలీసులు కేసులు పెట్టారని తెలిపారు. ఈ కేసులు అన్ని సిపిఎం నాయుడు పై పెట్టడం అంటే ప్రజా స్వామ్యాన్ని అపహాస్యం చేసి రాజ్యం గాన్ని హేలన చేయడ మేనని పేర్కొన్నారు,రాజయ్యపేటలో బల్క్ డ్రంగ్ పార్క్ పరి శ్రమకు వ్యతి రేకంగా ఐదు నెలలు నుండి మత్స్య కారులు అందోన చేస్తున్నారని దీనికి మద్దతు ఇచ్చు నందుకు అప్పలరాజు పై ఇంతటి ఘాతాకానికి ప్రభుత్వ పోలీసులు పూనుకు న్నారని అగ్రహం వ్యక్తం చేశారు,అదికారం లోకి రాక ముందు బల్క్ డ్రగ్ పరి శ్రమకు వ్యతిరేకంగా మాట్లాడిన కూటమి నాయకులు అధి కారాన్ని చేయ జిక్కుంచు కుని మత్స్య కారులకు తీవ్ర మైన ద్రోహం చేస్తున్నారని తెలిపారు ఇటువంటి తప్పుడు కేసులు పెట్టి మత్స్యకారులు ఉద్యమాన్ని సిపిఎం నాయకులను బెదిరింపులకు పూనుకుంటె దీనికి కూటమి ప్రభుత్వ తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చ రించారు ప్రజలను భయ బ్రాంతులకు గురి చేస్తున్నారని సిపిఎం నాయకులు పై కేసులు పెట్టడం కాదని నిజానికి పోలీసులు అప్పలరాజు పై పెట్టిన కేసులన్ని పచ్చి బూటకపు కేసులని పోలీసులు అర్థం చేసుకోవాలి తెలిపారు. అదికారులు ప్రభుత్వం వ్యహరిస్తున్న తీరు పోలీసు అదికారులు పై పూర్తిగా ప్రజలకు నమ్మకం పోతుందని తెలిపారు. వెంటనే అప్పలరాజు పై పెట్టిన తప్పుడు కేసులను వెంటనే ఎత్తి వేయాలని బేషరతుగా విడుదల చేయాలని ఈ చిరంజీవి మర్రి కామేశ్వరరావు అదికసంఖ్యలో సిపిఎం శ్రేణులు పల్గోన్నారు.

### తప్పుడు డాక్యుమెంట్ సృష్టించి

## భూ ఆక్రమణకు ప్రయత్నించిన వ్యక్తి అరెస్టు

### రిమాండ్‌కు తరలింపు



పరవాడ డిసెంబర్ 24,(మనసులో మాట) అనకాపల్లి జిల్లా, పరవాడ మండలం, తిక్కవాని పాలెంలో తప్పుడు సేల్ డాక్యుమెంట్లు సృష్టించి భూ ఆక్రమణకు ప్రయత్నించిన వ్యక్తిని మంగళవారం స్థానిక పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించి పరవాడ సీఐ మల్లికార్జునరావు అందించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. తిక్కవానిపాలెం గ్రామానికి చెందిన తిక్కాడ సత్యనారాయణ తండ్రి అప్పన్న అనే వ్యక్తి, తనను తాను చేపల సత్యనారాయణ తండ్రి పరదేశిగా తప్పుడు ధ్రువీకరణ పత్రాలు చూపించుకుంటూ, తిక్కవానిపాలెం గ్రామానికి చెందిన 6.86 ఎకరాల భూమికి సంబంధించి తప్పుడు సేల్ డాక్యుమెంట్‌ను నమోదు చేయించి, ఆ తప్పుడు డాక్యుమెంట్ ఆధారంగా ఫిర్యాదిదారు ఎం సత్యనారాయణకు చెందిన భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించినట్లు వెల్లడించారు. ఫిర్యాది రిపోర్ట్ మేరకు కేసు నమోదు చేసి కూలంకషంగా దర్యాప్తు చేపట్టి ఆధారాలు సేకరించామని తెలిపారు. తమ దర్యాప్తులో, నిందితుడు ఆధారంగా చూపించిన లింక్ డాక్యుమెంట్‌కు చెందిన మొత్తం భూమిని 1998 నాటికే అసలైన వారసులు విక్రయించినారని ఇక ఎటువంటి భూమి ఆ డాక్యుమెంట్ ప్రకారంగా మిగిలి భూమి లేకపోయినప్పటికీ, లేని భూమికి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి వాటి ఆధారంగా ఫిర్యాది భూమిని ఆక్రమించేందుకు నిందితుడు ప్రయత్నించినట్లు ఆధారాలు లభించాయన్నారు. ఈ నేపథ్యంలో నిందితుడు తిక్కాడ సత్యనారాయణను అనకాపల్లి పట్టణంలోని సుంకరమెట్ట ప్రాంతంలో అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం 11వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్, అనకాపల్లి ఎదుట హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో అతడిని అనకాపల్లి సబ్‌జైలుకు తరలించడమైందని తెలిపారు. తప్పుడు డాక్యుమెంట్ సృష్టించి భూ ఆక్రమణకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా సీఐ తెలిపారు. ఎవరు భూ ఆక్రమణకు పాల్పడిన చట్ట పరిధిలో శిక్ష అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## సమానత్వం కోసం పోరాడిన సంఘసంస్కర్త పెరియార్..

### - పెరియార్ రామస్వామి స్ఫూర్తితో పోరాడుదాం




**విజయనగరం (మనసులోమాట) డిసెంబర్ 24:** సాంఘిక విప్లవకారుడు పెరియార్ 52వ వర్ధంతి సందర్భంగా విజయనగరం స్థానిక ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజీలో విద్యార్థులతో వర్ధంతి సభ నిర్వహించారు

ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.నాగభూషణం మాట్లాడుతూ ఈరోడ్ వెంకట రామస్వామి తమిళనాడులోని ఈరోడ్ పట్టణంలో 1879 సెప్టెంబర్ 17న జన్మించారు అని ఈ.వి రామస్వామి చిన్నప్పటినుండి ఎవరు ఏమి చెప్పినా వెర్రిగా వినేవాడు కాదు ఎందుకు ? ఏమి? ఎలా? అని అడగటం అలవాటు పెద్దగా చదువుకోనప్పటికీ మత గ్రంథాలను నిశితంగా పరిశీలించి హేతువాద దృక్పథాన్ని అలవర్చుకున్నాడు కాశీకి పోయి అక్కడ అనేక ఇబ్బందులు ఎదుర్కొని భక్తి ముసుగులో దేవుడి పేరుతో అనేక మోసాలు జరుగుతున్నాయని దేవుడనేవాడు లేడని నాస్తికుడి గా మారాడు అనిప్రస్తుత సమాజంలో అనేక సమస్యలు పట్టిపీడిస్తున్నాయి స్త్రీలకు విద్య అవసరమని సమానత్వం అవసరమని సెల్ఫ్ రెస్పెక్ట్ మూమెంట్ను అలాగే దేవదాసి పద్ధతులను రద్దు చేయాలని మానవులందరికీ సమాన హక్కులు కావాలని ఒక భాష ఇంకో భాష పైన ఒక మతం ఇంకో మతం పైన ఆధిపత్య ధోరణి నశించాలని సాంఘిక ఉద్యమాలు ఎన్నో నడిపి విజయం సాధించారని అన్నారు ఈ రోజు న

ఒకవైపు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుంటే మరోవైపు సాంకేతికతను ఉపయోగ పెట్టుకొని అదే స్థాయిలో మూఢనమ్మకాలు పెంచి పోషించే వారి సంఖ్య పెరుగుతున్నది అదేవిధంగా సాంకేతిక రంగాలలో దేశం పురోగమనంలో పయనిస్తానే ఓపక్క చెబుతూనే కేంద్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయాల్లో జ్యోతిష్య శాస్త్రాలు పెడతావున్నారు అని ఆగ్రహం వ్యక్తం చేశారు

ఈ మూఢనమ్మకాల తో మనషు ప్రాణాలు కోల్పోతున్న సందర్భాలు అనేకం

నరబలులు ,చేతబడి, బాణమతి , మంత్రాలు, అతీంద్రియ శక్తులు కలిగిన ఉంగరాలు అని చెప్పి సొమ్ము చేసుకునే బాబాలు స్వస్థత కుటుంబములలో కళ్ళు లేని వారికి కళ్ళు కాళ్లు లేని వారికి కాళ్లు వర్షాన్ని ఆపడం ఇలా చెప్పుకుంటూ పోతే అనేకం దీని వలన ప్రజలు మానసికంగా ఆర్థికంగా నైతికంగా ఇబ్బందులు ఎదుర్కోవటం ఈ మూఢనమ్మకాలు మానవ మొనగాడికే ప్రమాదకరంగా మారుతాయని శాస్త్రీయ దృక్పథం వాస్తవిక దృక్పథాన్ని పెంపొందించుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎ.సుమన్, సహాయ కార్యదర్శి పి. గౌరీ శంకర్ జిల్లా నాయకులు చరణ్ తేజ, రాము తదితరులు పాల్గొన్నారు



## నాతవరం మండలంలో అక్రమ మద్యం తయారీపై దాడులు

### - 1,200 లీటర్ల ఎఫ్.జే. వాష్ ధ్వంసం

**నాతవరం డిసెంబర్ 24( మనసులో మాట)..** ఈ రోజు ఉదయం జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా గారు మరియు నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ శ్రీ పి.శ్రీనివాసరావు వారి ఆదేశాల మేరకు, నాతవరం ఎస్సై వై.తారకేశ్వరరావు మరియు సిబ్బంది ఎక్సైజ్ పోలీసులతో కలిసి అక్రమ మద్యం తయారీపై కఠిన చర్యలు చేపట్టారు. నమ్మదగిన సమాచారం ఆధారంగా ఈ రోజు ఉదయం నాతవరం మండలం పరిధిలోని పడిమికొండ అటవీ ప్రాంతంలో సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమ మద్యం తయారీలో ఉపయోగించే 12 డ్రమ్స్ (సుమారు 1,200 లీటర్లు) ఎఫ్.జే. వాష్ ను గుర్తించి అక్కడికక్కడే పూర్తిగా ధ్వంసం చేశారు. అక్రమ మద్యం తయారీ, రవాణా, విక్రయాలపై జిల్లా వ్యాప్తంగా కఠిన నిఘా కొనసాగుతుందని, ఇటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు కూడా తమ పరిసరాల్లో అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినట్లయితే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## సామాన్యుడి నడ్డి విరుస్తున్న ఇటిక వ్యాపారస్తులు ఇటికకు మాత్రం జిఎస్టి వర్తింపు ఉండదా?

### బిల్లులు ఉండవా



**నాతవరం డిసెంబర్24( మనసులో మాట)..** వివరాల్లోకి వెళ్తే కొత్తగా ఇల్లు కట్టుకునే వారికి ఇటుక రేటు పెను భారంగా మారింది. ఒక్కొక్క ఏరియాలో ఒక్కొక్క రేటు.ఇటుక వ్యాపారస్తులు వాళ్లకు నచ్చినట్టు ఇష్టారాజ్యంగా ఇటుక రేట్లు పెంచి అమ్ముతున్నారు. లోకల్ గా ఉండే ప్రజలను అడగగా ఇటుకు డిమాండ్ ను బట్టి ఒక్క ఇటుక రేటు 6 రూపాయల నుండి 8 రూపాయలుగా సుమారుగా అమ్ముతున్నారు, ఈ లెక్కన ఒక్క ఇంటికి యావరేజ్ గా 8000 ఇటుక పట్టిన ఆరు రూపాయలు లెక్కన 48000 ఎనిమిది రూపాయలు లెక్కన చొప్పున 64000 రూపాయలు ఖర్చవుతుంది రవాణా రవాణా ఖర్చులు కలుపుకుంటే సుమారుగా ఇటుక్కే లక్ష రూపాయల దాకా ఖర్చు అవుతుంది. ఈ లెక్కన కొత్తగా ఇల్లు కట్టుకోమని ప్రభుత్వం పేదవాడికి ఇచ్చే ఆర్థిక సహాయం ఒక్క ఇటిక కె సరిపోతుంది మిగతా ఇల్లు మొత్తం పేదవాడు ఎలా కట్టాలి? ఇటుక దందా వ్యాపారస్తులు ప్రజలను ఎంతగా మోసం చేస్తున్నారో ప్రభుత్వం ఒకసారి ఆలోచించి బిల్ ఇవ్వకుండా అధిక రేట్లుకు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజలు కోరుకుంటున్నారు, సామాన్య ప్రజలకు ఏ చిన్న వస్తువు కొన్న బిల్లులు ఇస్తారు కానీ ఇంత పెద్ద మొత్తంలో వ్యాపారం జరుగుతున్న ఎటువంటి బిల్లులు కూడా ఇవ్వకుండా వ్యాపారం చేస్తున్న ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ విషయాన్ని గవర్నమెంట్ సీరియస్ గా తీసుకొని వెంటనే ప్రతి ఇటుకబట్టి దగ్గరకి వెళ్ళి సోదాలు నిర్వహించి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజలు కోరుకుంటున్నారు,

### బుచ్చంపేట విద్యార్థి జిల్లాస్థాయి వకృత్వ పోటీలో

## ప్రథమ బహుమతి



**రోలుగుంట మనసులో మాట, డిసెంబర్ 24..** అనకాపల్లి జిల్లా మండల కేంద్రమైన రోలుగుంటలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అనకాపల్లి జిల్లాలో నిర్వహించిన జిల్లాస్థాయి వకృత్వ పోటీలలో రోలుగుంట మండలం బుచ్చంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని చుక్కా కాంచనగంగ ప్రథమ స్థానాన్ని సాధించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఈ పోటీలు డిసెంబర్ 18 నుంచి 24 వరకు జిల్లా వ్యాప్తంగా జరిగాయి. అనకాపల్లిలో ఘనంగా జరిగిన బహుమతి ప్రదాన .కార్యక్రమంలో గౌరవ అనకాపల్లి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆమెకు ప్రథమ బహుమతిగా రూ. 5000 నగదు, సర్టిఫికేట్ను అందజేశారు. ఈ విజయం ఆమె పాఠశాలకు, మండలానికి గర్వకారణంగా మారింది. చుక్కా కాంచనగంగ సాధించిన ఈ ఘనతపై బుచ్చింపేట పాఠశాల చైర్మన్ చిటికెల వెంకటరమణరమణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి వి ఎస్ వరలక్ష్మి అభినందలు తెలియజేశారు. విద్యార్థుల్లో వక్తృత్వ నైపుణ్యాలను పెంపొందించడమేకాకుండా, వినియోగదారుల హక్కుల అవగాహనను వ్యాప్తి చేయడానికి ఇలాంటి పోటీలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని వారు పేర్కొన్నారు. ఈ సంఘటన రోలుగుంట మండలంలోని విద్యార్థుల్లో పోటీతత్వ భావాన్ని మరింత పెంచుతూ, స్థానిక విద్యా వ్యవస్థకు కొత్త ఉత్సాహాన్ని కలిగించింది.

## సీఐటీయూ అఖిలభారత మహాసభలో 2కె రన్ జెర్సీలు ఆవిష్కరణ

**అచ్చుతాపురం డిసెంబర్ 24. మనసులో మాట:** సీఐటీయూ అఖిలభారత మహాసభల భాగంగా ఈ నెల 27వ తేదీన శనివారం ఉదయం 6 గంటలకు నిర్వహించనున్న 2కె రన్ కు జెర్సీలు విడుదల చేశారు. ఈ రన్‌లో యువతీ-యువకులు, కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. పాల్గొనే వారందరికీ టీ-షర్టులు, స్నాక్స్ అందజేస్తారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచినవారికి నగదు బహుమతులు కూడా అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఇసాన్ ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్ ధర్మిరెడ్డి వెంకట్, సీఐటీయూ మండల కన్వీనర్ కె. సోమునాయుడు, నిర్వాహకులు ఆర్. అరుణ్, జె. అప్పలరాజు, కడారి ఉమాశంకర్, ఎం. రమణ, కె. వంశి తదితరులు పాల్గొన్నారు.



మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక



# యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

## నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్ రేవతమ్మ
## వేములపూడి లో "సంకల్పం" భారీ ర్యాలీ

**నర్సీపట్నం రూరల్ , డిసెంబర్ 24 , ( మనసులో మాట) :** యువత గంజాయి తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్ రేవతమ్మ పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, నర్సీపట్నం డిఎస్పి పి శ్రీనివాసరావు సూచనలతో మండలంలోని వేములపూడి జడ్పీ హైస్కూల్ లో బుధవారం నర్సీపట్నం రూరల్ సీఐ ఆధ్వర్యంలో పోలీసులు గంజాయి నిర్మూ లనపై అవగాహన సదస్సు నిర్వహించారు. అంతేకాక గంజాయి వ్యాపార నిరోధంపై పలు సూచనలు చేశారు. గంజాయి వ్యాపారం వలన కలిగే సమస్యలు, గంజాయి వినియోగం వల్ల వ్యక్తిగత జీవితంలోనూ, కుటుంబంలోనూ ఎదురయ్యే ప్రతికూల ప్రభావాలు, పట్టుబడ్డవారు ఎదుర్కొనే శిక్షలు గంజాయి సంబంధిత ఎన్ డి పి ఎస్ చట్టంపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు గంజాయి తదితరు మత్తు పదార్థాల వాడకంతో కలిగే ప్రమాదాలు, వాటి దుష్ప్రభావాలను వీడియోలు రూపంలో చూపించి అవగాహన కలిగించారు. గంజాయి లేదా డ్రగ్స్ కు సంబంధించిన ఎలాంటి సమాచారం తెలిసినా 112, 1972 నంబర్లకు ఫోన్ చేసి తెలియపరచాలని కోరారు.
గ్రామాలను గంజాయి వంటి మత్తు పదార్థాల నుండి పూర్తిగా విముక్తి చేయ డమే పోలీసుల ప్రధాన లక్ష్యమని రూరల్ సీఐ తెలిపారు. మెరుగైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో, ఉన్నత విలువలతో ఎదిగి, బాధ్యత గల పౌరులుగా మెలగాలని ఆమె సూచించారు. అనంతరం సుమారు 500 మంది విద్యార్థిని విద్యార్థులతో "సే నో టు డ్రగ్స్" నినాదాలతో వేములపూడి గ్రామంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సర్కిల్ ఎస్సైలు పి రాజారావు, దామోదర నాయుడు, సిబ్బంది, భారీ ఎత్తున ప్రజలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలి

## జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ ముస్తాబు కార్యక్రమం పరిశీలన



**అనకాపల్లి, డిశంబరు 24(మనసు లో మాట):** విద్యార్థులు పరిశుభ్రంగా తయారు అగుటవలన వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ తెలిపారు. బుధవారం జి.వి.ఎం.సి. బాలుర ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ తనిఖీచేసారు. పాఠశాలలో బోజనం నాణ్యత, ముస్తాబు కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సంధర్బంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ విద్యార్దులకు అందించే ఆహారం నాణ్యతగా ఉండాలని, శుభ్రమైన మంచినీరు అందించాలని తెలిపారు. ముఖ్యమంత్రి జిల్లాలో ప్రారంభించిన ముస్తాబు కార్యక్రమం అమలు తీరును పరిశీలిస్తూ ఈ కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా అమలుచేసి ఆదర్శంగా నిలువాలని, పాఠశాలకు శుభ్రంగా తయారై రావాలని, ప్రతిరోజు స్నానం చేయాలని, గోళ్లు ఎప్పటికప్పుడు కత్తిరించుకొని వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, బోజనం నకు ముందు తప్పని సరిగా చేతులు కడగాలని విద్యార్థులకు తెలిపారు.

# జగ్గఅప్పారావు(జగన్)ను జిల్లా కలెక్టర్ అభినందన



**అనకాపల్లి రూరల్, డిసెంబర్ 24 (మనసులో మాట):** పెద్ద హై స్కూల్ పూర్వపు విద్యార్థి, వినియోగదారుల ఉద్యమ కర్త బొడ్డేడ జగ్గప్పారావు (జగన్) ను అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అభినందించారు. మునగపాక మండలం, తోటాడ పంచాయితీ, గవర్లఅనకాపల్లి గ్రామానికి చెందిన వినియోగదారుల ఉద్యమకర్త, సోషల్ యాక్టివిస్ట్ బొడ్డేడ జగ్గఅప్పారావు (జగన్)ను జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ విజయ కృషణన్, పలువురు జిల్లా అధికారులు అభినందించారు. జగ్గఅప్పారావు వినియోగదారుల హక్కుల చట్టంపై సమైక్య విశాఖపట్నం జిల్లాలోనే కాకుండా తెలుగు రాష్ట్రాలలో విస్తృత స్థాయిలో ప్రజల్లో విశేష స్థాయిలో అవగాహన, చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలకు సేవ చేయడం ద్వారా, ప్రజా అభ్యుదయ కార్యక్రమాలు నిర్వహించడం ఫలితంగాతను విద్యనభ్యసించిన హైస్కూల్ లో ఆ హైస్కూల్ లోనే జిల్లా అధికారిచే అభినందనలు అందుకోవడం హర్షించదగ్గ విషయం, అభినందించదగ్గ విషయమంటూ జగ్గఅప్పారావును పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు, ఉపాద్యాయులు, విద్యార్థులు, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు. జగ్గప్పారావు జిల్లా జాతీయ అవార్డులు అందుకోవడం విశేషం.

# బజ్జన్నకొండను సందర్శించిన విదేశీ బౌద్ధ భిక్షువులు

## ప్రత్యేక పూజలు ప్రార్థనలు చేసిన బర్మా భిక్షువులు



**అనకాపల్లి రూరల్, డిసెంబర్ 24 (మనసులో మాట):** అనకాపల్లి మణిహారం, ప్రముఖ బౌద్ధ పర్యాటక క్షేత్రం" బొజ్జన్నకొండ"ను బర్మా బౌద్ధ బిక్షువుల బృందం బుధవారం సందర్శించారు. కొండపై గుహలో బుద్ధ భగవానునికి ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. బొజ్జన్నకొండ బౌద్ధ శిల్ప కళా నైపుణ్యమునకు బొజ్జన్న కొండ అని కీర్తించారు. మయన్మార్ (బర్మా) విదేశీ బౌద్ధ బిక్షువులు డా వెనరబుల్ ఆయిపాల భాన్తేజీ ఆధ్వర్యంలో 13 సభ్యుల బృందం పర్యటించింది. బౌద్ధ స్తూపం వద్ద భగవాన్ బుద్ధునికి ప్రత్యేక పూజలు, ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భముగా మయన్మార్ (బర్మా) పూజ్య బౌద్ధబిక్షువు డా..వెనరబుల్ ఆయిపాల భాన్తేజీ వారి బృంద బౌద్ధ బిక్షు వులతో కలసి మాట్లాడుతూ క్రీస్తు పూర్వం 3 వ శతాబ్దంలో ఆనాటి బౌద్ధ బిక్షువులు ఒకే కొండపై ఆనాటి బౌద్ధ శిల్ప కళా నైపుణ్యం లతో నిర్మించిన అతి ప్రాచీన కాలము నాటి బౌద్ధ క్షేత్రం ఈ బొజ్జన్నకొండ అని వివరించారు. ఆనాటి నుండి కూడా చెక్కు చెదరక నిలిచిన ప్రపంచ చారిత్రక ఆధ్యాత్మిక బౌద్ధ క్షేత్రం బొజ్జన్నకొండ అని, ఇంతటి విశిష్ట చరిత్రగల బౌద్ధక్షేత్రం అనకాపల్లి ప్రాంతములో ఉండటంతో అనకాపల్లి చరిత్ర ప్రపంచ బౌద్ధ పర్యాటక పటం లో శాశ్వతంగా నిలిచి పోతుందన్నారు. అరుదైన బౌద్ధ శిల్ప కళా సంపదను అందరూ కాపాడుకోవాలని, భగవాన్ బుద్ధుని శాంతి, అహింసా, ధర్మం, సత్య మార్గాలను అనుసరించాలని ఆయన పిలుపునిచ్చారు. బుద్ధుని ప్రవచనాలు ప్రపంచ శాంతికి దోహదపదాలని, బుద్ధుని శాంతి మార్గమే ప్రపంచ శాంతి కి మార్గదర్శకమని అందరూ బుద్ధుని జీవిత చరిత్రను తెలుసుకొని భగవాన్ బుద్ధుని బోధనలు సమాజానికి అందించాలని ఆయన కోరారు. సిద్దార్ధ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణము బొజ్జన్నకొండకు నిత్యము సందర్శకులతో బాటు దేశ, విదేశీ బౌద్ధ బిక్షువులు, దేశ, విదేశీ పర్యాటక సందర్శకులు వచ్చి, గౌతమ బుద్ధునికి ప్రార్ధనలు చేసి తరించి పోతారన్నారు. మధ్యకాలంలో సుమారు 15 .5 కోట్ల రూపాయల ప్రభుత్వ నిధులు వెచ్చించి ఎంతో ప్రతిష్టాత్మకం గా లైటింగ్, లేజర్ స్క్రీన్ ధియేటర్, ఫుడ్ కోర్ట్, సౌండ్ సిస్టం, వంటి అధునాతన సదుపాయాలతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య ప్రతినిధి బోర వేణుగోపాల్ గౌతమ్, సమాఖ్య సభ్యుడు బోర సిద్దార్ధ గౌతమ్, అనకా పల్లి బుద్ధిస్ట్ సొసైటీ ప్రతినిధులు నేలపూడి బాలరాజు, గుడాల అచ్యుత రామారావు, పూడి దయాల్ రాజు, సాపల నూకరాజు, బోర గగన్ గౌతమ్, పాల్గొన్నారు.

# సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయండి

## - సిఐటియు జిల్లా అధ్యక్షులు వి వి శ్రీనివాసరావు పిలుపు




**మునగపాక, డిసెంబర్ 24, మనసులో మాట..** సిఐటియు అఖిలభారత 18వ మహాసభలు డిసెంబర్ 31 నుంచి విశాఖపట్నంలో జరుగుతున్న సందర్భంగా మునగపాకలో ప్రచార పోస్టర్ను ఆవిష్కరించారు ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు వి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం విశాఖపట్నంలో సిఐటియు ఏర్పడిన తర్వాత జరుగుతున్న మొట్టమొదటి చారిత్రాత్మక అఖిలభారత మహాసభలను యావన్మంది కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో కార్మికుల సమస్యలపై అకుంఠిత దీక్షతో పోరాడుతున్న సిఐటియు మహాసభలు ఈ ప్రాంతంలో జరగటం ఈ ప్రాంత పోరాటాలకే వెన్నుదన్నుగా నిలుస్తాయని అన్నారు. అనకాపల్లి జిల్లాలో పారిశ్రామిక వాడల్లో కార్మిక హక్కులకై , ఉద్యోగ భద్రతకై సిఐటియు పోరాడుతుందన్నారు. స్కీం వర్కర్ల సమస్యలపై కనీస వేతనాల అమలకై అసంఘటితరంగ కార్మికులకు సిఐటియు ఎల్లవేళలా కృషి చేస్తుందన్నారు. 2026 జనవరి 4న విశాఖపట్నంలో లక్షలాది మందితోజరుగు కార్మిక ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ బహిరంగ సభకు సిఐటియు అఖిలభారత నాయకులు పాల్గొన్నారన్నారు. నాలుగో తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం నుండి టౌన్ కొత్త రోడ్డు వద్ద గల మున్సిపల్ స్టేడియం వరకు భారీ కార్మిక ప్రదర్శన అనంతరం బహిరంగ సభ జరుగుతాయని అన్నారు. కార్యక్రమంలో ఆళ్ల మహేశ్వర రావు, ఎస్ బ్రహ్మజీ, పెంటకోట సత్యనారాయణ, కాండ్రేగుల రాము తదితరులు పాల్గొన్నారు.

# పెద్దగుమ్మూలూరు పాఠశాలలో బాల్యవివాహాలు పై అవగాహన



ఎస్. రాయవరం మండలం పెదగుమ్ములూరు జిల్లాపరిషత్ హైస్కూల్ లో బుధవారం ఎలమంచిలి లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యులు బాల్య వివాహాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ నూకరాజు,పంచాయతీ కార్యదర్శి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మహిళా పోలీస్, ప్రధానోపాధ్యాయురాలు మాధురి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. బాల్యవివాహాలు ఎక్కువగా ఉండే దేశంలో తల్లి, శిశు మరణాల రేటు ఎక్కువగా ఉంటుందని తల్లి, పిల్లల ఆరోగ్యం కూడా ప్రమాదంలో పడతాయని తెలిపారు. కౌమార వివాహం వల్ల ఆందోళన, నిరాశ, ఆత్మహత్యాయ త్నాలు ఏర్పడతాయని, పోక్సో చట్టం, పిల్లల దుర్వినియోగం పై నూకరాజు అవగాహన కల్పించారు.బాల్య వివాహాలపై విద్యార్థులు అప్రమత్తం గా ఉండాలని సమాజంలో చైతన్యాన్ని ఏర్పరచాలని, వాటిని నిర్మూలించడంలో ఉపాధ్యాయ బృందమంతా సమిష్టిగా కృషి చేస్తామని , భారతదేశంలో బాల్య వివాహాలు 59శాతంగా నమోదవు తున్నాయన్నారు. దీనికి కారణం తక్కువ సామాజిక ఆర్థిక స్థితి, గ్రామీణ జీవనశైలి, మూఢనమ్మకాలు, నిరక్షరాస్యత, బాల్య వివాహ లను పెంచుతున్నాయని ప్రధానోపాధ్యాయుని మాధురి అన్నారు.

# 'మొర్రిగుడ'లో ఘనంగా పెసా మహోత్సవం



**దుంబ్రిగుడ, డిసెంబర్ 24, (మనసులో మాట) :** మండలంలోని పలు పంచాయతీ గ్రామాల్లో పెసా మహోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గసబ గ్రామ పంచాయతీ గ్రామాల్లో సిపిఎం సర్పంచ్ పాంగి సునీత ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడూతూ పెసా చట్టాన్ని మరింతగా బలోపేతం చేయాలనీ పిలుపునిచ్చారు. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు, వనరులు కాపాడాలని పెసా ఉపాధ్యక్షులు, కార్యదర్శులను కోరారు. గిరిజన భూములు అన్యాక్రాంతం కాకుండా బాధ్యతగా వ్యవహరించాలనీ చెప్పారు. షెడ్యూల్ ఏరియాలో ప్రాజెక్టులు నిర్మాణం చేయాలన్న, ఖనిజాలు తవ్వాలన్న పెసా అనుమతి, గ్రామసభ తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. చట్టవ్యతిరేక పనులు గంజాయి, నాటుసారా తయారీ, అమ్మకాలు నిషేదించాలనీ సూచించారు. గ్రామ సమస్యలు పెసా గ్రామసభలో చర్చించి పరిష్కరించాలని కోరారు. 1/70భూ బదాలయింపు చట్టాన్ని మరింత పటిష్టం చేయడానికి మీ వంతు కృషి చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో గసబ మాజీ సర్పంచ్ పి సురేష్ కుమార్ ,పంచాయతీ సెక్రటరీ కె గురుమూర్తి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నాగేంద్ర,,పెసా ఉపాద్యక్షులు, కార్యదర్శులు పి కొత్తుపి క్రిష్ణ మూర్తి, పి ప్రదీప్, వి చంపాస్ కుమార్, రమేష్, సోమేశ్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక క్రీడా ప్రతిభను శక్తివంతం చేయడానికి గంగవరంలో మహిళల జాతీయ కబడ్డీ శిబిరాన్ని ప్రారంభించిన అదానీ ఫౌండేషన్



**గాజువాక (మనసులోమాట) డిసెంబర్ 24** అదానీ ఫౌండేషన్, సహకారంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్, దాని కార్పొరేట్ సామాజిక బాధ్యత (సి యస్ ఆర్) కార్యక్రమాలలో భాగంగా గంగవరంలో 51వ జూనియర్ మహిళల జాతీయ కబడ్డీ ఛాంపియన్‌షిప్ శిబిరాన్ని ప్రారంభించింది. ఈ శిబిరం జాతీయ జట్టుకు ఎంపికైన 14 మంది అత్యుత్తమ క్రీడాకారిణులకు వృత్తిపరమైన శిక్షణ మరియు అనుభవాన్ని అందించడానికి రూపొందించబడింది, వీరిలో రాష్ట్ర మరియు జాతీయ స్థాయి కబడ్డీ ప్రతిభను ఉత్పత్తి చేయడానికి ప్రసిద్ధి చెందిన ప్రాంతం గంగవరం నుండి అనేక మంది ఆశాజనకమైన అథ్లెట్లు ఉన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి అదానీ గంగవరం పోర్ట్ లిమిటెడ్ మరియు అదానీ ఫౌండేషన్‌లకు చెందిన సీనియర్ నాయకులు, గ్రామ నాయకులు, కమ్యూనిటీ ప్రతినిధులు మరియు ఉత్సాహభరితమైన క్రీడాకారులు హాజరయ్యారు. క్రీడలను ప్రోత్సహించడం, స్థానిక ప్రతిభను శక్తివంతం చేయడం మరియు సమాజ అభివృద్ధిని పెంపొందించడం పట్ల అదానీ ఫౌండేషన్ యొక్క బలమైన నిబద్ధతను వారి ఉనికి పునరుద్ఘాటించింది. అదానీ గంగవరం పోర్టు బృందం నేతృత్వంలోని అదానీ గంగవరం ఫోర్ట్ యొక్క సి యస్ ఆర్ చొరవ కింద అన్ని శిబిర సౌకర్యాలు మరియు కబడ్డీ కిట్‌లను అందించారు. ఈ చొరవ అట్టడుగు స్థాయి ప్రతిభను పెంపొందించడం, క్రీడలలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం మరియు సాధికారత మరియు సమ్మిళిత సంస్కృతిని నిర్మించడంలో అదానీ ఫౌండేషన్ యొక్క అంకితభావాన్ని ప్రతిబింబిస్తుంద నిచెప్పారు. ఈ సందర్భంగా అదానీ గంగవరం పోర్ట్ మేనేజ్‌మెంట్ మాట్లాడుతూ, యువ అథ్లెట్లలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ మరియు జట్టుకృషిని ప్రేరేపించడానికి మహిళల జాతీయ కబడ్డీ శిబిరం ఒక వేదిక అని అన్నారు. స్థానిక ప్రతిభకు మద్దతు ఇవ్వడం ద్వారా మరియు ప్రపంచ స్థాయి సౌకర్యాలను అందించడం ద్వారా, అదానీ ఫౌండేషన్ సమాజంతో తన బంధాన్ని బలోపేతం చేస్తూనే ఉంది మరియు ఈ ప్రాంతం యొక్క సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుంది అని అన్నారు.



# అభివృద్ధిలో కూటమి ప్రభుత్వం జెట్ స్పీడ్ లో దూసుకుపోతుంది

## ఎలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్

**మునగపాక, డిసెంబర్ 24, మనసులో మాట..** మండలంలోని మల్లవరం పంచాయతీ గొల్లల పాలెం గ్రామంలో నూతనంగా 32 లక్షల రూపాయలతో నిర్మాణం చేపట్టే పంచాయతీ భవనానికి ఎలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధిలో పరుగులు పెడుతుందని అనడానికి ఈ పనులేనిదర్శనం అని అన్నారు. ఈ గ్రామపంచాయతీ బిల్డింగుల వలనసిసి రోడ్లు, డ్రైన్లు, పశువుల షెడ్లు,గుంతల రోడ్డు పూర్తి చేయడం,ఎన్నో మహోన్నతమైన కార్యక్రమాలతో పాటు అమరావతి రాజధాని పోలవరం ప్రాజెక్టు అనేక కార్యక్రమాలు చేపడుతున్న ద్వారాప్రజలు పల్లెల్లో ఎంత ఆనందంగా ఉన్నారు. మీ చిరునవ్వుల నిదర్శనం అని అన్నారు. మల్లవరం సాలాపు మురళీధర్, గొల్లలపాలెం సర్పంచ్. మొల్లి వెంకీ నాయుడు వెంకట్ లక్ష్మి వీరి ఆధ్వర్యంలో ఈ శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఈ యొక్క కార్యక్రమం లొ యలమంచిలి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, జనసేన మండల అధ్యక్షులు టెక్కలి పరశురామ్, దాడి ముసిలినాయుడు, ఇందల ప్రసాదరావు, పొడుగు లక్ష్మణరావు, ది హరికృష్ణ, బోధ రాంబాబు, మొల్లేటి వెంకట బోగేష్, మొల్లి అప్పలరాజు, చీర వెంకటలక్ష్మి,మరియు ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గున్నారు.

# ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న రాష్ట్ర ప్రభుత్వం-సిపిఎం



రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ తప్పుడు కేసులు నమోదు చేసి, పీడీఎఫ్ (ప్రివెన్టివ్ డిటెన్షన్ ఫోర్స్/పీడీ యాక్ట్) వంటి అణచివేత చర్యలను అమలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆధ్వర్యంలో ఎస్. రాయవరం మండలం అడ్డురోడ్డు లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.సత్యనారాయణ, మనబాల రాజేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న కార్యకర్తలు, నాయకులపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేయాలనే ప్రభుత్వ ప్రయత్నం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు.తప్పుడు కేసులు ఎత్తివేయాలని, పీడీఎఫ్ వంటి నిర్బంధ చట్టాల దుర్వినియోగాన్ని వెంటనే నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రజల హక్కుల కోసం పోరాడుతున్న వారిని అణిచివేయడం ద్వారా ప్రభుత్వం తన వైఫల్యాలను దాచుకోవాలని చూస్తోందని సీపీఎం ఆరోపించింది. ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించేందుకు ఇలాంటి అణచివేత చర్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని పార్టీ నాయకులు స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు, కార్యకర్తలు కే . ప్రసాద్ , మైలపల్లి బాలాజీ, శ్రీను పాల్గొని రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# గంటవానిపాలెంలో వైసీపీ నుండి జనసేన పార్టీలోకి జంప్

## పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్



**మునగపాక, డిసెంబర్ 24, మనసులో మాట..** మునపాక మండలం గంటవాని పాలెం గ్రామంలో వైసీపీ పార్టీకి చెందిన నాయకులు కార్యకర్తలు 50 మంది స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ సమక్షంలో మాజీ సర్పంచ్ ఆరిగా శ్రీను ఆధ్వర్యంలో జనసేన పార్టీ లో చేరారు. గ్రామ వైస్ ప్రెసిడెంట్ సేనాపతి వెంకీ నాయుడు, మాజీ పాల సంఘం అధ్యక్షులు గొంతున చినబ్బాయి, పంచాయతీ వార్డ్ మెంబర్ పొందిన సంతోష్, కార్యకర్తలు చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి పార్టీలకతీతంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల పార్టీ అధ్యక్షులు టెక్కలి పరుశు రాం, కూన అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

# చిన గోవాడ లో సంచార వైద్య సేవలు



**చీడికాడ, డిసెంబర్ 24, (మనసులో మాట)..**మండల కేంద్రమైన చీడికాడ గ్రామంలో సంచార వైద్య సేవ ప్రారంభించడం జరిగింది చిన్న గోకడ గ్రామంలో ప్రతి ప్రతి రెండవ బుధవారం ప్రతి నాలుగో బుధవారం జి కొత్తపల్లి గ్రామంలో నిర్వహించడం జరుగుతుంది ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా వైద్యాధికారి ఉషా చైతన్య కోరారు నాలుగు సంవత్సరాలుగా ఈ కార్యక్రమం జరుగుతుంది. అన్నారు వైద్యాధికారి ఉషా చైతన్య మాట్లాడుతూ మలేరియా డెంగ్యూ టైఫాయిడ్ మలేరియా జ్వరాలు రాకుండా ఉండేందుకు ప్రజలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో హెచ్ సి భారతి సూపర్వైజర్ శ్రీనివాస్ అశ కార్యకర్తల వైద్య సిబ్బంది పాల్గొన్నారు

మనసులో మాట

KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

కోస్తాంధ్ర

| | | |
|---|---|---|
| తూర్పు గోదావరి | పశ్చిమ గోదావరి | కృష్ణా |
| గుంటూరు | ప్రకాశం | నెల్లూరు |

గురువారం 25 డిసెంబర్ 2025



# క్రీస్తు నేడు పుట్టెను



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 24:** క్రిస్మస్ అంటే.. యేసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించుకునే ముఖ్యమైన మతపరమైన, సాంస్కృతిక పరమైన పండుగ. ఏసుక్రీస్తు పుట్టిన రోజు సందర్భంగా డిసెంబరు 25న ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు ఘనంగా జరుపుకుంటారు. ఈ పండుగ ప్రేమ, శాంతి, దానధర్మాలకు ప్రతీక, చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు, ఇళ్లను అలంకరించుకోవడం, క్రిస్మస్ చెట్లు, బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం, శాంతా క్లాజ్ వంటి సంప్రదాయాలతో ఈ పండుగను జరుపుకుంటారు. క్రైస్తవులకే కాకుండా అనేకమందికి ఇది కుటుంబంతో కలిసి జరుపుకొనే ఒక పర్వదినం. ఈ పండుగలలో క్రిస్మస్ చెట్లు, బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం, శాంతా క్లాజ్, ప్రత్యేక ప్రార్థనలు, కుటుంబ విందులు వంటివి ప్రధాన సంప్రదాయాలు.

**ప్రాముఖ్యత..**

ఏసుక్రీస్తు జననం..రెండు వేల సంవత్సరాల క్రితం బెత్లెహేములో ఏసుక్రీస్తు జన్మించాడని బైబిల్ చెబుతోంది. దీనిని పురస్కరించుకుని ఈ పండుగ జరుపుకుంటారు. అయితే ఆయన పుట్టిన కచ్చితమైన తేదీపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి.

**దేవుని ప్రేమ..**

ఏసుక్రీస్తు దేవుని కుమారుడని, మానవజాతి రక్షకుడని క్రైస్తవులు విశ్వసిస్తారు, ఆయన జననం దేవుని ప్రేమకు నిదర్శనంగా భావిస్తారు. దేవుడు మానవ రూపంలో భూమిపైకి వచ్చి మానవాళి పాపాలను తొలగించాడని, లోకానికి రక్షణను తెచ్చాడని ఈ పండుగ గుర్తు చేస్తుంది.

**సంప్రదాయాలు- వేడుకలు..**

చర్చి ప్రార్థనలు- క్రిస్మస్ రోజున చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు, ప్రత్యేక సేవలు నిర్వహిస్తారు.

**క్రిస్మస్ చెట్టు..**

జర్మనీలో ప్రారంభమైంది ఈ క్రిస్మస్ చెట్టు సంస్కృతి. రంగుల కాగితాలు, నక్షత్రాలు, చిన్న గాజు గోళాలతో క్రిస్మస్ చెట్టును అలంకరిస్తారు. ఇది ఈ పండుగలో ఒక ముఖ్యమైన భాగం.

**బహుమతులు-శాంతా క్లాజ్..**

పిల్లలు మేజోళ్ళు వేలాడదీస్తారు. శాంతా క్లాజ్ వాటిలో బహుమతులు పెడతాడని నమ్ముతారు. పేదలకు బహుమతులు ఇవ్వడం కూడా ఆనందాన్ని పంచుతుంది.

**అలంకరణలు..**

ఇళ్లను, చర్చిలను నక్షత్రాలు, దీపాలతో అందంగా అలంకరిస్తారు. బంధు మిత్రులను కలిసి శుభాకాంక్షలు తెలుపుకుంటారు.

**చారిత్రక నేపథ్యం..**

క్రిస్మస్ అనేది కేవలం క్రైస్తవుల పండుగే కాకుండా, ప్రాచీన యూరోపియన్ సంప్రదాయాల నుండి కూడా కొన్ని అంశాలు కలగలిసి ఉన్నాయి. క్రీస్తు శకం 336లో రోమ్‌లో కాన్స్టాంటైన్ చక్రవర్తి కాలంలో డిసెంబరు 25న క్రిస్మస్ వేడుకలను అధికారికంగా ప్రారంభించారు. ఈ పండుగ ప్రేమ, శాంతి, ఐక్యతను పంచుకోవడానికి ఒక గొప్ప అవకాశం. రోమన్ సామ్రాజ్యంలో శీతాకాలపు అయనాంతం రోజున (డిసెంబరు 25) దీనిని జరుపుకోవడం మొదలుపెట్టారు.

**ఏసుక్రీస్తు చరిత్ర..**

ఏసు క్రీస్తు చరిత్ర అనేది ప్రధానంగా బైబిల్ ఆధారంగా రూపొందించబడింది, ఆయన క్రీ.పూ. 4-6 మధ్య బేత్లెహేమ్‌లో మేరీ, యోసేపులకు జన్మించారు. నజరేత్‌లో పెరిగారు. 30 ఏళ్ల వయసులో బాప్తిస్మం పొంది తన పరిచర్యను ప్రారంభించారు, అదుతేలు చేసి, దేవుని రాజ్యం గురించి బోధించారు. శిలువపై మరణించి, పునరుత్థానం చెందారు. క్రైస్తవ మతానికి కేంద్రంగా మారారు, ఆయనను దేవుని కుమారుడిగా, రక్షకుడిగా విశ్వసిస్తారు. రోమన్ జనాభా లెక్కల కారణంగా..మేరీ, యోసేపులు నజరేత్ నుండి బేత్లెహేమ్‌కు ప్రయాణించగా, అక్కడ యేసు జన్మించారు. ఆయన గలిలయలోని నజరేత్‌లో పెరిగారు, వడ్రంగిగా తండ్రికి సహాయం చేశారు. సుమారు 30 సంవత్సరాల వయసులో యోర్దాను నదిలో బాప్తిస్మం తీసుకున్నారు. తనతో పాటు బోధించడానికి 12 మంది అపోస్తలులను ఎన్నుకున్నారు.

**అదుతేలు..**

రోగులను స్వస్థపరచడం, గుడ్డివారికి చూపు ఇవ్వడం, మృతులను లేపడం వంటి అదుతేలు చేశారు. దేవుని రాజ్యం, ప్రేమ, క్షమాపణ, నీతి గురించి బోధించారు.

**మరణం - పునరుత్థానం..**

**సిలువ:** ఆయన బోధనలు, దైవత్వం గురించి యూదు నాయకులకు నచ్చకపోవడంతో, ఆయనను సిలువ వేసి చంపించారు.

**పునరుత్థానం:** చనిపోయిన మూడవ రోజున తిరిగి లేచారని క్రైస్తవులు విశ్వసిస్తారు, ఇది ఆయన దైవత్వానికి, రక్షణకు నిదర్శనంగా భావిస్తారు.

**క్రైస్తవ విశ్వాసం**

**రక్షకుడు:** యేసును మానవాళి పాపాలకు ప్రాయశ్చిత్తంగా పంపబడిన దేవుని కుమారుడిగా, రక్షకుడిగా నమ్ముతారు. 'క్రీస్తు' అంటే 'అభిషిక్తుడు' అని అర్థం, ఇది మెస్సీయకు గ్రీకు అనువాదం.

చారిత్రక ఆధారం. యేసు క్రీస్తు నిజంగా చరిత్రలో జీవించారని చాలామంది పండితులు అంగీకరిస్తారు. అయితే ఆయన పాత్రపై వివిధ సిద్ధాంతాలు ఉన్నాయి (ప్రవక్త, గురువు, మొదలైనవి).

**బైబిల్ పాత్ర..**

బైబిల్, ముఖ్యంగా కొత్త నిబంధన, ఆయన జీవితం, బోధనలు, మరణం గురించి వివరించే ప్రధాన మూలం. మానవుల రక్షణ కోసం ఏసు వచ్చాడని, తనను ప్రేమించిన మానవుల కోసమే అవతారం చాలించారని ఆయన భక్తులు విశ్వసిస్తారు. క్రీస్తు జననం ఒక అదుతేం, క్రీస్తు మాటలు ప్రజలందరికీ శాంతి వచనాలు.



## వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన పెంచుకోవాలి

**- జేసీ అపూర్వ భరత్**

**కాకినాడ (మనసులో మాట), డిసెంబరు 24:** వినియోగదారుల హక్కులను కాపాడటంతో పాటు వినియోగదారులు సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడానికి రూపొందించిన, వినియోగదారుల రక్షణ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ కోరారు. కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా పౌరసరఫరాల శాఖ, పాఠశాల విద్యా, జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా స్థాయి జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్ వసంత కుమార్, నెంబర్ సూచి, డీఈఓ పీ రమేష్ ఇతర శాఖల అధికారులతో కలిసి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కమర్షియల్ టాక్స్, హైయర్ ఎడ్యుకేషన్, ఫుడ్ కంట్రోల్, సెట్రాజ్, లీగల్ మెట్రాలజీ, జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య సభ్యులు హాజరైన ఈ సమావేశంలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వివిధ అంశాలపై నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విజేతలకు జేసీ, ఇతర అధికారుల చేతుల మీదుగా ప్రశంస పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. తొలుత పౌరసరఫరాలు, తూనికలు కొలతలు, ఆహార భద్రత శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ను జేసీ అపూర్వ భరత్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేసీ అపూర్వ భరత్ మాట్లాడుతూ..1986లో వినియోగదారుల రక్షణ చట్టం అమల్లోకి వచ్చిందని, అప్పటి నుంచి భారతదేశంలో ప్రతి ఏటా డిసెంబరు 24న వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని జరుపు కుంటున్నామన్నారు. ప్రస్తుత రోజుల్లో క్యాన్సర్ వ్యాధులు ఎక్కువగా ప్రబులుతున్నాయని, ఈ వ్యాధి సంఖ్య రానున్న రోజుల్లో మరింత గణనీయంగా పెరిగే అవకాశం ఉందన్నారు. దీనికి ప్రధాన కారణం మనం రోజు తినే ఆహారం, ఇతర తిని బండారాలేనని ఆయన అన్నారు. నాణ్యతలేని, కల్తీ చేసిన ఆహార పదార్థాలను తినడం ద్వారా ప్రజలు వివిధ ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. నాణ్యతలేని, కల్తీ చేసిన పదార్థాలను అరికట్టేలా ప్రతి ఒక్కరూ జాతీయ వినియోగదారుల హక్కులు, రక్షణపై రూపొందించిన చట్టాలను అవగాహన పెంపొందించేందుకోవాలని జేసీ తెలిపారు. జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్ వసంత కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే వినియోగదారుల హక్కులు చట్టంపై విస్తృత అవగాహన పెంపొందించుకోవాలన్నారు. రోజు వారి గృహోపకరణాలు, నిత్యావసర సరుకులు కొనుగోలులో నాణ్యతా ప్రమాణాలు, కల్తీ చేసిన పదార్థాలను నిశితంగా పరిశీలించాలని ఆయన విద్యార్థులకు సూచించారు. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో ఈ నెల 18 నుంచి వివిధ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని జిల్లా పౌరసరఫరాల అధికారి ఆర్ఎస్ఎస్ సత్యనారాయణ రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ కళాశాల విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహించడం జరిగిందని, జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో గెలిచిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించనున్నట్టు ఆయన తెలిపారు. సమావేశంలో జిల్లా తూనికలు, కొలతలు శాఖ డిప్యూటీ కంట్రోలర్ జనార్దన్ రావు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జీవీడీ నందాజీ, ఎఫ్ఎస్ఓ సుబ్బారావు, సెట్రాజ్ సీఈవో కేవీఎస్ కాశీ విశ్వేశ్వరరావు, ఇతర శాఖల అధికారులు, వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రతినిధి బీ శివమూర్తి, ఇతర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ పాఠశాల కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే గిడ్డి

**అమలాపురం (మనసులో మాట) డిసెంబరు 24 :** విజయవాడ వెలగపూడి ఆంధ్రప్రదేశ్ సచివాలయం లో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ని పి గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పి గన్నవరం నియోజవర్గంలో జరిగిన అభివృద్ధి పనులు ప్రజా సమస్యల పరిష్కారానికి వినూత్నంగా చేపట్టిన వాడవాడ కు మన ఎమ్మెల్యేకు గిడ్డి కార్యక్రమం పై ప్రజల్లో వస్తున్న స్పందన పై సీఎంకు ఎమ్మెల్యే వివరించారు. నియోజకవర్గంలో దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న ప్రధాన సమస్యలపై సీఎం చంద్రబాబు కి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ వివరించారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి నియోజకవర్గంలో అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు తెలిపారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

**-రూరల్ మండల బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఎంపీ పురందేశ్వరి**






**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 24:** ప్రజా సమస్యలు పరిష్కరించడం ద్వారా పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర పూర్వ అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పిలుపు నిచ్చారు. రాజమహేంద్రవరం రూరల్ 3వ మండల నాయకులు, కార్యకర్తలు బూత్ కమిటీలు, శక్తి కేంద్రాలతో ధవళేశ్వరం కాటన్ మ్యూజియంలో బుధవారం ఉదయం ఏర్పాటుచేసిన ముఖాముఖి సమావేశంలో ఎంపీ పురందేశ్వరి పాల్గొన్నారు. ముందుగా డెల్టా రూపశిల్పి సర్ ఆర్థర్ కాటన్ విగ్రహానికి ఎంపీ పురందేశ్వరి పూలమాలవేసి భక్త్యాంజలి ఘటించారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి అల్పాహారం స్వీకరించారు. అందరితో కల్సి నేలపైనే కూర్చుని, పేరుపేరునా అందరి వివరాలు, సాధక బాధకాలు అడిగి తెలుసుకున్నారు. పలు విషయాలు చర్చించారు. పంచాయతీ స్థాయిలో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీ పురందేశ్వరి సూచించారు. ప్రజలతో మమేకమై పనిచేయాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, మండల అధ్యక్షుడు షేక్ సాజిద్, మండల ప్రధాన కార్యదర్శి కుబేర రావు, అసెంబ్లీ నాయకులు యానాపు ఏసు, ఆకుల శ్రీధర్, సీనియర్ నాయకులు ఒంటెద్దు స్వామి, పన్నాల వెంకట సంతోషి, తనుబుద్ధి సూర్యభాస్కర్, గుర్రాల వెంకట్రావు, కొండలరావు, యువమోర్చ నాయకుడు ధనుంజయ్, ఓబీసీ నాయకులు జీ సూరిబాబు, నాగేశ్వరరావు, రామలక్ష్మి, జగన్నాథం, జిల్లా ఎస్సీ మోర్చా నాయకులు తగరం సురేష్, రాజు, పౌరోజు ఏసు, షేక్ సత్తార్, ఆనంద సాగర్, శ్రీనివాసు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



## శాంతియుత సమాజ స్థాపనకు కృషి చేద్దాం

**- జగతికి శాంతి సందేశమిచ్చిన మహానుభావుడు ఏసు ప్రభువు**

**- క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కందుల దుర్గేష్**

**తూర్పు గోదావరి జిల్లా ప్రతినిధి (మనసులో మాట), డిసెంబరు 24:** క్రిస్మస్ పర్వదిన సందర్భంగా క్రైస్తవ సోదరులకు మంత్రి కందుల దుర్గేష్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, కరుణకు ప్రతీకగా నిలిచిన ఏసు ప్రభువు ఆశించిన శాంతియుత సమాజ స్థాపనకు కృషి చేద్దామని మంత్రి కందుల దుర్గేష్ బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రపంచ మానవాళికి శాంతియుతమైన, ప్రేమపూర్వకమైన జీవన మార్గాన్ని ఉపదేశించి సమాజాన్ని సంస్కరించిన యుగకర్త ఏసు ప్రభువు అన్నారు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ అనే పదాలను ఉదహరిస్తూ దుష్టులను శిక్షించాలని, శిష్టులను రక్షించాలని అంటారు కానీ తనను హింసించి శిలువ వేసిన దుష్టులను సైతం కాపాడమని చెప్పిన మహానుభావుడు ఏసు ప్రభువు అని మంత్రి దుర్గేష్ అన్నారు. ప్రతి ఒక్కరూ స్వార్థాన్ని వీడితేనే సమసమాజ స్థాపన సాధ్యమవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం మైనార్టీ లకు అండగా నిలుస్తోందన్నారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ మంత్రి కందుల దుర్గేష్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

## రొయ్యల పిల్లలు సీడ్ సేకరణ వివాదానికి శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు





**అమలాపురం (మనసులో మాట) డిసెంబరు 24...** ధవళేశ్వరం ఆనకట్ట వద్ద రొయ్యల పిల్లల సీడ్ సేకరణకు సంబంధించి తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం మత్స్యకార సహకార సంఘం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా బొబ్బర్లంక మత్స్యకారుల మధ్య సరిహద్దులపరంగా నెలకొన్న వివాదానికి శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని రెండు జిల్లాల జాయింట్ కలెక్టర్లు టీ నిశాంతి, వై మేఘా స్వరూప్ లు అధికారులను ఆదేశించారు. అమలాపురం కలెక్టరేట్లో రెండు జిల్లాల జాయింట్ కలెక్టర్లు జల వనరులు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి గత 20 సంవత్సరాలుగా ధవళేశ్వరం బొబ్బర్లంక మత్స్యకారుల మధ్య కొనసాగుతున్న రొయ్యల పిల్లలు సేకరణకు సంబంధించిన వి వాదంపై శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ధవళేశ్వరం మత్స్యకార సహకార సంఘం లీజు అంశంపై కోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో కోర్టు ఆదేశాలు మేరకు ఈ సమావేశం ప్రాముఖ్యత సంతరించుకుందని తెలిపారు. ఇటీవల నియమించిన జాయింట్ కమిటీ నివేదిక ప్రకారం బొబ్బర్లంక మత్స్యకారులు ఇప్పటికీ ప్రత్యేక సహకార సంఘం గా నమోదు కాలేదని ధవళేశ్వరం మత్స్యకార సహకార సంఘం ద్వారా రెండు రకాల రొయ్య పిల్లల సీడ్ ను బ్యారేజ్ గేట్లు గోడల లీకేజీ నీటిలో సేకరించి చెరువుల్లో పెంచి తెలంగాణ కర్ణాటక రాష్ట్రాలకు విక్రయిస్తున్నట్లు అధికారులు వివరించారు. గతంలో ధవళేశ్వరం వద్ద 70 గేట్లు, బొబ్బర్లంక వద్ద 43 గేట్లు మత్స్యకారులకు లీజుకు ఇచ్చేవారని నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు రొయ్య సీడ్ సేకరణ జరుగుతుందని తెలిపారు. ఈ ఏడాది బొబ్బర్లంక మత్స్యకారులను సంఘాలుగా ఏర్పడాలని సూచించడంతో పాటు వివాదం పరిష్కారం అయ్యే వరకు లీజును నిలివేసినట్లు వెల్లడించారు. కాటన్ బ్యారేజి ఏ జిల్లా పరిధిలోకి వస్తుందో సరిహద్దులను ఖచ్చితంగా గుర్తించాలని బ్యారేజ్ గేట్లు గోడల వద్ద రొయ్య పిల్లల సేకరణ వలన ఆనకట్టకు పర్యావరణ పరంగా నష్టం ఉంటే జల వనరుల శాఖ శాస్త్రీయ అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ఇరువురి జాయింట్ కలెక్టర్లు అధికారులను ఆదేశించారు. అలాగే ఆనకట్ట వద్ద రొయ్య పిల్లల సేకరణ లాభనష్టాలు డౌన్ స్ట్రీమ్ లో సేకరణ లాభదాయకరం లావదాయకతపై మత్స్యశాఖ అధ్యయనం చేయాలని సూచించారు. డిసెంబరు 30 నాటికి 30 నాటికి జల వనరులు మత్స్య, సర్వే శాఖలు తమ తమ నివేదికలను సమర్పించాలని జనవరి 22న మరోసారి పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామని జెసిలు తెలిపారు. ఇకపై లీజు ఒప్పందాల సమయంలో డిపాజిట్ విధానం అమలు చేసి బ్యారేజీ ఎకో సిస్టంకు నష్టం జరిగితే ఆ నిధుల నుంచి రికవరీ చేయాలనే నిర్ణయించినట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో మత్స్యశాఖ అధికారులు పీవీ శ్రీనివాసరావు టి సుమలత సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి కే ప్రభాకర్ మత్స్య అభివృద్ధి అధికారులు జల వనరుల శాఖ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

## హార్వెస్ట్ పాఠశాలలో మిన్నంటిన క్రిస్మస్ సంబరాలు

**- ఆకట్టుకున్న చిన్నారుల నాటికలు.. - అలరించిన క్రిస్మస్ నృత్యాలు**



**పిఠాపురం, (మనసులో మాట) డిసెంబరు 24:** స్థానిక హార్వెస్ట్ పాఠశాల ప్రాంగణం బుధవారం క్రిస్మస్ వేడుకలతో కోలాహలంగా మారింది. విద్యార్థులు, ఉపాధ్యాయుల సమక్షంలో పండుగ సంబరాలను పాఠశాల యాజమాన్యం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్లు సత్యమోహన్ రెడ్డి, సత్యానంద రెడ్డిలతో పాటు సేవా భారతి డైరెక్టర్ జయదీప్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాస్టర్ జోయల్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, క్రీస్తు జన్మవృత్తాంతాన్ని, శాంతి సందేశాన్ని విద్యార్థులకు వివరించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన క్రిస్మస్ నాటికలు అందరినీ విశేషంగా అలరించాయి. విద్యార్థులంతా క్రిస్మస్ తాత (శాంతా క్లాజ్) వేషధారణలో చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం క్రిస్మస్ పురస్కరించుకుని నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కరస్పాండెంట్ల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ వేడుకలతో పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# క్రిస్మస్ శుభాకాంక్షలు

**- జిల్లా ఇన్చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 24:** క్రిస్మస్ పండుగ శుభ సందర్భంగా క్రైస్తవ సోదర, సోదరీమణులందరికీ జలవనరుల శాఖ మంత్రి, తూర్పు గోదావరి జిల్లా ఇంచార్జి మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు బుధవారం ఒక ప్రకటనలో హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభు యేసుక్రీస్తు బోధించిన ప్రేమ, కరుణ, శాంతి, దయ, ఐక్యత వంటి విలువలు ప్రతి ఒక్కరి జీవితంలో ఆచరణీయమని అన్నారు. క్రిస్మస్ పండుగ మానవత్వాన్ని పెంపొందించి, సమాజంలో ఐక్యతను మరింత బలపరచాలని ఆకాంక్షించారు. ఈ పర్వదినం అందరి జీవితాల్లో కొత్త ఆశలు, కొత్త లక్ష్యాలతో ముందుకు సాగేందుకు ప్రేరణనివ్వాలని ఆ ప్రకటనలో మంత్రి నిమ్మల రామానాయుడు ఆకాంక్ష వ్యక్తం చేశారు.

# పేకాట శిబిరం పై పోలీసు దాడి



**జగ్గంపేట (మనసులోమాట) డిసెంబరు 24..** కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఎక్కడ ఎటువంటి జూద క్రీడలు జరుగకుండా చూడాలని ఆదేశాలు జారీ చేయడం జరిగింది.దానిలో భాగంగా సీఐ కు రాబడిన సమాచారం మేరకు జగ్గంపేట ఎస్.ఐ రఘునందన్ రావు మరియు సిబ్బందితో జగ్గంపేట నుండి గోకవరం పోవు రోడ్డులో రాజపూడి గ్రామ శివారులో పేకాట రాయులు పై దాడి చేసి నలుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 10,030 రూపాయలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయడం జరిగింది. ఎవరైనా కోడిపందాలు గుండాటలు , పేకాటలు ఎత్తు లాటలు, బొమ్మా బొరుసు లాంటి జూద క్రీడలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. జూద క్రీడల గురించి సమాచారం ఉంటే 100,112, 9440796529, 9440796508, కాకినాడ జిల్లా పోలీస్ వాట్సాప్ నంబర్ 94949 33233 కు గాని తెలియజేయాలనీ ఈ సందర్భంగా సీఐ వై అర్ కే తెలియజేసారు.

# పంట కాలువ శుభ్రం



**ముమ్మిడివరం (మనసులో మాట) డిసెంబరు 24:** మాగం - అయినాపురం పంట కాలువను నీటి సంఘం అధ్యక్షులు సరిపెల్ల శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో శుభ్రం చేయించడం పట్ల పలువురు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భముగా సోమిదేవరపాలెం నీటి సంఘం డైరెక్టర్లు తాడి వెంకట రమేష్ బాబు(పెద బాబు), మట్టపర్తి నాగేశ్వరరావు ,రైతులు సానబోయిన చంటి, సానబోయిన వెంకటస్వామి జయను బాబ్జీ లతో పోటు పలువురు రైతులు శ్రీనివాసరాజును అభినందించారు.

### డిజిటల్ న్యాయ పాలన ద్వారా వినియోగదారులకు

# సమర్థ, సత్వర పరిష్కారం

**- లావాదేవీల్లో హక్కులు తెలుసుకుని వినియోగదారులు బాధ్యతతో వ్యవహరించాలి**
**- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన వినియోగదారుల అవగాహనా స్టాల్స్**
**- ఇంచార్జి కలెక్టర్ వై మేఘా స్వరూప్**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 24:** వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై ప్రతి ఒక్కరూ స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని, డిజిటల్ న్యాయ పాలన ద్వారా వినియోగ దారులకు సత్వర న్యాయం సాధ్యమవుతోందని తూర్పు గోదావరి జిల్లా ఇంచార్జి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ అన్నారు. బుధవారం రాజమహేంద్రవరం దానవాయిపేట లోని ఎస్‌కేవీటీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆవరణలో జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ వినియోగదారుల దినోత్సవం-2025 కార్యక్రమాన్ని ఇతర అధికారులతో, వినియోగదారుల ఫోరం సభ్యులతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ వై మేఘా స్వరూప్ మాట్లాడుతూ వినియోగదారుల హక్కులను పరిరక్షించాలనే ఉద్దేశంతో 1986 డిసెంబరు 24న వినియోగదారుల రక్షణ చట్టం అమల్లోకి వచ్చిందని, కాలానుగుణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని 2019లో సవరించిన చట్టం ద్వారా ఈ%-%కామర్స్ లావాదేవీలను కూడా చట్ట పరిధిలోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. దీని వల్ల ఆన్ లైన్ కొనుగోళ్లలో వినియోగదారులకు మరింత రక్షణ లభిస్తోందన్నారు.

2025 సంవత్సరానికి గాను జాతీయ వినియోగదారుల దినోత్సవ ఇతివృత్తంగా నిర్ణయించిన "డిజిటల్ న్యాయ పాలన ద్వారా సమర్థ, సత్వర పరిష్కారం" నేటి పరిస్థితులకు పూర్తిగా అనుగుణమైనదిగా ఉందన్నారు. డిజిటల్ న్యాయ పాలన ద్వారా కేసుల నమోదు నుంచి విచారణ, ఆదేశాల జారీ వరకు మొత్తం న్యాయ ప్రక్రియను సాంకేతికత ఆధారంగా నిర్వహించడం వల్ల వినియోగదారులకు వేగవంతమైన, పారదర్శక తో కూడిన న్యాయం అందుతోందని తెలిపారు. ఈ%-%కోర్ట్స్, ఆన్‌లైన్ ఫైలింగ్, వర్చువల్ విచారణల ద్వారా వినియోగదారులు ఇంటి నుంచే కేసుల వివరాలు తెలుసుకునే సౌకర్యం పొందుతున్నారని చెప్పారు. తద్వారా సమయం ఆదా కావడంతో పాటు పరిష్కారాలు త్వరితగతిన లభిస్తున్నాయన్నారు.

వినియోగదారులు కేవలం హక్కులు కలిగినవారే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన శక్తి అని జాయింట్ కలెక్టర్ వివరించారు. ప్రజల వినియోగమే ఉత్పత్తి, ఉపాధి, ప్రభుత్వ ఆదాయానికి పునాదిగా నిలుస్తుందన్నారు. బాధ్యతాయుత వినియోగదారులు ప్రతి కొనుగోలుకు బిల్లు తీసుకోవడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయగలరని తెలిపారు. నాణ్యత ప్రమాణాలు కలిగిన ఉత్పత్తులను ఎంపిక చేసుకోవడం, పర్యావరణ హితమైన వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వడం, ఏదైనా లోపం లేదా మోసం జరిగితే వెనుకాడకుండా పరిష్కార వేదికలను ఆశ్రయించాలని సూచించారు. జాతీయ వినియోగదారుల సహాయ కేంద్రం 14404 లేదా 1915 ద్వారా, అలాగే రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసిన వినియోగదారుల కమిషన్ల ద్వారా సత్వర న్యాయం పొందవచ్చన్నారు.

విదేశాల్లో ఉత్పత్తుల విక్రయాల సమయంలో ప్యాకింగ్‌పై నిర్దేశించిన మార్గదర్శకాలు పాటించని పక్షంలో ఉత్పత్తిదారులు తప్పనిసరిగా తగిన పరిహారం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అందుకే అక్కడ ఉత్పత్తిదారులు, వ్యాపారులు అధిక జవాబుదారితనంతో వ్యవహరిస్తున్నారని వివరించారు. జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ జడ్జి వైవీఎస్ వీ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా కన్స్యూమర్ కోర్టుకు వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరిస్తున్నామని తెలిపారు. వినియోగదారులు నామ మాత్రపు ఫీజుతో నేరుగా గానీ, రిజిస్టర్డ్ పోస్టు ద్వారా గానీ ఫిర్యాదు చేసుకోవచ్చని, తక్కువ సమయంలోనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. వినియోగదారుల రక్షణ చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. సభకు అధ్యక్షత వహించిన జిల్లా పౌర సరఫరాల అధికారిణి వీ పార్వతి మాట్లాడుతూ డిజిటల్ న్యాయ పాలన ద్వారా సమర్థ, సత్వర పరిష్కారాల ఇతివృత్తంతో ఈ సంవత్సరం జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించడంతో పాటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు వివరించారు.

రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్ కృష్ణ నాయక్ మాట్లాడుతూ ఏదైనా వస్తువు కొనుగోలు చేసే సమయంలో ఆ వస్తువు యొక్క పూర్తి వివరాలు తెలుసుకునే హక్కు వినియోగదారునికి ఉందని తెలిపారు. నాణ్యతలో లోపాలు ఉన్నట్లయితే ఆ వస్తువును తిరస్కరించే పూర్తి హక్కు వినియోగదారునికి ఉంటుందని స్పష్టం చేశారు. డీఎస్పీ వీ విద్య మాట్లాడుతూ నేటి రోజుల్లో ఆన్ లైన్ మార్కెటింగ్ ద్వారా వినియోగదారులు అనేక రకాల మోసాలకు గురవుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయని తెలిపారు. కొనుగోలు చేసిన వస్తువును తిరస్కరించిన అనంతరం చెల్లించిన మొత్తాన్ని తిరిగి ఖాతాలో జమ చేయడంలో సాంకేతిక సమస్యలని చెబుతూ వినియోగదారులను మభ్యపెడుతున్నారని అన్నారు. "24 గంటలు, 48 గంటలు" అంటూ ఇచ్చే హామీలను వినియోగదారులు నమ్మవద్దని సూచించారు. డీసీపీసీ సభ్యుడు జీ అనంతరావు మాట్లాడుతూ ఆన్ లైన్ మోసాలు, మెడికల్ నెగ్లిజెన్స్ వంటి అంశాలను వినియోగదారుల రక్షణ చట్ట పరిధిలోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. మోసపూరిత ప్రకటనలు, వాటిని ప్రమోట్ చేసే సెలబ్రిటీలపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గత వారం రోజులుగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన 24 మంది విద్యార్థులకు జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేశారు. అనంతరం సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వినియోగదారుల అవగాహన స్టాల్స్‌ను ముఖ్య అతిథులు సందర్శించారు.ఐఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, డిసిపిసి సభ్యులు, వ్యాపారవేత్తలు, విద్యార్థులు, వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

### జిల్లాకు రబీ సీజన్లో సరిపడు

# యూరియా రసాయన ఎరువులు అందుబాటులో ఉన్నాయి - కలెక్టర్



**అమలాపురం( మనసులో మాట) డిసెంబరు 24:** డాక్టర్ బి.ఆర్.అంబే ద్కర్ కోనసీమ జిల్లా లో రబీ సీజన్ కు సరిపడా యూరియా రసాయన ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోనసీమ జిల్లా లో రబీ సీజన్ 2025-26లో అన్ని రకాల పంటలకు అవసరమైన 29,241 మెట్రిక్ టన్నుల యూరియా ఎరువులు పంపిణీకి ప్రణా ళిక చేయడమైనద న్నారు.

01.10.2025 నాటికీ 2015 మెట్రిక్ టన్నుల యురియా ప్రారంభ నిల్వలు అందు బాటులో ఉన్నాయన్నారు .

01.10.2025 నుండి 31.12.2025 వరకు డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాకుమొత్తం 8,990 మెట్రిక్ టన్నులు అవసరం కాగా, ఇప్పటికే 13,617 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. మరియు ఈ నెలాఖరు నాటికి మరో 3000 మెట్రిక్ టన్నులు జనవరి 2026 కోటా నుండి సరఫరా చేయాలని కోరినట్లు తెలిపారు.01.10.2025 నుండి 22.12.2025 వరకు డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా లో మొత్తం 7,575 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయాలు జరిగాయన్నారు.23.12.2025 నాటికి 4,349 మెట్రిక్ టన్నుల యూరియా, 2,169 మెట్రిక్ టన్నుల డి.ఏ.పి., 1,170 మెట్రిక్ టన్నుల ఎం.ఓ.పి. (పొటాష్), 8,361 మెట్రిక్ టన్నుల కొంప్లెక్స్ లు మరియు 990 మెట్రిక్ టన్నుల ఎస్.ఎస్.పి. ఎరువులు కో-ఆపెరటివ్ సొసైటీలలో,ఆర్.ఎస్.కెలలో, మార్క్ ఫెడ్ గోదాము లలో, రిటైల్ / హెూల్ సేల్ మరియు కంపెనీ గోదాము లలో రైతాంగానికి అందు బాటులో ఉంచామన్నారు. జిల్లా లో ఇప్పటి వరకు ఎటువంటి ఎరువుల కొరత లేదని అవసరమైన యూరియా దిగుమతులు సంతృప్తి కరంగా ఉన్నాయన్నారు. రాబోయే పంట కాలంలో కూడా యురియా కు ఎటువంటి కొరత సమస్యలు ఉత్పన్నం కావని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. నూత నంగా రూపొందించబడిన సాంకేతికంగా అభివృధి పరచిన నానో యూరియా, నానో డి.ఎ.పి. ఎరువులను అందుబాటులోకి తీసుకురా వటం జరిగిందన్నారు. సాంప్రదాయ ఎరువులకు ప్రత్యామ్నాయంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని ప్రోత్సహిస్తునాయన్నారు.

రైతు లు ఎరువులను కొనుగోలు చేయునపుడు బస్తా పై ముద్రించిన ఎం.ఆర్.పి ధరలను చూసుకొని, దాని ప్రకార%శీ% పైక%శీ% చెల్లించి, తప్పనిసరిగా డీలరు నుండి రసీదు పొందవలెనన్నారు.

ఎవరైనా డీలర్లు నిబంధ నలు ఉలంఘించి, ఎరువుల కృతిమ కొరత సృష్టించినా, ఎరువులను మళ్ళింపు చేసినా, ఎం.ఆర్.పి ధరలు కంటే ఎరువులను అధిక ధరలకు విక్రయించినా, ఎరువుల నియంత్రణ చట్టం, 1985 ప్రకారం వారి పై కఠిన చర్యలు తీసుకొనబడతాయని కలెక్టర్ ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.

# జూనియర్ పీసీ సర్కార్ చే స్టిక్ మనోహర్ పుస్తకావిష్కరణ



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 24:** ప్రముఖ మెజీషియన్ డాక్టర్ ఎస్ మనోహరరావు (స్టిక్ మనోహర్) ఆంగ్లంలో రచించిన "ప్రోబ్లమ్స్ ఆఫ్ మెజీషియన్స్ ఇన్ ఆంధ్ర ప్రదేశ్ -ఏ సోషియలాజికల్ స్టడీ" అనే పుస్తకాన్ని జూనియర్ పీసీ సర్కార్ (డాక్టర్ ప్రదీప్ చంద్ర సర్కార్) కలకత్తాలో మంగళవారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూనియర్ పీసీ సర్కార్ మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాలలో మెజీషియన్ల జీవితాలను సంపూర్ణంగా అధ్యయనం చేయడంతో పాటు వారి సమస్యలపై పరిశోధన చేయడం అభినందనీయ మన్నారు. మేజిక్ రంగంలో ఉన్నత స్థానాన్ని సాధించడమే కాకుండా సహచర మెజీషియన్ల అభివృద్ధి, అభ్యున్నతికి డాక్టర్ మనోహర్ చేస్తున్న కృషి ఆదర్శప్రాయ మన్నారు. ఈ పరిశోధన కోసం మెజీషియన్లను స్వయంగా కలిసి వారి స్థితిగతులు, ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఆ సమస్యలకు పరిష్కార మార్గాలను సూచిస్తూ విశ్లేషణాత్మక పుస్తకాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. డాక్టర్ ఎస్ మనోహరరావు (స్టిక్ మనోహర్) మాట్లాడు తూ సమాజాన్ని చైతన్యవంతులను చేస్తున్న మెజీషియన్ల స్థితిగతులను గురించి సమాజానికి తెలిసే విధంగా పరిశోధన చేశానని, దీనిపై తీసుకువచ్చిన పుస్తకాన్ని జూనియర్ పీసీ సర్కార్ చేతుల మీదుగా ఆవిష్కరింప చేయడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. మెజీషియన్లకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని వెల్లడించారు. ఈ పుస్తకాన్ని తన మాతృమూర్తి కీర్తిశేషురాలు ఎస్ చంద్రావతి, భార్య కేసీహెచ్ సోమేశ్వరి దేవి, కుమార్తె పుష్యమి మనోహర్, మరదలు వీ హేమగిరీశ్వరి లకు అంకితం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నానికి చెందిన మెజీషియన్లు కే విజయ్ కుమార్, జీ అనురాగ్, కాకినాడకు చెందిన మెజీషియన్లు ఎస్ కే సతీష్, ఈ ఉదయ్ పాల్గొన్నారు.



### ఎఫ్రాత ప్రార్థనా మందిరంలో

# ఘనంగా క్రిస్మస్ వేడుకలు



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 24:** రాజానగరం మండలం కానవరం గ్రామంలో ఉన్న ఎఫ్రాత ప్రార్థనా మందిరంలో క్రిస్మస్ వేడుకలు మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని సందేశాన్ని ఆలకించి విందు స్వీకరించారు. ఎఫ్రాత ప్రార్థనా మందిరాన్ని విద్యుత్తు దీపాలతో కాంతులీనేలా అందంగా అలంకరించారు. పాస్టర్ జీ శ్యామ్ బాబు ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఫైర్ గాస్పెల్ మినిస్ట్రీస్ నుంచి రాజా నీ సన్నిధి పాట రచయిత జే జాన్ ప్రసంగీకులుగా విచ్చేశారు. ఆయన క్రిస్మస్ ప్రాముఖ్యతను, క్రీస్తు సందేశాన్ని అందించారు. క్రీస్తు చూపిన మార్గంలో అందరూ పయనిస్తూ తోటి వారి పట్ల ప్రేమతో మెలగాలని సూచించారు. పాస్టర్ శ్యామ్ బాబు మాట్లాడుతూ ప్రతీ ఏటా ఎఫ్రాత మందిరంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరపడం ఆనవాయితీగా వస్తోందన్నారు. క్రిస్మస్ సందేశం అనంతరం శ్యామ్ బాబును కార్యక్రమానికి విచ్చేసిన రాజకీయ పార్టీల నాయకుల చేతుల మీదుగా ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో జాన్ మోజెస్, డానియేల్, ప్రభుదాసు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నలుగురు వ్యక్తులపై బైండోవర్ కేసులు



**జగ్గంపేట (మనసులోమాట) డిసెంబరు 24** నలుగురు వ్యక్తుల మీద బౌండ్ ఓవర్ కేసు నమోదు చేసినట్టు జగ్గంపేట సీఐ వై.అర్.కే తెలియజేసారు.జగ్గంపేట మండలం మల్లిశాల గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు తరచూ గొడవలు పడుతూ శాంతి భద్రతలకు మరియు పబ్లిక్ ఆర్డర్ కు భంగం కలిగించు చున్నందున జగ్గంపేట పోలీసులు వారిపై బౌండ్ ఓవర్ కేసు నమోదు చేసి జగ్గంపేట మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వద్ద ప్రొడ్యూస్ చేయగా వారిని సత్ప్రవర్తన కొరకు బౌండ్ ఓవర్ చేయడం జరిగింది.

# నిజాయితీ చాటుకున్న సైకిల్ మెకానిక్ కడారి రాజు

**- తనకు దొరికిన 50 వేలను పోలీస్ స్టేషన్లో అందజేసిన యువకుడు**
**- అభినందించిన జగ్గంపేట ఎస్సై టి.రఘునాథరావు**



**జగ్గంపేట (మనసులోమాట) డిసెంబరు 24..** కాకినాడ జిల్లా జగ్గంపేటలోని అంబేద్కర్ నగర్ కు చెందిన సైకిల్ మెకానిక్ వర్కర్ కడారి రాజు మంగళవారం రాత్రి జగ్గంపేట జేవియర్ జంక్షన్ మీదుగా పెట్రోల్ బంక్ పక్కన సర్వీస్ రోడ్ లో ఉన్న తన యొక్క సైకిల్ మెకానిక్ షాప్ కు వెళ్తుండగా జేవియర్ జంక్షన్ వద్ద ఒక పర్సు దొరికింది. అందులో సుమారు 50 వేల రూపాయలు నగదు ఉండడంతో జగ్గంపేట పోలీస్ స్టేషన్లో అందజేశాడు.దీంతో జగ్గంపేట ఎస్సై రఘునాథరావు ఆ యొక్క నగదు ఎవరివి అనే దానిపై విచారణ చేపట్టి, జేవియర్ జంక్షన్ సిసి ఫుటేజ్, దొరికిన పర్స్ లోని ఐడెంటి ప్రూఫ్లను పరిశీలించి,ఆ యొక్క పర్సు గోకవరం రోడ్డుకు చెందిన బోర్వెల్స్ రాంబాబుగా గుర్తించారు. దీంతో పర్సను,పర్సులో ఉన్న నగదును ఎస్ఐ రఘునాథరావు చేతుల మీదుగా నగదు పోగొట్టుకున్న బాధితుడు రాంబాబుకు అందజేశారు.ఈ సందర్భంగా నిజాయితీ చాటుకుని దొరికిన నగదును స్థానిక పోలీస్ స్టేషన్కు తీసుకువచ్చి బాధితులకు అందజేసిన కడారి రాజును ఎస్ఐ రఘునాధరావు శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

# ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా బస్సులు ఏర్పాటు

**కాజులూరు (మనసులో మాట) డిసెంబర్ 24..** ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా బస్సులు నడుపుతామని రామచంద్రపురం ఆర్టీసీ డిపో మేనేజర్ భాస్కర్ రావు తెలిపారు. బుధవారం మండలంలోని కుయ్యేరు గ్రామంలో రామచంద్రపురం ఆర్టీసీ డిపో మేనేజర్ భాస్కరరావు మాట్లాడుతూ యానం ద్రాక్షారామం రహదారిలో కోలంక వద్ద రోడ్డు నిర్మాణం జరుగు నేపథ్యంలో రామచంద్రపురం నుండి కోలంక వరకు మాత్రమే ప్రస్తుతం బస్సులు నడిపేందుకు ఏర్పాటు చేశామని, ప్రయాణికులు సూచన మేరకు కోలంక నుండి యానం వెళ్లేందుకు అవకాశాలు బట్టి బస్సులు నడిపేందుకు కృషి చేస్తామని ఆయనతో తెలిపారు ప్రయాణికులు గమనించి ప్రయాణం ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన కోరారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## ఈర్ష్య అసూయ ఈశ్వరుడి నిఘంటువు లో
# ఉండనే ఉండదు
### వివేకా మృతం గురుదేవులు శ్రీ వివేకానంద ప్రవచించారు.

**అనపర్తి (మనసులో మాట) డిసెంబర్ 24:** వివేకామృతం విజయోత్సవ వేడుకలలో భాగంగా ఐదవ రోజు వేడుకలు ఘనంగా జరిగాయి, సర్వులలోను, సర్వము లోను ఓంకారమే నిండి ఉన్నదని, మనందరం సోదర సోదరీమణులమేనని, సనాతన సంప్రదాయం ఒక్కటే భారతదేశం యొక్క హృదయం అని శ్రీ వివేకానంద పేర్కొన్నారు. మన ఋషులు, గురువులు ప్రవచించిన భగవద్గీత, ఉపనిషత్తులు, వేదాలు, ఇతిహాసాలు ప్రపంచానికి మార్గదర్శకంగా ఉన్నాయని, అవి మానవాళిని సన్మార్గంలో నడిపిస్తాయని గురువైన వివేకానంద బోధించారు. ప్రణవో పాసన మనందరికీ నిత్యకృత్యం కావాలని, ప్రతి ఇంటిపై ఓంకారం పతాకాన్ని ఎగరవేసి, మన సంప్రదాయాన్ని కొనసాగించాలి అని శ్రీ వివేకానంద భక్తులకు సూచించారు.

## సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దిగి వచ్చేవరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో
# నిరసనలు
### జగ్గంపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మరోతి శివ గణేష్



**జగ్గంపేట (మనసులోమాట) డిసెంబరు 24..** జగ్గంపేట నియోజకవర్గంలో ప్రజా ఆరోగ్యానికి విఘాతం కలిగించే మరియు ప్రజా జీవనోపాధికి అవసరమైన 5 ప్రధాన సమస్యలైనగోకవరమండలం గుమ్మళ్ల దొడ్డి అస్సాగో పరిశ్రమ నిర్వహణ నిలుపుదల,పరిసర గ్రామాల ప్రజలపై బనాయించిన అక్రమ క్రిమినల్ కేసులు ఎత్తివేయుట.జగ్గంపేట మండలం జగ్గంపేట,మామిడాడ గ్రామాల్లో నిర్వహిస్తున్న దేవి ఫిషరీస్,రాజ్య లక్ష్మీ మెరైన్స్ కాలుష్య పరిశ్రమలు విడుదల చేస్తున్న వ్యర్థాల నుండి ఏలేరు జలాశయం,ఏలేరు ఆయకట్టు భూములు మరియు భూ గర్భ జలాలు సంరక్షణ కోసం సంబంధిత పరిశ్రమల నిర్వహణ నిలుపుదల చేయుటకు డిమాండ్.ఏలేరు ఆధునీకరణ మరియు ఏలేరు వరద బాధితులకు నష్ట పరిహారం కొరకు ప్రభుత్వం 3 వేల కోట్లు విడుదల చేయాలని డిమాండ్ పుష్కర ఎత్తిపోతల పథకం తాళ్లూరు లిఫ్ట్ ఆయకట్టు ప్రాంత రైతులకు అప్రకటిత క్రాప్ హాలిడే వల్ల 2023- 2024,2024-2025,2025-2026 సంవత్సరాలకు గాను నష్టపోయిన మొత్తం 3 సంవత్సరాలకు నష్టపరిహారం క్రింద ఎకరాకు 30 వేలు చొప్పున మూడు సంత్సరాలకు 90 వేలు అనగా మొత్తం సుమారు 300 కోట్లు మరియు ఆధునీకరణ మరియు చివర భూములను స్థిరీకరించడం కోసం 100 కోట్లు మంజూరుతో కలిపి మొత్తం 400 కోట్లు కేటాయింపు కోసం డిమాండ్ మెట్ట ప్రాంతమైన గండేపల్లి మండలంలో మెజారిటీ రైతులు బోరు బావులపై ఆధారపడిన సందర్భంగా ఎల్లమిల్లి లో జెట్టి గ్రానైట్స్ పేరుతో భూగర్భంలో హై ఫ్రీక్వెన్సీ బ్లాస్టింగ్ చేస్తూ మైనింగ్ చేయడం వల్ల వ్యవసాయ పంపు సెట్లు ఆ ప్రాంతమంతా కూలిపోతున్నందున మైనింగ్ నిర్వహణ నిలుపుదల చేయాలని,హ్యాద్రోగ బారిన పడిన వారికి నష్టపరిహారం డిమాండ్ జగ్గంపేట నియోజకవర్గంలో ఈ ఐదు సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దిగి వచ్చేవరకు నిరసనలు,పరిమిత నిరాహార దీక్షలు,తదనంతరం ఆమరణ నిరవధిక నిరాహార దీక్షలు జగ్గంపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మరోతి శివ గణేష్ ఆధ్వర్యంలో అమలు చెయ్యాలని జగ్గంపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది.కావున భావ సారూప్యత కలిగిన రాజకీయ పార్టీలు,స్వచందసంస్థలు, ఉత్సాహము కలిగిన పౌరులందరూ పాల్గొనాలని జగ్గంపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఆహ్వానిస్తుంది.కార్యక్రమ వివరాలు ప్రతి కార్యక్రమానికి ముందు రోజు మీడియా ద్వారా తెలియ జేయబడునని ఈ సందర్భంగా అయన తెలియజేసారు.

## భరత్ అవాకులు చవాకులు మాట్లాడితే
# సహించేది లేదు!

- వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి
- జగన్ ప్రభుత్వ హయాంలో నగరంలో ఒక్క అభివృద్ధి పనైనా జరిగిందా
- కూటమి అధికారంలోకి వచ్చిన 18 నెలలలో నగరంలో ఎమ్మెల్యే వాసు చేసిన అభివృద్ధి పనులు చూస్తున్నారా
- ఆదిరెడ్డి ఈవీఎం ఎమ్మెల్యే అయితే..మీరు ఈవీఎం ఎంపీయేగా
- వైసీపీ మహిళా మణుల్లారా అత్యాచారాలు, హత్యకాండలు గుర్తుకు రాలేదా?
- మీడియా సమావేశంలో మాజీ ఎంపీ భరత్ పై టీడీపీ మహిళా ప్రతినిధులు ధ్వజం



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 24:** మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని, మీ పార్టీ అధినేత జగన్ మెప్పుకోసం తెలుగుదేశం పార్టీ నాయకులపై, ప్రజా ప్రతినిధులపై అవాకులు, చవాకులు మాట్లాడితే సహించేది లేదని ఆ పార్టీ నగర మహిళా ప్రతినిధులు భరత్ వ్యవహార శైలి పై తీవ్ర స్థాయిలో ద్వజమెత్తారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో టీడీపీ రాజమండ్రి పార్లమెంట్ మహిళా కమిటీ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి మాట్లాడుతూ ఆదిరెడ్డి వాసు కుటుంబానికి రాజకీయ వారసత్వ చరిత్ర ఉందని, నిత్యం ఆ కుటుంబం ప్రజా జీవితంలో మమేకమై ఉంటుందన్నారు. ఆ కుటుంబాన్ని, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసునూ విమర్శించేంత స్థాయి, రాజకీయ చరిత్ర భరత్ కు లేదన్నారు. భవానీ చారిటబుల్ ట్రస్టు ద్వారా వేల మంది పేద ప్రజలకు, విద్యార్థినీ విద్యార్థులకు చేయూత అందిస్తున్న ఆ కుటుంబాన్ని రోడ్డున పడేసి బురద జల్లడం హాస్యాస్పదమన్నారు. గత ఐదేళ్లు ఎంపీగా అధికారంలో ఉన్నప్పుడు నగరంలో ఒక్క అభివృద్ధి పనైనా చేసిన దాఖలాలు లేవని, చేసిన పనులు కూడా నాణ్యత లేకుండా కమీషన్ కోసం కక్కుర్తిపడి చేసినవేనన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు నగరంలో ఎన్నో అభివృద్ధి పనులను చేయడం జరిగిందన్నారు. ఎంపీ హయాంలో రెచ్చిపోయిన బ్లేడ్ బ్యాచ్లు, రౌడీయిజం, గంజాయి బ్యాచ్ లు ఈ 18 నెలల కాలంలో గణనీయంగా తగ్గిపోయాయని, ఎక్కడా కనిపించడం లేదన్నారు. అసాంఘిక శక్తులపై కేసులు, పీడీ చట్టం ప్రయోగించడం చేస్తున్నామన్నారు. మహిళల రక్షణ కోసం 'మీ భద్రత మా బాధ్యత' అనే కార్యక్రమం చేపట్టమని.. ప్రజలను, పోలీసులను భాగస్వామ్యం చేస్తూ నేరాలను తగ్గించామనే విషయాన్ని భరత్ తెలుసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే వాసు అన్ని దేవాలయ కమిటీలను నియమించారన్నారు. మరి మీ హయాంలో లేదా జగన్ పాలనలో ఇలా పాలకవర్గాలను నియమించారా అని ప్రశ్నించారు. వైసీపీ మహిళా మణుల్లారా.. జగన్ ప్రభుత్వంలో మహిళలపై, బాలికలపై జరిగిన అత్యాచారాలు, హత్యాకాండలు గుర్తుకు రావడం లేదా మీకు అని ప్రశ్నించారు. ఇటీవల నగరంలో బాలిక అత్యాచారం లో నిందితులకు వైసీపీ మహిళలు కొమ్ము కాసిన సంగతి మర్చిపోయారా?.. అని ప్రశ్నించారు. నగర టీడీపీ మహిళ కమిటీ అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ మాట్లాడుతూ నగరంలో మంత్రి లోకేష్ పర్యటనలో ఆదిరెడ్డికి కుటుంబానికి ప్రజలు, మహిళల ఆదరణ చూసి ఓర్వలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. మంత్రి లోకేష్ స్వయంగా ఆదిరెడ్డి కుటుంబానికి అండగా నిలుస్తామని స్పష్టం చేయడంతో వచ్చే ఎన్నికల్లో కూడా తనకు అవకాశం లభించదనే ఆందోళనలో భరత్ కలత చెందుతున్నాడని ఎద్దేవా చేశారు. లోకేష్ నగర పర్యటన విజయవంతం కావడాన్ని చూసైనా మాజీ ఎంపీ భరత్ కు కనువిప్పు కలగాలన్నారు. మంత్రిగా, పార్టీ నాయకునిగా నిత్యం బిజీ బిజీగా ఉండే లోకేష్ నగర పర్యటన వాయిదా పడటం వెనుక ఆదిరెడ్డితో చెడిందని అభూత కల్పనలు ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. రాజకీయాలంటే తెలియని విద్యార్థుల హృదయాల్లో, మైండ్లలో కుల, మత, విష సంస్కృతులను, నేర ప్రవృత్తి రాజకీయాలను ప్రోత్సహిస్తున్న ఆ పార్టీ అధినేత జగన్ ను చూసి స్థానిక నాయకులు రెచ్చిపోవడం చేస్తే సహించేది లేదన్నారు. ప్రజలేమి అమాయకులు కాదని, అన్నీ గమనిస్తున్నారనే విషయాన్ని తెలుసుకోవాలని, ఇకనైనా మాజీ ఎంపీ భరత్ లేనిపోని విమర్శలు, ఆరోపణలు ఆపకుంటే చరిత్ర హీనుడిగా మిగలటం ఖాయమని చండీ ప్రియ అన్నారు. తురకాల నిర్మల మాట్లాడుతూ రాజకీయాల్లో ఉన్న భరత్ హుందాగా వ్యవహరించాలని, వ్యక్తిగత విషయాలకు వెళితే తాము కూడా వ్యక్తిగత విషయాలు మాట్లాడాల్సి వస్తుందని హెచ్చరించారు. మీడియా సమావేశంలో ద్వారా పార్వతి సుందరి, సయ్యద్ అప్సరి, తురకల నిర్మల, బోనుఈశ్వరి, గొర్రెల రమణి, కప్పల వెలుగు కుమారి, మీసాల నాగమణి, లీలావతి, దొంగ నాగమణి, బూరా కల్పన తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తాటిపర్తి శ్రీవిద్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు



**గొల్లప్రోలు (మనసులో మాట) డిసెంబరు 24:** గొల్లప్రోలు మండల పరిధిలోని తాడిపర్తి శ్రీవిద్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణం రంగురంగుల అలంకరణలతో, క్రిస్మస్ తారలు, క్రిస్మస్ ట్రీ, లైటింగ్లతో సందడి వాతావరణాన్ని సృష్టించింది. చిన్నారులు శాంతాక్లాజ్ వేషధారణలో పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని సందడి చేశారు. క్రిస్మస్ కరోల్స్, నృత్యాలు, స్కిట్స్, ఆటపాటలు అందరినీ అలరిస్తూ పాఠశాలలో పండగ వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చాయి. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కూడా పాల్గొని చిన్నారులను ప్రోత్సహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ దాసం రాంబాబు మాట్లాడుతూ...క్రిస్మస్ ప్రేమ, సేవ, క్షమ, మనవత్వానికి ప్రతీక అన్నీ, పిల్లల్లో మంచి విలువలు పెంపొందించడానికి ఇలాంటి పండుగలు ఎంతో ఉపయోగకరం అన్ని పేర్కొన్నారు. విద్య అంటే కేవలం చదువులే కాదు, విలువలు నేర్పడం కూడా అన్ని తెలిపారు. శ్రీవిద్య పాఠశాల ఎల్లప్పుడూ పిల్లల సమగ్ర అభివృద్ధి కోసం శ్రద్ధ తీసుకుంటుంది" అని పేర్కొన్నారు. అలాగే, విద్యార్థుల్లో సహకారం, స్నేహభావం, సేవాభావం పెంపొందించడమే తమ లక్ష్యమని ఆయన అన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. క్రిస్మస్ సెలబ్రేషన్స్తో పాఠశాల మొత్తం ఆనందోత్సాహాలతో కిక్కిరిసిపోయింది.

## బైక్ ర్యాలీగా వచ్చి నవీన్ కు శుభాకాంక్షలు తెలియజేసిన గోకవరం టిడిపి నేతలు



**జగ్గంపేట (మనసులోమాట) డిసెంబరు 24..** పార్టీ కష్ట కాలం లో ఉన్నప్పుడు జిల్లా బాధ్యతలు చేపట్టి పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చిన నాయకుడు జ్యోతుల నవీన్ అని గోకవరం మండలం తెలుగు యువత అధ్యక్షుడు పల్లేల బాబి అన్నారు. బుధవారం గోకవరం మండలం తెలుగు యువత అధ్యక్షుడు పల్లెల బాబి ఆధ్వర్యంలో టిడిపి సీనియర్ నేతలు దాసరి తమన్న దొర, మంగ రౌతు రామకృష్ణ, బత్తుల సత్తిబాబు, గునిపే భరత్, గోకవరం టౌన్ టిడిపి అధ్యక్షుడు పైలా శ్రీను, చింతల రామకృష్ణ, మోర్తా చిట్టి బాబు తదితరులు సహకారంతో గోకవరం నుండి జగ్గంపేట వరకు బైక్ ర్యాలీగా వచ్చి జిల్లా టిడిపి అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన జ్యోతుల నవీన్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించి ఫోటో ఫ్రేమ్ జ్ఞాపికగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ అధికారంలో లేనప్పుడు పార్టీ జిల్లా పగ్గాలు చేపట్టి పార్టీని అధికారులకు తీసుకురావడానికి అహర్నిశలు పనిచేశారని ముఖ్యంగా నారా లోకేష్ పాదయాత్ర, చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటించినప్పుడు ఆయన పర్యటన అడ్డుకోవడానికి ప్రయత్నిస్తే ఆయన ముందుండి పోరాడి నడిపించిన తీరు ప్రతి ఒక్కరిలోనూ నాటుకుపోయిందని ఆయన పార్టీ కోసం కూటమి ప్రభుత్వంఅధికారం రావడం కోసం కాకినాడ ఎంపీ సీట్ కూడా వదులుకున్నారని వదులుకున్నారని అటువంటి నాయకుడికి మళ్ళీ జిల్లా పగ్గాల అప్పజెప్పడంతో మా అందరికీ ఎంతో ఆనందంగా ఉందని ఈరోజు ఆయన కలవడానికి విచ్చేసామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి పాలూరి బోసు బాబు, పోసిన ప్రసాద్, రాయవరపు శ్రీనివాస్, ఆచంట రాజు, జి సన్యాసిరావు, పాలాడి శ్రీను, సోడిశెట్టి గోపి, వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

## ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు-ఏవో సుధా మాధురి



**కిర్లంపూడి (మనసులో మాట) డిసెంబరు 24..** డీలర్లు ఎరువులు అధిక అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారిణి నాగం సుధామాధురి హెచ్చరించారు. కిర్లంపూడి మండలం రామచంద్ర పురం గ్రామంలో బుధవారం రైతులకు యూరియా కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సుధామాధురి మాట్లాడుతూ రబీ సాగుకు,ఇతర పంటలకు యూరియా కార్డుల ద్వారానే రైతులకు యూరియా విక్రయిస్తున్నట్లు తెలిపారు.రైతు పంట విస్తీర్ణాన్ని బట్టి ఎరువులు సొసైటీ, డీలర్లు, ఆర్ఎస్కేల ద్వారా మూడు విడతలుగా రైతులకు అందజేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని సుధామాధురి తెలిపారు. ప్రైవేటు డీలర్లు ఎవరైనా ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఎంపిటిసి బందారు వి.డి. వరప్రసాద్, సీనియర్ నాయకుడు కంచుమర్తి రాఘవ,గ్రామ వ్యవసాయ సహాయకులు,అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



### ముమ్మిడివరం పోలీస్ స్టేషన్ ని
# తనిఖీ చేసిన డిఎస్పీ

- చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు

**ముమ్మిడివరం (మనసులో మాట) డిసెంబరు 24..** సంక్రాంతి పండగను పురస్కరించుకుని కోడిపందాలు, గుండాటలు, పేకాటలు వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అమలాపురం డిఎస్పీ టి.ఎస్. ఆర్. కె. ప్రసాద్ హెచ్చరించారు. వార్షిక తనిఖీ లలో భాగంగా ముమ్మిడివరం పోలీస్ స్టేషన్ ను సందర్శించిన డిఎస్పీ స్థానిక విలేకరలతో మాట్లాడారు. ఇప్పటినుండే గ్రామాలలో ప్రత్యేక నిఘాపెట్టి, పందాలకు సంబందించి ఎటువంటి ఏర్పాట్లు చేసినా సంబంధిత వారిపై కేసులు నమోదు చెయ్యమని ఎస్. ఐ. లందరికీ ఆదేశించినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కత్తులు తయారీ, కోడులకు కత్తులు కట్టేవారిని గుర్తించి బైండోవర్ కేసులు నమోదు చెయ్యమని అన్ని పోలీస్ స్టేషన్ లకు ఆదేశాలు జారీచెయ్యడం జరిగిందన్నారు. అలాగే సంక్రాంతి సెలవులకు ఊర్లకు వెళ్లేవారు తమతమ ఇళ్ల విషయంలో దొంగ తనాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రికార్డు లు పరిశీలించిన డిఎస్పీ ఎస్సై పనితీరు పై సంతృప్తి వ్యక్తం చేశారు. ముమ్మిడివరం పోలీస్ స్టేషన్ లో కేసులు పరిష్కారం లో పురోగతి సంతృప్తి గానే ఉందన్నారు..రెండు మర్డర్ కేసులు విచారణలో ఉన్నాయన్నారు. ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు, దొంగతనాల నివారణకు మరింత దృష్టి సారించవలసిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో సి. ఐ. మోహన్ రావు, ఎస్. ఐ. జ్వాలా సాగర్ లు పాల్గొన్నారు.

### దమ్ము ట్రాక్టర్ల యజమానులకు
# పోలీసువారి హెచ్చరిక




**గండేపల్లి (మనసులో మాట )డిసెంబర్ 24...** ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి, ప్రజా ప్రయోజనార్ధము తారు మరియు సిమెంట్ రోడ్డు లను వేయుచుండగా కొంత మంది ట్రాక్టర్ డ్రైవర్లు దమ్ము చక్రాలు మార్చు కోవడానికి బద్దకించి దమ్ము చక్రాలతో ఎంతో వ్యయం తో వేసిన చక్కటి రోడ్డుల మీద నడిపి రోడ్డులను ధ్వంసం చేయుచున్నారని జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. గండేపల్లి మండలం పేట గ్రామ శివారుణ రోడ్డు ధ్వంసమైన దృశ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమస్య ముఖ్యముగా జగ్గంపేట, గండేపల్లి మండలంలలో ఎక్కువగా ఉంది. రైతులు, ప్రజలు గమనించి మన రోడ్ల ను కాపాడుకోవలసిన బాధ్యత మనపై ఉంది కాబట్టి ఎవరైనా ట్రాక్టర్ డ్రైవర్లు మరియు ట్రాక్టర్ యజమానులు పళ్ళ చక్రాలతో కూడిన ట్రాక్టర్ ను ( పళ్ళ చక్రాలతో కూడిన ఏ వాహనము అయినా) నెంబర్ తో సహా వీడియో తీసి పంపాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రివెన్షన్ ఆఫ్ డ్యామేజ్ టు పబ్లిక్ ప్రాపర్టీ యాక్ట్ (టిడిపి పి )ప్రకారం సదరు వాహనాలను స్వాధీనం చేసుకుని,కఠినమైన సెక్షన్ల తో క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరిస్తున్నాం అని తెలిపారు.అలాగే ఎం.వి యాక్ట్ ప్రకారం కూడా భారీగా జరిమానాలు విధించడం జరుగుతుంది తెలిపారు. పోలీస్ వారు కూడా స్పెషల్ డ్రైవ్ నిర్వహించుచున్నారు.

### దమ్ము ట్రాక్టర్లతో
# రహదారులు ఛిద్రం

- దమ్ము చక్రాలతో తారురోడ్లపై ప్రయాణిస్తే కఠిన చర్యలు
- జగ్గంపేట సీఐ వై.అర్.కే



**జగ్గంపేట (మనసులోమాట) డిసెంబరు 24..** జగ్గంపేట సర్కిల్ పరిధిలోని జగ్గంపేట, గండేపల్లి,కిర్లంపూడి మండలాలో దమ్ము ట్రాక్టర్ ల డ్రైవర్స్ కు, యజమానులకు జగ్గంపేట సర్కిల్ పోలీసుల హెచ్చరిక జారీ చేయడం జరిగింది. ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి, ప్రజా ప్రయోజనార్ధము తారు మరియు సిమెంట్ రోడ్డు లను వేయుచుండగా కొంత మంది ట్రాక్టర్ డ్రైవర్లు దమ్ము చక్రాలు మార్చు కోవడానికి బద్దకించి దమ్ము చక్రాలతో ఎంతో వ్యయంతో వేసిన చక్కటి రోడ్ల మీద నడిపి రోడ్డులను ధ్వంసం చేయుచున్నారు. ఈ సమస్య ముఖ్యముగా జగ్గంపేట, గండేపల్లి మండలంలలో ఎక్కువగా ఉంది.రైతులు, ప్రజలు గమనించి మన రోడ్ల ను కాపాడుకోవలసిన బాధ్యత మనపై ఉంది కాబట్టి ఎవరైనా ట్రాక్టర్ డ్రైవర్లు మరియు ట్రాక్టర్ యజమానులు పళ్ళ చక్రాలతో కూడిన ట్రాక్టర్ ను ( పళ్ళ చక్రాలతో కూడిన ఏ వాహనము అయినా) నెంబర్ తో సహా వీడియో తీసి పంపాలని ప్రజలను కోరుతున్నాము.ప్రివెన్షన్ ఆఫ్ డ్యామేజ్ టు పబ్లిక్ ప్రాపర్టీ యాక్ట్ (పీడీపీపీ) ప్రకారం సదరు వాహనాలను స్వాధీనం చేసుకుని,కఠినమైన సెక్షన్లతో క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు అలాగే ఎంవీ యాక్ట్ ప్రకారం కూడా భారీగా జరిమానాలు విధించడం జరుగుతుంది అని తెలియజేశారు.పోలీస్ వారు కూడా ఈ విషయం పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించుచున్నారు.మన రోడ్లను మనమే కాపాడుకునే బాధ్యతను మనమందరం తీసుకుందాం అని ఈ సందర్భంగా అయన తెలియజేసారు.



# కొండముచ్చులు బెడద

**ముమ్మిడివరం (మనసులో మాట) డిసెంబరు 24:** ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో రాజుపాలెం గ్రామంలోని బుధవారం పంట పొలాల్లోకి కొండముచ్చులు సొరబడి వరి, కొబ్బరి, కూర పాదులు, బొప్పాయి, తదితర పంటలను నాశనం చేశాయని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలోకి చొరబడి చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు, వికలాంగులపై దాడికి పాల్పడుతున్నాయని వాపోతున్నారు. గత పది రోజులుగా కొండముచ్చుల కారణం గా పలువురు ఇబ్బంది పడ్డారు.చిన్నారులను పాఠశాలలు పంపించేందుకు గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి కొండముచ్చులను నివారించేందుకు చర్యలు చేపట్టాలని రాజుపాలెం గ్రామస్తులు కోరుతున్నారు.

# వాహనాలు దారి మళ్లింపు




**కాజులూరు (మనసులో మాట) డిసెంబర్ 24..** రహదారి నిర్మాణంలో భాగంగా వాహనాలను దారి మళ్లించినట్లు రోడ్లు భవనాల శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ లక్ష్మీ ప్రసన్న తెలిపారు. బుధవారం మండలంలోని కోలంక గ్రామంలో రోడ్ల శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ కోలంక గ్రామంలో సిమెంట్ రోడ్డు నిర్మాణంలో భాగంగా బుధవారం నుండి రోడ్డు నిర్మాణం ప్రారంభించి నున్నట్లు ఆమె తెలిపారు . రామచంద్రపురం నుండి వచ్చే వాహనాలు ద్రాక్షరామ , కోటిపల్లి మీదుగా ఏటిగట్టుపై నుండి యానం వెళ్లే విధంగా సూచనలు చేయడం జరిగిందని ఆమె తెలిపారు . భారీ వాహనాలు , బస్సులు , లారీలు డ్రైవర్లు గమనించి వెళ్లవలసిందిగా సూచించమన్నారు.

# బొబ్బిల్లంక హైస్కూల్ విద్యార్థినికి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి




NATIONAL CONSUMER DAY CELEBRATIONS-2025
Government of Andhra Pradesh
Department of Consumer Affairs, Food & Civil Supplies
CERTIFICATE OF MERIT
SAURABH GAUR, I.A.S.
Commissioner of Civil Supplies &
Ex. Officio Secretary to Govt.
Consumer Affairs, Food & Civil Supplies Department
Date : 24.12.2025

**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 24:** జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా "డిజిటల్ విధానం ద్వారా వినియోగదారులకు సత్వర న్యాయం" అనే విషయంపై ఆంగ్లంలో నిర్వహించిన వ్యాస రచన పోటీలో సీతానగరం మండలం బొబ్బిలంక హైస్కూల్ విద్యార్థిని సోడదాసి తేజస్విని రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించి రూ.7,500లు నగదు బహుమతి, సర్టిఫికెట్, జ్ఞాపికను నేడు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన రాష్ట్ర స్థాయి వినియోగదారుల దినోత్సవాలలో రాష్ట్ర సివిల్ సప్లయర్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఢిల్లీ రావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అందజేశారు. ఇదే అంశం పైన గోదావరి జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలో తేజస్విని మొదటి బహుమతి సాధించి రూ.5000లు నగదు బహుమతిని సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. తేజస్విని, గైడ్ టీచరుగా వ్యవహరించిన రేష్మని జిల్లా విద్యాశాఖ అధికారి కే వాసుదేవరావు, మండల విద్యాశాఖ అధికారులు స్వామి నాయక్, ఉషారాణి పాఠశాల హెచ్ఎం కోలా సత్యనారాయణ తదితరులు అభినందించారు.

# పవన్ కు మద్దతుగా భారీ బైక్ ర్యాలీ

## ప్రధాని, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం

## పోలవరం ప్రాజెక్టుకు అమరజీవి ఆర్యవైశ్య ముద్దుబిడ్డ పొట్టి శ్రీరాములు పేరు ప్రతిపాదనపై హర్షం



**పిఠాపురం (మనసులో మాట) డిసెంబరు 24:** పట్టణంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు మద్దతుగా నియోజవర్గ ఆర్యవైశ్యులు భారీ బైక్ ర్యాలీ బుధవారం చేపట్టారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పోలవరం ప్రాజెక్టుకు పొట్టి శ్రీరాములు పోలవరం ప్రాజెక్టుగా నామకరణం చేస్తే బాగుంటుందని ప్రతిపాదించడంతో ఆర్యవైశ్యులు హర్షం వ్యక్తం చేసి మద్దతుగా పిఠాపురంలో బైక్ ర్యాలీనిర్వహించడం జరిగింది ర్యాలీ గా బాధగాయి నుండి ఉప్పాడ బస్టాండ్ వరకు చేరుకుని పాలాభిషేకం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోన శ్రీనివాసరావు హాజరయ్యారు. పిఠాపురం పాదగయ క్షేత్రం వద్ద కోన శ్రీనివాసరావు జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కేతవరపు కృష్ణ ఆధ్వర్యంలో పాదగయ క్షేత్రం నుంచి ప్రభుత్వాసుపత్రి మార్కెట్ మీదుగా పశువుల సంత ఉప్పాడ బస్టాండ్ వరకు 300 బైక్లతో ర్యాలీ చేపట్టారు. అనంతరం ఉప్పాడ బస్టాండ్ సెంటర్ వద్ద ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు ఆర్యవైశ్యులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోన శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక ఆర్యవైశ్యులకు అధిక ప్రాధాన్యతిస్తుందని వాసవి అమ్మవారి ఆత్మార్పణ దినాన్ని ప్రభుత్వ అధికారదినంగా ప్రకటించడం హర్షణీయమన్నారు. వైశ్య, కోమటి పేర్లు తొలగించి ఆర్యవైశ్యుగా ప్రకటించడం పొట్టి శ్రీరాములు అమరావతిలో స్మృతి వనం ఏర్పాటు చేయడం 58 అడుగుల విగ్రహం ఏర్పాటు చేస్తాననడం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పోలవరం ప్రాజెక్టుకు పొట్టి శ్రీరాములు పోలవరం ప్రాజెక్టుగా పెట్టేందుకు సూచన చేయడం ఆనందదాయకంగా భావిస్తున్నట్లు తెలిపారు. పిఠాపురం నియోజకవర్గ ఆర్యవైశ్యులు ఉపముఖ్యమంత్రి పవన్ కు అండగా ఉంటామని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కేతవరపు కృష్ణ పేర్కొన్నారు. కార్యక్రమంలో కుసుమంచి పాపారావు, ఇమ్మిడి శెట్టి ప్రసాద్, బోడా శ్రీను ,కేదరశెట్టి గుప్తా, రాంబాబు, దంగేటి గుప్తా విశ్వేశ్వరరావు, తండా బాబు శ్రీకాకుళపు రాజేష్, గ్రంధి లచ్చన్న, దంగేటి రామకృష్ణ , నానాజీ, దర్శిపూడి సురేష్, దర్శిపూడి వీరరాఘవులు గొల్లప్రోలు, కొత్తపల్లి పిఠాపురం మండలాల ఆర్యవైశ్య నాయకులు ప్రముఖులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో సంక్షేమానికి పెద్దపేట

## - ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే దాట్ల



**తాళ్ళరేవు (మనసులో మాట), డిసెంబరు:** ప్రజల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ముమ్మిడివరం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు అన్నారు. బుధవారం మండల పరిధిలోని జార్జిపేట, నీలపల్లి, ఉప్పంగల గ్రామాల్లో 570 మంది లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ కనెక్షన్లను ఎమ్మెల్యే సుబ్బరాజు అందజేశారు. ఈ సందర్భంగా జార్జిపేట పంచాయితీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వడంతో పాటు మహిళలందరికీ రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. ఇప్పటివరకు సుమారు 10 కోట్ల మంది ఉచిత బస్సుల్లో ప్రయాణించారని తెలిపారు. అదేవిధంగా తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, అర్హులందరికీ పింఛన్లు అందించి సంక్షేమ ప్రభుత్వంగా కొనసాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పోలేకుర్రు శ్రీ లక్ష్మి హెచ్.పీ గ్యాస్ కంపెనీ ప్రతినిధి ఏడిద సూర్యప్రకాశరావు, కాకినాడ శివమణి గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి కుడిపూడి శ్రీనివాస్ గ్రామ సర్పంచ్లు గుత్తుల సత్యవేణి, చిట్టురి నాగమణి, టిడిపి మండల అధ్యక్షుడు ధూళిపూడి వెంకటరమణ, నాయకులు కూనపురెడ్డి బుజ్జి, కడలి శ్రీనివాస్, వేగేశ్న భాస్కరాజు, కర్నీడి నాని, దడాల సువర్ణ లత, పార్వతీశం, వస్క రెడ్డి, కొల్లాటి వీరబాబు, గంటా గోపి తదితరులు పాల్గొన్నారు.

# వేణుగోపాల స్వామికి గులాబీ అర్చన



**పిఠాపురం, (మనసులో మాట) డిసెంబరు 24:** పిఠాపురంలోని ప్రముఖ వైష్ణవ క్షేత్రం శ్రీ రుక్మిణి శ్రీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ పవిత్ర మాసంలో స్వామివారికి నిర్వహించే ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ఉత్సవాల్లో భాగంగా, ఆలయ ప్రధాన అర్చకులు విజయ జనార్దనాచార్యులు ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ రకాల సుగంధభరితమైన పుష్పాలు, ముఖ్యంగా గులాబీ పూలతో స్వామివారికి విశేష అర్చన (పుష్పార్చన) బుధవారం నిర్వహించారు. ఈ కనుల పండువైన అలంకరణ, పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి దివ్యానుగ్రహం పొందారు.

ప్రతిరోజూ ఉదయం ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితికి చెందిన మహిళా భక్తులు ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో 'తిరుప్పావై' పారాయణ చేస్తున్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆలయంలో భక్తి వాతావరణాన్ని మరింత పెంచుతున్నాయి. భక్తులు స్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలను స్వీకరిస్తున్నారు. ధనుర్మాసం చివరి వరకు ఈ ఉత్సవాలు, ప్రత్యేక పూజలు కొనసాగుతాయని ఆలయ కార్య నిర్వహణ అధికారి నున్న శ్రీరాములు తెలిపారు.

# జ్యోతుల నవీన్ కలిసి అభినందనలు తెలియజేసిన కాపు సంక్షేమ సంఘం



**జగ్గంపేట (మనసులోమాట) డిసెంబరు 24..** తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడిగా రెండవసారి ఎన్నికైన జ్యోతుల నవీన్ ను కాపు సంక్షేమ సంఘం జగ్గంపేట అధ్యక్షుడు మీసాల చిన బాబు ఆధ్వర్యంలో కాపు సంఘం నేతలు శుభాకాంక్షలు తెలియజేసారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద కాపులకు ఆర్థిక సహాయం సంఘం తరఫున చేస్తున్నామని నెలవారీ సమావేశాలు నిర్వహించి కల్యాణ మండపం గురించి కొన్ని నిర్ణయాలు చేయడం జరిగిందని , కాపు కళ్యాణ మండపం కావలసిన మౌలిక వసతులు గురించి ,కరెంటు బిల్లు గురించి నవీన్ దృష్టికి అధ్యక్షుడు తీసుకురావడం జరిగిందని ఈ సందర్భంగా నవీన్ మంచి సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగిందని వాటిని తప్పక పాటిస్తామని తెలియజేశారు.తక్షణమే జనరేటర్ ,డైనింగ్, కిచెన్ షెడ్, గుమాస్తా గురించి ప్రస్తావన వచ్చినది. దీనిపై త్వరలో కమిటీ ముందుకు వెళుతుందని హామీ ఇచ్చిరి.ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జీను మణి బాబు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు దేవరపల్లి మూర్తి, జగ్గంపేట మండలం తెలుగు యువత అధ్యక్షుడు రాయి సాయి , సంఘం గౌరవ అధ్యక్షుడు దౌవులూరి ఈశ్వరరావు, అధ్యక్షుడు మీసాల చిన్నబాబు , ప్రధాన కార్యదర్శి తోలేటి సూర్యనారాయణ , ఉపాధ్యక్షుడు తులా నరసింహారావు , మారిశెట్టి రాధా, తోట బుచ్చిరాజు , కోశాధికారి మసకపల్లి భైరవ స్వామి , కార్యదర్శులు కురుమెళ్ళ నాగేశ్వరరావు , అంగజాల బ్రహ్మాజీ రావు , మొగలి రామలింగేశ్వరరావు , గోన చక్ర రావు, మంచాల మల్లేశ్వరరావు , గద్దమూరు బాబ్జి, కోడూరు రమేష్ ,తోట అనిల్ , బండారు నాని , సతీష్ మొదలగు వారు పాల్గొన్నారు.

# వల్లూరు ప్రభుత్వ స్కూల్ లో క్రిస్మస్ వేడుకలు....

**కపిలేశ్వరపురం (మనసులో మాట) డిసెంబర్ 24..** కపిలేశ్వరపురం మండలం వల్లూరు మోడల్ స్కూల్ ఆవరణలో బుధవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు క్రిస్మస్ పాటలు తో పాటు



నాటికను ప్రదర్శించారు. విద్యార్థులు ప్రదర్శించిన స్టార్ ఆకారం ఆకట్టుకుంది. కేకు కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చిట్టూరి వెంకట శ్రీధర్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# కాకినాడ జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడిగా 'పిల్లి చిన్న' నియామకం



**పిఠాపురం, (మనసులో మాట) డిసెంబరు 24:** పిఠాపురం మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, సీనియర్ రాజకీయ నాయకుడు పిల్లి చిన్న కు తెలుగుదేశం పార్టీలో కీలక బాధ్యతలు దక్కాయి. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర నాయకులు ఎస్వీఎస్ఎన్ వర్మ ఆశీస్సులతో, పార్టీ అధిష్టానం పిల్లి చిన్నను కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులుగా నియమించింది. పిఠాపురం నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషిని గుర్తించి ఈ పదవిని అప్పగించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా పిల్లి చిన్న మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన ప్రియతమ నాయకులు చంద్రబాబు నాయుడు కి, లోకేష్ కి తన ఎదుగుదలకు నిరంతరం తోడ్పాటునందిస్తున్న పిఠాపురం తెలుగుదేశం ఇంచార్జ్ వర్మ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీ అభివృద్ధికి, కార్యకర్తల సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. పిల్లి చిన్న నియామకం పట్ల పిఠాపురం టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని పలువురు నాయకులు ఆయనను కలిసి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.



# వృద్ధులకు మంచి సేవలందించాలి

## - సంఘానికి మంచి పేరు తీసుకు రావాలి

## - ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచన

**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 24:** వృద్ధులకు సేవ చేస్తూ... సంఘానికి మంచి పేరు తీసుకురావాలని గౌతమీ జీవకారుణ్య సంఘం నూతన పాలక మండలి సభ్యులకు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచించారు. 2027 పుష్కరాలను పురస్కరించుకుని గౌతమీ జీవ కారుణ్య సంఘం ఆధీనంలోని గోదావరి గట్టున ఉన్న సత్రం పున నిర్మాణం, వంట గది బ్లాక్ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 2.8 కోట్లు మంజూరు చేస్తూ జీఓ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో గౌతమీ జీవకారుణ్య సంఘం చైర్మన్ వర్రే శ్రీనివాసరావు, డైరెక్టర్లు మిస్కా జోగినాయుడు, కందికొండ అనంత్, పాలిక సతీష్, కడియాల శ్రీలత, పోలాకి శ్రీదేవి, మన్నే రాజు, బొమ్మదేవర సత్యశ్యామల, ముమ్మిడి భాగ్యలక్ష్మి, గుంటల సంజీవరావు, ఈఓ పితాని తారకేశ్వరరావు తదితరులు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను తిలక్ రోడ్డులోని తన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ అనాధ, పేద పిల్లలకు విద్య, భోజనం, వసతి నిమిత్తం గోదావరి గట్టున శ్రీశ్రీశ్రీ కారుణ్య నంద స్వామి వారు 1940లో శ్రీ గౌతమీ జీవరుణ్య సంఘం ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ఈ భవనం శిథిలావస్థలో ఉందన్నారు. సంఘం అభివృద్ధికి ప్రభుత్వం కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించాలన్నారు. సంఘం భవనాల పున నిర్మాణం కోసం చేపట్టే పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వాసు సూచించారు.

## కూటమి ప్రభుత్వంలో పార్టీని నమ్ముకున్న వారికి

# తగిన పదవులు





**గండేపల్లి. (మనసులో మాట )డిసెంబర్ 24...** జిల్లా ఉపాధ్యాక్షుడుగా కందుల చిట్టిబాబు, జిల్లా ఆఫీస్ ఇన్చార్జిగా కోర్పు సాయితేజ తెలుగుదేశం పార్టీలో నమ్ముకున్న వారికి అన్యాయం జరగదని, వారిని ఎప్పటికైనా పార్టీ గుర్తిస్తుందని మళ్లీ రుజువైంది. తెలుగుదేశం పార్టీ జిల్లా కమిటీలో సభ్యులు పేర్లను పార్టీ విడుదల చేసింది. జగ్గంపేట నియోజకవర్గం గండేపల్లి మండలం నుంచి ఇద్దరు నాయకులకు అవకాశం దక్కింది. గండేపల్లి మండలం జడ్. రాగంపేట గ్రామానికి చెందిన కందుల చిట్టిబాబు జిల్లా ఉపాధ్యాక్షుడుగా నియమితులైతే, జిల్లా ఆఫీస్ ఇన్చార్జిగా కోర్పు సాయితేజలు నియమింపబడ్డారు. కందుల చిట్టిబాబు గత%శీ% లో తెలుగుదేశం ప్రభుత్వంలో మండల పార్టీ ప్రెసిడెంట్గానూ, ఆత్మ చైర్మన్గానూ, గత 30 సంవత్సరాలుగా జడ్.రాగంపేట సర్పంచిగానూ కొనసాగుతున్నారు. కోర్పు సాయితేజ తెదేపా యువనాయకుడుగానూ, జిల్లా ఉపాధ్యాక్షుడుగానూ ఇప్పటి వరకు పదవులు చేపట్టారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా ప్రెసిడెంట్ జ్యోతుల నవీన్ కుమార్ లు తమ మీద ఉన్న నమ్మకంతో ఈ పదవులు ఇచ్చారని ఆనందం వ్యక్తం చేశారు. తమ మీద ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకుని, పార్టీకి కార్యకర్తల అభ్యున్నతికి మరింత పనిచేస్తామని కందులు చిట్టిబాబు కోర్పు సాయి తేజ లు తెలియజేశారు.

# నదీ కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలించిన వైసిపి జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి



**కొత్తపేట (మనసులో మాట) డిసెంబర్ 24..** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం ఆత్రేయపురం మండలం రాజవరం గ్రామంలో నది కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి.ప్రభుత్వం ఇక మీదటైనా దీని మీద దృష్టి పెట్టి నష్ట నివారణ చర్యలు చేపట్టి నది కోత పెరగకుండా అరికట్టాలి. అక్కడ ఉన్న విలువైనటువంటి లంక భూములు,పంట పొలాలు విలువైనవి, ఏటిగట్టు ప్రమాదం వాటిల్లే పరిస్థితి ఉంది. ఇది డిజాస్టర్ మేనేజ్మెంట్ కింద ప్రభుత్వం వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కనుమూరి శ్రీనివాసరాజు, గ్రామ ప్రజలు,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇంజరంలో గోధుమ త్రాచు హల్ చల్



తాళ్ళరేవు (మనసులో మాట), డిసెంబరు: మండల పరిధిలోని ఇంజరం గ్రామంలో స్థానిక శివాలయం సెంటర్ వద్ద రేలంగి శ్రీకాంత్ గృహంలో బుధవారం గోధుమ త్రాచు పాము హల్చల్ చేసింది. ఇంట్లో పాము కనిపించగానే శ్రీకాంత్ భయభ్రాంతులకు గురై స్నేక్ క్యాచర్ వర్మకు ఫోన్ చేయగా ఆయన హుటాహుటిన వచ్చి చాకచక్యంగా పామును పట్టుకుని డబ్బాలో బంధించారు. శీతాకాలంలో చలికి పాములు ఇంట్లోకి వచ్చే అవకాశం ఉందని ప్రజలు అందుకు తగ్గట్టుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్నేక్ క్యాచర్ వర్మ తెలిపారు. ఈ సందర్భముగా వర్మకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



### బొబ్బర్లంక,వద్దిపర్రు రహదారి పనులకు

# నిధుల మంజూరు

### - ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**కొత్తపేట (మనసులో మాట) డిసెంబర్ 24..** ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక నుంచి వద్దిపర్రు వరకు రహదారి విస్తరణ పనుల కోసం ఇప్పటికే రూ.35 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వ అనుమతులు త్వరలోనే లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే బొబ్బర్లంక నుంచి వద్దిపర్రు వరకు రహదారి ప్రస్తుత మరమ్మతుల నిమిత్తం ఆర్ అండ్ బి నిధుల కింద రూ.70 లక్షలు మంజూరయ్యాయని ఆయన వెల్లడించారు. మెర్లపాలెం నుండి లొల్ల వరకు నూతన రహదారి నిర్మాణానికి ఆర్ అండ్ బి నిధుల ద్వారా రూ.3 కోట్లు మంజూరు అయ్యాయని, ఈ పనులన్నింటికీ త్వరలోనే టెండర్లు పిలిచి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

### కోడిపుంజులపై

# అప్రమత్తంగా ఉండాలి

### - ఎస్సై టి రామకృష్ణ



**కోటనందూరు( మనసులో మాట) డిసెంబర్ 24..** రాబోయే సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకొని, గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా కోడిపుంజుల దొంగతనాలు పెరిగే అవకాశం ఉన్నందున, కోటనందూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోటనందూరు పోలీస్ స్టేషన్ ఎస్.ఐ. టీ. రామకృష్ణ ప్రజలకు సూచించారు. సంక్రాంతి సమయంలో కోడిపుంజుల విక్రయం ఎక్కువగా జరుగుతుండటంతో, దొంగలు ఈ పరిస్థితిని అవకాశంగా తీసుకొని కోళ్ల ఫారాలు, ఇళ్ల వద్ద ఉన్న కోడిపుంజులను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో, కోడిపుంజులు పెంచుకునే వారు రాత్రి వేళల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, కోళ్ల షెడ్ల చుట్టూ సరైన లైటింగ్ ఏర్పాటు చేసుకోవాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా దొంగతనాలను అరికట్టవచ్చని, అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే, గ్రామాల్లో సమూహంగా అప్రమత్తంగా ఉండటం, పొరుగువారితో సమన్వయం పెంచుకోవడం ద్వారా దొంగతనాలను నివారించవచ్చని తెలిపారు. కోటనందూరు పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ఎప్పటికప్పుడు గస్తీ నిర్వహిస్తున్నారని, దొంగతనాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల సహకారంతోనే నేరాలను నియంత్రించగలమని, ఏ చిన్న సమాచారం అయినా పోలీసులకు అందించాలని కోటనందూరు పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### వాడపల్లి వెంకన్న ఆలయ అన్నదానపథకానికి

# రూ. 50 వేలు విరాళం



**కొత్తపేట( మనసులో మాట) డిసెంబర్ 24..** కోనసీమ తిరుమల గా పేరుపొందిన వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయ అన్నదాన పథకానికి రాజమండ్రి గాంధీపురం కు చెందిన ఇవటూరి పవన్ కుమార్,ఫణి కుమారి, దంపతులు రూ,50,050 ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావుకు అందజేశారు. ఆలయ సూపరిండెంట్ రాంబాబు దాతలకు స్వామివారి ప్రత్యేక దర్శనం చేయించి చిత్రపటాన్ని అందజేశారు.

# యేసు క్రీస్తు జననం మానవాళికి శాంతిమార్గం

### భక్రి శద్దలతో క్రిస్మస్ వేడుకలు - ఫాదర్ విమల్ రాజ్





**రామచంద్రపురం(మనసులో మాట) డిశంబరు24..** యేసు క్రీస్తు జననం మానవాళికి శాంతిమార్గమని ఫాదర్ ఎస్ విమల్ రాజ్ అన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో బుధవారం ఆర్ధరాత్రి నుంచి క్రిస్మస్ వేడుకలు భక్తి శ్రద్దలతో జరిగాయి. యేసు క్రీస్తు జననం పురస్కరించుకుని యేసు క్రీస్తు దేవాలయాల్లో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. అర్ధరాత్రి నుంచి క్రైస్తవులు చర్చిలకు చేరుకుని క్రీస్తు జననం సందర్భంగా కేక్‌లను కట్ చేసి స్వీట్లు పంచారు. క్రిస్మస్ సందర్భంగా చర్చిలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల ఆర్‌సీఎం చర్చి దివ్యకారుణ్యం దేవాలయంలో ఫాదర్ ఎస్ విమల్ రాజ్ ఆధ్వర్యంలో క్రిస్మస్‌వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రీస్తు దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వంగా సుందరంగా అలంకరించారు. ఆలయంలో బాలయేసు పశువుల పాకను తీర్చిదిద్దారు. బాలయేసు విగ్రహాన్ని ముద్దాడుతూ ఫాదర్ విమల్‌రాజ్ పశువుల పాక సెట్‌లో ఉంచారు. అనంతరం అర్ధరాత్రి వరకు భక్తిగీతాలను అలపించారు. అనంతరం జరిగిన క్రిస్మస్ దివ్యపూజలో ఫాదర్ విమల్‌రాజ్ మాట్లాడుతూ క్రిస్మస్‌సందేశాన్ని అందించారు. యేసు క్రీస్తు జననం మానవాళికి మార్గదర్శకమన్నారు. ప్రేమ, శాంతి మార్గాలను అందజేసి ప్రపంచ శాంతికోసం తన జననం ద్వారా సందేశాన్ని అందించారన్నారు. అధికసంఖ్యలో క్రైస్త భక్తులు చేరుకుని పశువులపాకలోని బాలయేసును దర్శించుకుని ప్రార్ధనలు చేశారు. పట్టణంలోని ప్రధాన రహదారుల్లో హాపీ క్రిస్మస్ అంటూ సందడి చేశారు. స్వీట్లు పంచి శుభకాంక్షలు తెలియజేసుకున్నారు. ప్రధాన రహదారిలో గల యేసు ప్రేమాలయం చర్చిలో బుధవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు ప్రత్యేక ప్రార్ధలను నిర్వహించారు. క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి హ్యాపీ క్రిస్మస్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా చర్చి నిర్వహకులు ప్రత్యేక క్రిస్మస్ సందేశాన్ని అందజేశారు.

# క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధం...

### సర్వాంగ సుందరంగా ముస్తాబైన చర్చిలు ప్రత్యేక ప్రార్ధనలు చేస్తున్న క్రైస్తవ సోదరులు





**తాళ్లరేవు (మనసులో మాట), డిసెంబరు 24:** చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని వాడవాడలా చర్చిలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. క్రిస్మస్ వేడుకల నిర్వహణకు విద్యుద్దీపాలతో అలంకరించారు. అలాగే శిలువలు, క్రిస్మస్ ట్రీ తదితర సెట్టింగ్లతో అలంకరించారు. కొన్ని చర్చిల వద్ద క్రీస్తు జన్మ వృత్తాంతం తెలిపే పశువుల పాకలను ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా క్రైస్తవ సోదరుల ఇళ్లవద్ద క్రిస్మస్ సందడి నెలకొంది. తమ ఇళ్ల వద్ద స్టార్, క్రిస్మస్ ట్రీలను ఏర్పాటు చేసుకున్నారు. చర్చిలు వద్ద విశ్వాసులు, క్రైస్తువుల ఇంటి వద్ద క్రీస్తు రాక సందర్భంగా స్టార్లను ఏర్పాటు చేసారు.

**ఉత్సాహంగా క్రిస్మస్ కేరల్స్**

గ్రామాల్లో ఉత్సాహంగా క్రిస్మస్ కేరల్స్ కార్యక్రమం జరిగింది. లోకరక్షకుడు ఏసుక్రీస్తు వస్తున్నారంటూ చర్చిల తరపున పాస్టర్లు, క్రైస్తవ సోదరులు ఇంటింటికీ వెళ్లి విశ్వాసులకు ఆహ్వానం పలికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసారు. దీంతో గ్రామాల్లో క్రిస్మస్ సందడి నెలకొంది. తాళ్లరేవు బాప్టిస్టు చర్చి పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో చర్చి పాస్టర్ దొమ్మేటి సామ్యూల్ సాగర్, మహేంద్ర, పిల్లి మణికంఠ, జానీ పాల్గొన్నారు.


**ఘనంగా క్రిస్మస్ వేడుకలు...**

ప్రధానంగా తాళ్లరేవులోని బాప్టిస్టు చర్చి, కోరంగి, సీతారామపురం, పి.మల్లవరం, చొల్లంగి, జార్జీపేట, నీలపల్లి, ఇంజరం తదితర గ్రామాలలోని చర్చిలలో క్రిస్మస్ వేడుకలు మొదలయ్యాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యక ప్రార్ధనలు నిర్వహిస్తున్నారు. క్రిస్మస్ వేడుకలకు తాళ్లరేవు బాప్టిస్టు చర్చిలో ముమ్మిడివరం నియోజకవర్గ వైఎస్సా ర్సీపీ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ హాజరై ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించనున్నారు. ఇలా ఉండగా పలు సంఘాలు, పాఠశాలల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రైస్తవ గీతాలను ఆలపిస్తూ క్రిస్మస్ సందేశాలను ఇస్తున్నారు.

### జల జీవన్ మిషన్ ద్వారా కోనసీమ జిల్లాలో

# త్రాగునీటి సమస్య తొలుగుతుంది- కలెక్టర్





**అమలాపురం (మనసులో మాట) డిసెంబరు 24:** కోనసీమ జిల్లా వాసుల త్రాగునీటి అవసరాలను తీర్చడమే లక్ష్యంగా జల జీవన్ మిషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత త్రాగునీటిని నీటి సరఫరా చేసే కార్యక్రమంలో భాగంగా కోనసీమ జిల్లాకు వాటర్ గ్రిడ్ పథకం ద్వారా రూ 1,650 కోట్ల తో ప్రాజెక్టును కేంద్రం మంజూరు చేసిందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు కోనసీమ జిల్లాకు బొబ్బర్లంక నుండి పైప్లైన్ల ద్వారా సురక్షిత త్రాగునీటిని చిట్ట చివరి స్థాయి వరకు సరఫరా చేసేందుకై పైప్లైన్ ఏర్పాటు కై సంబంధిత ఇంజనీర్లు అధికారులతో సమావేశం నిర్వహించి సమీక్షించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకే తల మానికమైన ఈ ప్రతిష్టాత్మక మైన ప్రాజెక్టు నిర్వహణకు అధికారులు పూర్తి సమన్వయం వహించాలన్నారు. జిల్లాలో త్రాగునీటి పైప్‌లైన్ ద్వారా నీటిని సరఫరా చేయడానికి కార్యాచరణ సిద్ధమైందన్నారు. మెగా ఇంజనీరింగ్ వారు ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ను నిర్మిస్తున్నారన్నారు. మెగా ఇంజనీరింగ్ వారు రూపొం దించిన పైప్లైన్ ఏర్పాటు పవర్ పాయింట్ ప్రజెంటే షన్ ను ముందుగా జిల్లా కలెక్టర్ తిలకించారు. రహదారులు భవనాలు విభాగం వారు ఏర్పాట్లు రోడ్ల వెంబడి వేస్తున్న పైప్ లైన్ కు సంబంధించి రోడ్ల క్రాసింగ్ తాలూకు నష్టాలను అంచనా వేసి నివేదిక సమర్పించాలన్నారు. జల వనరులు శాఖ వారు కాలువల వెంబడి పైప్ లైన్ ఏర్పాట్లులో నష్టాలను గణించాలన్నారు ఏపీఈపీ డీసీఎల్ వారు పైప్లైన్ ఏర్పా టు సంబంధించి విద్యుత్ స్తంభాలను మార్పు చేయా లన్నారు. సాధ్యమైనంత వరకు కాలువలు రోడ్లు వెంబడి ఉన్న ప్రభుత్వ స్థలాలలో పైప్ లైన్ ఏర్పా ట్లు చేపట్టాలన్నారు కాలువలు రోడ్లు మరమ్మత్తు పనులలో జియో టెక్స్టైల్ ఉప యోగించి రోడ్లు కాలువ ఏటి గట్ల మన్నికను సాధారణం కన్నా 5 సంవ త్సరాలు పాటు పెంచాల న్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా శుద్ధి చేసిన నీటిని స్థిరంగా అందించ డమే ప్రధాన ఉద్దేశమన్నారు. స్థానికంగా కాలువల ద్వారా సేకరించి శుద్ధిచేసి త్రాగునీటిని సరఫరా చేస్తున్నప్పటికీ అంత శ్రేయస్కారంగా లేకపోవ దంతో నేరుగా గోదావరి నీటిని శుద్ధి చేసి పైప్ లైన్ ద్వారా సరఫరా చేయ దానికి ప్రభుత్వం సంకల్పించిందన్నారుబీ ఈ ప్రాజెక్టు నీటి నాణ్యతను మెరుగు పరిచి కోనసీమ ప్రజానీకం ఆరోగ్యవంత మైన జీవనాన్ని గడిపేందుకు దోహదపడ నున్నదన్నారు. జిల్లా వ్యా ప్తంగా గ్రామాలకు, సముదాయాలకి మేజర్, సబ్ పైప్ లైన్ ద్వారా సరఫరా చేస్తా రన్నారు. ముఖ్యంగా గ్రామీణ త్రాగునీటి సమ స్యను పరిష్కరించడానికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి శ్రీకర్, ఆర్డబ్ల్యూ ఎస్ ఎస్ ఈ ఏవీఎస్ రాజన్, జల వనరుల శాఖ ఎస్ ఈ పి గోపీనాథ్ డ్రైనేజీ విభాగం ఈఈ ఎంవివి కిషోర్, పంచాయతీరాజ్ ఎస్ ఈ పులి రామకృష్ణారెడ్డి, ఆర్ అండ్ బి: ఎస్ సి బి రాము, ఆర్డ బ్ల్యూఎస్ డీ ఈ పద్మనాభం, మెగా ఇంజనీరింగ్ ప్రతినిధి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# కబ్జా స్థలాలను పేదలకు ఇళ్ల స్థలాలుగా ప్రకటించండి

### - సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు తాటిపాక మధు డిమాండ్

### - పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు అధికారులు వెనకంజు వేస్తున్నారు, కబ్జాదారులను ప్రోత్సహిస్తున్నారని తీవ్రంగా మండిపాటు.



**పిఠాపురం, ( మనసులో మాట) డిసెంబరు 24:** కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలో ఖాళీ స్థలాలను కబ్జాదారులకు కట్టబెట్టి నిరుపేదలకు మాత్రం పట్టణానికి పదుల కిలోమీటర్ల దూరంలో ఇళ్ల స్థలాలు ఇస్తున్నారని ఈ పద్ధతి మంచిది కాదని పట్టణ పరిధిలోనే ప్రభుత్వ భూములు గుర్తించి పేదలకుస్దలాలు ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు తాటిపాక మధు డిమాండ్ చేశారు. బుధవారం కాకినాడ రోడ్డు లో62సెంట్లుకబ్జా స్థలాన్ని పరిశీలించిన తాటిపాక మధు మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ భూమి పరిరక్షించి పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలని సిపిఐ దశల వారి పోరాటం చేస్తున్నా ప్రభుత్వ భూమిని పరిరక్షించడంలో అధికారులు విఫలమవుతున్నారన్నారు. 62 సెంట్లు భూమిని పేదలకి ఇండ్లస్థలాలు రెండు సెంట్లు చొప్పున పట్టాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పేదలకు సిపిఐ పాకలు వేసి అప్పగిస్తుందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో చెరుకూరు గణపతి. మర్రి పాదాలు. మర్రి లక్ష్మమ్మ. మేకల సుబ్బలక్ష్మి. మేకల సుబ్బారావు కందవల్లి సుబ్బారావు. మేకల శ్రీను కిల్లాడి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు




# కోనసీమ నుంచి నాలుగు ప్రాజెక్టులు జాతీయ స్థాయికి ఎంపిక



**అమలాపురం (మనసులో మాట) డిసెంబరు 24:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా మరోసారి రాష్ట్రవ్యాప్తంగా తన ప్రతిభను చాటుకుంది. కోనసీమ జిల్లా నుంచి నాలుగు విజ్ఞానశాస్త్ర ప్రాజెక్టులు జాతీయ స్థాయికి ఎంపిక కావడం గర్వకారణమని జిల్లా విద్యాశాఖ అధికారి పి. నాగేశ్వరరావు తెలిపారు.

**జాతీయ స్థాయికి ఎంపికైన ప్రాజెక్టులు వివరాలు ఇలా ఉన్నాయి**

1. జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల – వన్నె చింతలపూడి
ప్రాజెక్ట్ పేరు: Mission for Agriculture
2. మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల
ప్రాజెక్ట్ పేరు: FOOT PRESSURE POWER GENERATION
3. జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల – ఉబలంక
ప్రాజెక్ట్ పేరు: Solar Based Power Generation - Save Schools
4. శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి మున్సిపల్ ఉన్నత పాఠశాల, రామచంద్రాపురం
ప్రాజెక్ట్ పేరు: %Sustainable Agriculture

ఈ విజయంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి అత్యధిక ప్రాజెక్టులు జాతీయ స్థాయికి సాధించిన జిల్లాగా కోనసీమ నిలిచిందని, అంతేకాకుండా వరుసగా రెండోసారి అత్యధిక ప్రాజెక్టులు గెలుచుకున్న జిల్లాగా కోనసీమ రికార్డు సృష్టించడం ఎంతో గొప్ప విషయమని జిల్లా విద్యాశాఖ అధికారి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుల ఎంపికలో కీలక పాత్ర పోషించి, కార్యక్రమాన్ని చక్కగా, సమర్థవంతంగా నిర్వహించిన జిల్లా సైన్స్ అధికారి జి.వి.ఎస్. సుబ్రహ్మణ్యం ను జిల్లా విద్యాశాఖ అధికారి ప్రత్యేకంగా అభినందించారు. అలాగే, ఈ అపూర్వ విజయానికి గాను గౌరవ జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్ కూడా తమ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ విజయాలు విద్యార్థుల సృజనాత్మకతకు, ఉపాధ్యాయుల అంకితభావానికి, జిల్లా విద్యాశాఖ సమిష్టి కృషికి నిదర్శనంగా నిలుస్తున్నాయని అధికారులు తెలిపారు.

# పార్టీ జిల్లా అధ్యక్షుడు సాయిని మర్యాద పూర్వకంగా కలిసిన గౌరీశంకర్



**రామచంద్రపురం (మనసులో మాట) డిశంబరు 24..** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా నియమితులైన గుత్తుల సాయిని, రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుబాష్‌లను ఆపార్టీ రామచంద్రపురం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు దంగేటి గౌరీశంకర్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా పార్టీ అధ్యక్షునిగా నియమితులైన సందర్భంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసినట్లు గౌరీశంకర్ తెలిపారు. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బీసీల పట్ల ఉన్న అభిమానం శెట్టిబలిజలకు పార్టీ అధ్యక్ష పదవిని ఇవ్వటం ద్వారా స్పష్టమైందని తెలిపారు. రాబోయే రోజులో బీసీలంతా టీడీపీకి పట్టం కడతాయని గౌరీ శంకర్ ధీమా వ్యక్తం చేశారు.

### పిఠాపురంలో జిల్లా స్థాయి

# సబ్ జూనియర్ రగ్బీ పోటీలు

**పిఠాపురం, (మనసులో మాట) డిసెంబరు24:** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీన పిఠాపురంలో జిల్లా స్థాయి రగ్బీ పోటీలు నిర్వహించనున్నట్లు పోటీల నిర్వహణ కార్యదర్శి పి. లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. 'బల్ల సింహాచలం మెమోరియల్' పేరుతో నిర్వహించే ఈ సబ్ జూనియర్ బాలబాలికల రగ్బీ పోటీలు పిఠాపురం పట్టణంలోని ఆర్‌ఆర్‌బిహెచ్‌ఆర్ మినీ స్టేడియం మైదానంలో జరగనున్నాయి. ఈ సందర్భంగా కోచ్ లక్ష్మణరావు పలు వివరాలను తెలియజేశారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2010, 2011, 2012 సంవత్సరాల మధ్య జన్మించిన వారై ఉండాలి. ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 27వ తేదీ ఉదయం 9 గంటలకు మైదానంలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక చేస్తామని నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాలకు క్రీడాకారులు 9989001162 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. పిఠాపురం పరిసర ప్రాంతాల్లోని క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# సంక్రాంతి కి గోధుమ పిండి పంపిణీ



**ముమ్మిడివరం (మనసులో మాట) డిసెంబరు 24..** ఏపీ ప్రభుత్వం రేషన్ కార్డు దారులకు నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగల సందర్భంగా శుభవార్త అందించింది. రేషన్ దుకాణాల్లో ఇప్పటికే అందిస్తున్న నిత్యావసర సరుకులతో పాటు గోధుమ పిండిని కూడా సబ్సిడీ ధరకు అందించాలని నిర్ణయించింది. కేజీ గోధుమ పిండి కేవలం రూ.20కే ఇవ్వనుండగా.. 2026 జనవరి 1 నుంచి ఈ పథకం అమల్లోకి రానుంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో గోధుమ పిండి ధర కేజీకి రూ.40 నుంచి రూ.80 వరకు ఉండటంతో, ఈ నిర్ణయం పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు భారీ ఆర్థిక ఉపశమనం లభించనుంది. పౌరసరఫరాల శాఖ ఇప్పటికే పలు జిల్లాలకు, అటు నుండి మండలాలకు రేషన్ సరుకులను తరలిస్తోంది. బియ్యం, చెక్కర, పప్పులతోపాటు ఇకపై గోధుమపిండిని కూడా సబ్సిడీపై అందించటం మరో కీలక ముందడుగుగా భావిస్తున్నారు. జిల్లా లో 5.42 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. వీరికి ప్రతీ నెలా 926 రేషన్ దుకాణాలు ద్వారా సరుకులు పంపిణీ చేస్తున్నారు.రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులు జనవరి నుంచి ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని జిల్లా పౌర సరఫరాల అధికారులు పిలుపు నిచ్చారు

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
రాయలసీమ
కర్నూలు | అనంతవురం
చిత్తూరు | కడవ



# ఏసుప్రభువు చేసిన మార్గదర్శకాలు ఎంతో విలువైనవి

**- పాఠశాల డైరెక్టర్ రవీంద్ర, పృథ్వీరాజ్**




ధర్మవరం డిసెంబర్ 24 (మనసులో మాట) ఏసుప్రభువు చేసిన మార్గదర్శకాలు ఎంతో విలువైనవని యశోద కాన్సెప్ట్ స్కూల్ పాఠశాల డైరెక్టర్ రవీంద్ర, పృధ్వీరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు పాఠశాలలో క్రిస్మస్ వేడుకలను విద్యార్థుల నడుమ ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చర్చి పాస్టర్ శామ్యూల్ హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన శాంటా క్లాజ్ వేషధారణలు, నాటికలు, చిన్నారుల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనుప్ కుమార్, ఉపాధ్యాయ బృందం, బోధ నేతర బృందం, తల్లిదండ్రులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

### ధర్మవరం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో సదుపాయాల లోపంపై

# మంత్రి హరీష్ బాబు ఆకస్మిక తనిఖీ



**ధర్మవరం డిసెంబర్ 24 (మనసులో మాట)..** పట్టణం లోని గాంధీనగర్లోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో (ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం) మౌలిక సదుపాయాల లోపం, వైద్య సేవలలో నిర్లక్ష్యం, రోగులకు తగిన సేవలు అందకపోవడం వంటి అంశాలు వెలుగులోకి రావడంతో మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు అక్కడికి వెళ్లి ఆకస్మికంగా పరిశీలించారు.

ఆసుపత్రిలో రోగులకు తగ్గట్టు పడకలు ఉన్నప్పటికీ వినియోగం లేకుండా ఉండటం, వైద్యులు లేకపోయినా కనీసం ఆ శాఖ, ఆరోగ్య శాఖ మాత్యులు సత్య కుమార్ యాదవ్ దృష్టికి తీసుకోకపోవడం వల్ల సిబ్బంది అవలంబిస్తున్న నిర్లక్ష్యంపై మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కొన్ని వైద్య పరికరాలు ఉపయోగంలో లేకపోవడం, వైద్య సిబ్బంది అలసత్వం కూడా అక్కడ కొట్టొచ్చినట్లు కనిపించింది. సిబ్బంది కూడా అందుబాటులో లేకపోవడం, రోగులు ఎక్కువసేపు వేచి ఉండాల్సి రావడం వంటి లోపాలను హరీష్ బాబు స్వయంగా క్షేత్రస్థాయిలో గమనించారు. ఈ పరిస్థితిపై వెంటనే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి తో పాటు ఉన్నత ఆరోగ్య శాఖ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు నాణ్యంగా, సమయానికి అందించాల్సిన బాధ్యత అధికారులదేనని, ఆసుపత్రిలో ఉన్న మౌలిక వసతులను పూర్తిస్థాయిలో వినియోగించాల్సిందేనని, సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని, రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలన్నారు. ఈ అంశాన్ని హరీష్ బాబు, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పూర్తిగా వివరించగా, ఈ ఘటనపై మంత్రి సత్యకుమార్ యాదవ్ సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారని హరీష్ బాబు తెలిపారు. త్వరలోనే ఈ ఆసుపత్రిలోని సమస్యలన్నీ పరిష్కారమవుతాయని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, క్షేత్రస్థాయిలో సమస్యలు కనిపిస్తే వాటిని వెంటనే పరిష్కరించడమే తమ బాధ్యత అని అన్నారు.



## వ్యాపారస్తుల సౌకర్యం

# కూటమి ప్రభుత్వ లక్ష్యం

**పలమనేరు డిసెంబర్ 25 ( మనసులో మాట) :**పలమనేరు శాసనసభ్యులు ఎన్.అమర్నాథరెడ్డి ఆదేశాల మేరకు వ్యవసాయ మార్కెట్ కమిటీ, పలమనేరు యార్డు నందు ప్రస్తుతం ఉన్న మరుగుదొడ్లు (సులబ్ కాంప్లెక్స్) కాక చింతపండు వ్యాపారస్తులకు వారి వ్యాపార ప్రాగణం నందు నూతన మరుగుదొడ్లు నిర్మించవలసినదిగా కోరుతూ ఏఎంసి చైర్మన్ కె.రాజన్న కు విన్నతిపత్రం అందజేసిన చింతపండు వ్యాపారస్థులు. వెంటనే వారి వ్యాపార ప్రాగణంను పరిశీలించిన చర్యలు చేపడుతామని చెప్పిన ఏఎంసీ చైర్మన్ రాజన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి కార్యదర్శి వి.సంజీవ కుమార్, తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులు గణితంపై ఆసక్తి పెంచుకోవాలి.. డీన్ భాస్కర్



**ధర్మవరం డిసెంబర్ 24 (మనసులో మాట)..** విద్యార్థులు గణితం పై ఆసక్తి పెంచుకోవాలని డీన్ భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని రుషి విద్యాలయ పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా రిషి విద్యాలయ పాఠశాలలో ఒక వారం పాటు గణిత కార్యక్రమాలు విజయవంతంగా ముగిసాయి. ఈ సందర్భంగా గణిత క్విజ్, గుణకార పట్టికలు, గణిత సమస్యలు, వివిధ గణిత పోటీలు విద్యార్థులకు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొదటి, రెండవ, మూడవ బహుమతులను డీన్ భాస్కర్ , ప్రిన్సిపాల్ కరణ్ స్వరూప సింగ్, రవీంద్ర విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణిత విద్య ప్రాముఖ్యతను వివరించి, విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో గణితంపై ఆసక్తిని పెంపొందించిందని పాఠశాల సిబ్బంది తెలిపారు.

### అనుచిత వాక్యాలు, అనుచిత ప్రదర్శనలు చేసిన


# ఆరుగురు నిందితులు అరెస్ట్

**- టూ టౌన్ సిఐ రెడ్డప్ప**



**ధర్మవరం డిసెంబర్ 24 (మనసులో మాట)..** పట్టణంలో రాజకీయ పార్టీల మధ్య వైశ్యామ్యాలు రెచ్చగొట్టే విధంగా అనుచిత వాక్యాలు, ప్రదర్శనలు చేసిన ఆరుగురు నిందితులను అరెస్టు చేయడం జరిగిందని టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ అరెస్టు అయిన వారిలో పట్టణములోని రామ్ నగర్కు చెందిన టి. మల్లికార్జున రెడ్డి, పట్టణంలోని మారుతీ నగర్ కి చెందిన ఆర్ రాజశేఖర్ రెడ్డి, రేగాటి పల్లి గ్రామానికి చెందిన డి. ఓబిరెడ్డి, రేగాటిపల్లి గ్రామానికి చెందిన నీలా వినయ్, మారుతీ నగర్ కు చెందిన దాసరి మల్లికార్జున, మారుతీ నగర్ కు చెందిన సాకే కాసపులను అరెస్టు చేసి కోర్టుకు తరలించి రిమాండ్కు పంపడం జరిగింది అన్నారు. ఈనెల 21వ తేదీన వైయస్సార్ పొలిటికల్ పార్టీ మాజీ ముఖ్యమంత్రి అయిన వైయస్ జగన్మోహన్ రెడ్డి యొక్క పుట్టినరోజు సందర్భంగా పై కనపరిచిన 6 మంది ముద్దాయిలు గుంపులుగా ఏర్పడి ధర్మవరం మామిళ్ళపల్లి రోడ్డు మీద వైయస్ జగన్మోహన్ రెడ్డి ఫ్లెక్సీలతో పాటుగా కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఫ్లెక్సీలను ఉంచి రాజకీయ పార్టీల మధ్య వర్గ వైశాల్యాలు రెచ్చగొట్టే విధంగా అనుచిత వాక్యాలు ప్రవర్తనలు చేస్తూ, రోడ్డు మీద వచ్చి పోయేవారికి ప్రజాశాంతికి భంగం కలిగించే విధంగా ప్రజలను భయాందోళనకు గురి చేయడం జరిగిందని తెలిపారు. అంతేకాకుండా వేట కొడవలితో పొట్టేలను నరికి వాటి రక్తంతో జగన్మోహన్ రెడ్డి కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఫ్లెక్సీ లకు రక్తాభిషేకం చేసిన నేరములో నల్లగుండ్ల శ్రీనివాసులు యొక్క ఫిర్యాదు పై కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ ఆరు మందిని గుట్ట కింద పల్లి పెట్రోల్ బంక్ ముందర రోడ్డు మార్జిన్ వద్ద అరెస్టు చేసి, రిమాండ్ కు తరలించడం జరిగిందని తెలిపారు.

# ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు - సురేష్ కుమార్



**పలమనేరు డిసెంబర్ 25 ( మనసులో మాట):**క్రిస్మస్ పండుగ నేటి దినాలలో రంగురంగుల వెలుగులతో కాంతులతో పంటి,పండుగలు జరుపుకుంటు న్నారు. ఇండ్లకు కొత్త రంగులతో ముస్తాబు చేస్తారు. ఈ పండుగ రోజున ఆలయాలకు వెళ్లి క్రీస్తును ఆరాధించి, ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటారు. క్రిస్మస్ అనగా క్రీస్తును ఆరాధించుట. ఆనాడు యేసు పుట్టిన దినాన శిశు వుగా ఉన్న యేసును ఆరాధించిన వారు తల్లి,సంరక్షకుడైన యోసేపు, దేవదూతలు గొర్రెల కాపరులు జ్ఞానులు. ఆరాధించుట అనగా స్తుతించుట మహిమ పరచుట, కీర్తించుట పాటలు పాడుట. క్రిస్మస్ పండుగ ఆనాడు ఇద్దరితో మొదలై తల్లి అయిన సంరక్షకుడైన యోసేపు, కొందరి గొర్రెల కాపరులు, ముగ్గురు జ్ఞానులు, దేవదూతలతో ప్రారంభమైన, నేడు కొన్ని కోట్ల మంది ఈ పండుగను జరుపుకోవటం నిజముగా హృదయాలకు ఆనందమే.

ఏసు ఎందుకు జన్మించాడు? దీనికి ప్రధాన కారణము సృష్టికర్త అయిన దేవుడు ఈ లోకాన్ని ప్రేమించాడు. ఈ లోకాన్ని ప్రేమించిన దేవుడు లోకాన్ని చూసినప్పుడు పాపముతో నిండి ఉన్నది. ఈ పాపము వలన ప్రతి మానవుడు మరణానికి అనగా శరీరమరణము మాత్రమే కాదు ఆత్మ మరణముకు కూడా పాత్రుడు అగుచున్నాడు. "పాపము వలన వచ్చు జీతము మరణము" ప్రతి మానవుడు చేసిన పాపము వలన మరణమునకు పాత్రుడు అవుతున్నాడు కాబట్టి ఆ మరణము నుండి ప్రతి మానవుని రక్షించాలని సృష్టికర్త అయిన దేవుడు తలంచాడు. కాబట్టి మానవునిలో ఉన్న పాపమును తీసివేయాలి. అంటే పరిశుద్ధ రక్తము ద్వారానే తీసివేయాలి. జంతు రక్తము ద్వారా మానవుని పాపము తీసివేయబడదు. కాబట్టి పరిశుద్ధ మానవుని రక్తము కావాలి. ఈ లోకంలో ఉన్న ప్రతి మానవుడు పాపము చేసినవాడే. పాపములో పుట్టినవాడే పరిశుద్ధుడైన మానవుడు ఎవడును లేడు. కాబట్టి పరిశుద్ధుడైన మానవుడు కావాలి. అందువలన తండ్రి అయిన దేవుడు తన ఏకైక కుమారుడైన యేసును ఈ లోకంలోకి పంపాడు. యోహాను 3:16 "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను"

రెండవ కారణము: నిత్యజీవం మనం పొందుకోవడానికి ఏసు జన్మించాడు. పరిశుద్ధాత్మ వలన కన్య మరియకు ఏసు పరిశుద్ధునిగా జన్మించాడు. పరిశుద్ధుడైన యేసు నందు విశ్వాసముంచు ప్రతివాడు నశించక నిత్యజీవము పొందుతాడు. ఈ లోకములో ఉన్న ప్రతి మానవుడు గ్రహించవలసినది ఏమిటి అంటే మన శరీరమునకు మరణం ఎలాగు ఉన్నదో అలాగే ఆత్మకు కూడా మరణము ఉన్నదని తెలుసుకోవాలి. ఆత్మ మరణము నుండి తప్పించబడాలి అంటే పరిశుద్ధుడైన రక్షకుడైన యేసు నందు విశ్వాసముంచాలి. విశ్వాసముంచు ప్రతివాడు మరణము నుండి రక్షించబడి నిత్య జీవములోనికి ప్రవేశిస్తాడు. ఇందుకే యేసు ప్రభువు ఈ లోకములో జన్మించాడు. ఈ పరమార్థాన్ని ప్రతి మానవుడు తెలుసుకోవాలి. మత్తయి 1:21 వచనములో దేవుని దూత యోసేపుతో మాట్లాడిన మాటల్లో ఈ అర్థాన్ని తెలుసుకోవచ్చు." ఆమె (మరియా) యొక కుమారుని కనును తన ప్రజలను వారి పాపము నుండి ఆయనే (యేసు) రక్షించును. గనుక ఆయనకు యేసు అను పేరు పెట్టుదురనెను. ఈ పరమార్థాన్ని మనం తప్పక తెలుసుకోవాలి. ఈ పండుగను మాత్రమే కాకుండా నిజముగా ఈ క్రిస్మస్ పండుగ మనలో నున్న ఆత్మకు పండుగ నిచ్చేదిగా ఉండాలి. క్రిస్మస్ అనగా క్రీస్తును ఆరాధించటం ఏసుప్రభు ఇలాగు చెప్పాడు దేవుని ఆరాధించునప్పుడు ఆత్మతో సత్యముతో ఆరాధింపవలెను" . ఆనాడు యేసు జన్మించినప్పుడు దేవదూతలు తల్లి సంరక్షకుడైన యోసేపు గొర్రెల కాపరులు, జ్ఞానులు తమ హృదయాలతో ఆత్మతో సత్యముతో ఆరాధించారు. దేవుని ఆశీర్వాదం పొందుకున్నారు.

ఆనాడు దేవుని దూతలు గొర్రెల కాపరులకు "నేడు మీ కొరకు రక్షకుడు పుట్టియున్నాడు" అను వర్తమానము అందించినప్పుడు వారు విని యేసును దర్శించి ఆరాధించి స్తుతించి వెళ్లారు. ఆశీర్వాదమును పొందుకున్నారు. నేడు ఈ వర్తమానము చదువుతూ ఉన్న మీకు కూడా దేవుని దూతలు వర్తమానమును పంపియున్నారని గ్రహించి యేసును విశ్వసించి మీ హృదయాలలో ప్రభువైన యేసును అంగీకరించి ఆరాధించి స్తుతించి, రక్షణను నిత్య జీవమును ఆశీర్వాదము పొందుకోవాలని దేవుడు ఆశిస్తూ ఉన్నాడు. దేవుడు మీకు తోడై ఉండును గాక మీకందరికీ సి.ఎస్.ఐ క్రిస్మస్ వి. సురేష్ కుమార్ శుభాకాంక్షలు తెలియజేశారు.

### జిల్లాలో దాళ్వా పంటకు సరిపడా

# యూరియా అందుబాటులో ఉంది..

**- రైతులెవరు ఆందోళన చెందాల్సిన పనిలేదు..**

**- యూరియాను అధిక ధరలకు అమ్మే వారిపై కఠిన చర్యలు..**

**- జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్..**



**సామర్లకోట (పెద్దాపురం- మనసులో మాట), డిసెంబరు 24:** జిల్లాలో రబీ సీజనుకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన పనిలేదని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అన్నారు. బుధవారం సామర్లకోట మండలం జీ మేడపాడు గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ కేంద్రంలోని యూరియా నిల్వలను వ్యవసాయ, సహకార శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం గ్రామంలో వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి రైతులతో నేరుగా మాట్లాడి యూరియా వాడకంపై వారిలో ఉన్న అపోహలను తొలగించారు. ఈ సందర్భంగా జేసీ అపూర్వ భరత్ మాట్లాడుతూ.. కాకినాడ జిల్లాలో దాళ్వా 2025 లోని అన్ని రకముల పంటలకు 35576 మెట్రిక్ టన్నులు యూరియా అవసరం ఉందన్నారు. జిల్లాలో 14,861 మెట్రిక్ టన్నులు యూరియా అవసరం ఉండగా ఇప్పటి వరకు 11,483 మెట్రిక్ టన్నులు సరఫరా చేయడం జరిగిందన్నారు. నేటికి 5490 మెట్రిక్ టన్నులు యూరియా అందుబాటులో ఉందన్నారు. ప్రస్తుతం ప్రైవేటు రిటైల్ డీలర్లు వద్ద 2968 మెట్రిక్ టన్నులు, పీఏసీఎస్ ల వద్ద 501 మెట్రిక్ పనులు, రైతు సేవ కేంద్రాలలో 1185 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు హెూల్ సేలు డీలర్లు వద్ద 70 మెట్రిక్ టన్నులు, ఏపీ మార్కఫెడ్ వద్ద 766 మెట్రిక్ టన్నులు వెరసి 5490 మెట్రిక్ టన్నులు యురియా జిల్లాలో అందుబాటులో ఉందన్నారు. రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన పనిలేదని జిల్లాలో ఇప్పటి వరకు ఎటువంటి ఎరువుల కొరత లేదని, అవసరమైన యురియా సరఫరా సంతృప్తికరంగా ఉందన్నారు. రాబోయే పంట కాలంలో కుడా యురియాకు ఎటువంటి కొరత రానీయకుండా అధికార యంత్రాంగం అవసరమైన చర్యలు చేపడుతుందని జేసీ అపూర్వ భరత్ తెలిపారు. రైతు సోదరులకు ఎరువులను కొనుగోలు చేయునప్పుడు బస్తాపై ముద్రించిన ఎంఆర్పీ ధరలను చూసుకుని, దాని ప్రకారము సొమ్ము చెల్లించాలని, తప్పని సరిగా డీలరు నుండి రసీదు పొందాలని ఆయన తెలిపారు. నూతనంగా రూపొందించిబడిన సాంకేతికంగా అభివృధి పరచిన నానో యూరియా , నానో డీఏపీ ఎరువులను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ప్రస్తుతం 722 లీటర్ల నానో యూరియా రైతు సేవ కేంద్రాలలో అందుబాటులో ఉంచామన్నారు. ఇవి సాంప్రదాయ ఎరువులకు నూరు శాతం ప్రత్యామ్నాయంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని ప్రోత్సాహిస్తున్నాయని ఆయన తెలిపారు. ఎవరైనా డీలర్లు నిబంధనలు ఉల్లంఘించి, ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, ఎరువులను మళ్లింపు చేసిన, ఎంఆర్పి ధరల కంటే ఎరువులను అధిక ధరలకు విక్రయించిన ఎడల, వారి యొక్క లైసెన్స్ లు రద్దు చేసి, ఎరువుల నియంత్రణ చట్టం 1985, ప్రకారం వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్ని జేసీ హెచ్చరించారు. ఈ పరిశీలనలో జాయింట్ కలెక్టర్ వెంట సామర్లకోట మండలం వ్యవసాయ ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### స్థానిక ఎన్నికలలోపు

# కుల గణన నిర్వహించాలి..

**- యాదవ సంఘం ప్రతినిధులు డిమాండ్**



**ధర్మవరం డిసెంబర్ 24 (మనసులో మాట)** స్థానిక ఎన్నికలలోపు కుల గణన నిర్వహించాలని యాదవ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని జయకృష్ణ స్వామి దేవస్థానంలో నియోజకవర్గ యాదవ సంఘం ప్రతినిధుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో యాదవుల హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం, కుల గణన అంశాలపై విస్తృతంగా చర్చ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన విద్యా, ఉద్యోగ, రాజకీయ అవకాశాలు కల్పించాలని, హక్కుల సాధన కోసం ఐక్య పోరాటం చేయాలని, గ్రామస్థాయి నుంచి చట్టసభల వరకు సమతుల్య అవకాశాలు కల్పించాలని, బీసీలలో అత్యధిక జనాభా కలిగిన యాదవులకు తగిన రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు లక్ష్మీ నరసప్ప యాదవ్, యాదవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహ యాదవ్, నియోజకవర్గ అధ్యక్షులు డాక్టర్ వివేక్ యాదవ్, యాదవ సాధికారిక అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, ఎంపీటీసీ బిల్వంపల్లి కేశవ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు బాల ఆంజనేయులు యాదవ్, నాగేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# నేను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నా

**ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్**



**హైదరాబాద్,డిసెంబర్ 24:** తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. మిగతా ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఎవరు, ఏ పార్టీలో ఉన్నారో తనకు తెలియదని వ్యాఖ్యానించారు. 'నేను ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ గెలుస్తుంది. జీహెచ్ఎంసీలో కాంగ్రెస్, ఎంఐఎం కలిపి మొత్తం 300 డివిజన్లు గెలుస్తాయి. గ్రేటర్ హైదరాబాద్ అంతటా ప్రచారం చేస్తా.. కాంగ్రెస్ పథకాలను వివరిస్తా అని దానం నాగేందర్ తెలిపారు. బీఆర్ఎస్ పార్టీలో గెలిచిన 10 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు దిశగా గులాబీ పార్టీ పోరాటం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఫిరాయింపు ఎమ్మెల్యేలు అందరూ తాము బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నామని చెబుతున్నారు. ఈ క్రమంలో దానం నాగేందర్ మాత్రం తాను కాంగ్రెస్‌లో ఉన్నానని ఒప్పుకున్నారు. హైకమాండ్ నుంచి స్పష్టమైన హామీ రావడంతోనే దానం నాగేందర్ ఈ ప్రకటన చేశారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# పంచాయతీలకు నిధుల నజరానా

## పెద్ద జీపీలకు రూ. 10 లక్షలు.. చిన్న వాటికి రూ. 5 లక్షలు



### ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- నేరుగా విడుదల చేస్తానని ప్రకటన
- గ్రామాల అభివృద్ధికి నడుం బిగించాలని పిలుపు
- కేంద్రం నుంచి మార్చిలోగా రూ. 3వేల కోట్లు వస్తాయని వెల్లడి
- కొడంగల్ లో సర్పంచులకు సన్మానం

**మహబూబ్‌నగర్,డిసెంబర్24 (మనసులో మాట):**

గ్రామాల అభివృద్ధికి కొత్త సర్పంచ్‌లు తమవంతుగా కృషి చేయాలని, వారికి ప్రభుత్వం తోడ్పాటుగా ఉంటుందని సిఎం రేంవత్ రెడ్డి అన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచ్‌లకు నేరుగా నిధులు అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కొడంగల్ నియోజకవర్గం పరిధిలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం.. సర్పంచ్‌లకు శుభవార్త చెప్పారు. గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచ్‌లకు నేరుగా నిధులు అందిస్తామని చెప్పారు. పెద్ద గ్రామాలకు రూ. 10 లక్షలు, చిన్న గ్రామాలకు రూ. 5 లక్షలు చొప్పున ఇస్తామన్నారు. సర్పంచ్‌లకు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద నిధులు ఇస్తామని సీఎం తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు సంబంధం లేకుండా నిధులు ఇస్తామని తెలిపారు. అలాగే గ్రామాల్లో అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ చేస్తాని సీఎం ప్రకటించారు. కేంద్రం నుంచి 3వేల కోట్లు రావాల్సి ఉందని, మార్చిలోగా వాటిని తెచ్చే బాధ్యత తనదని, వాటిని నేరుగా గ్రామాలకు అందచేస్తామని అన్నారు. ఈ నిధులతో గ్రామాల్లో పనులు మొదలు పెట్టాలన్నారు. మీ సహకారం వల్లే నేను ఇంతటివాడిని అయ్యాను. 2009 నుంచి నన్ను మీ భుజాలపై మోశారు. కొడంగల్‌ను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతా. గ్రామాలు బాగుంటేనే దేశం బాగుంటుంది. గ్రామాల్లో వివక్ష లేకుండా పరిపాలన సాగాలి. పార్టీలు.. పంతాలకు పోకుండా కలిసికట్టుగా పనిచేయాలి. గ్రామాల అభివృద్ధికి పాటుపడేలా సర్పంచ్‌లు ఉండాలి. ప్రజలకు ఉన్నతమైన, నాణ్యమైన సేవలు అందించాలి. పార్టీలకు అతీతంగా గ్రామాలు అభివృద్ధి కావాలని నూతన సర్పంచ్‌లకు సీఎం రేవంత్ సూచించారు. నూతన సంవత్సరంలో గ్రామాలకు ప్రత్యేక అభివృద్ధి నిధులు మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. పంచాయతీలకు యథావిధిగా వచ్చే నిధులు కాకుండా చిన్న గ్రామాలకు రూ.5లక్షలు, పెద్ద గ్రామాలకు రూ.10లక్షలు చొప్పున ముఖ్యమంత్రి నిధి నుంచి ప్రత్యేక అభివృద్ధి నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాట నిలబెట్టు కునేందుకు గ్రామాల్లో సదుపాయాల కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని సర్పంచ్‌లకు సూచించారు. గ్రామాల్లో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అభివృద్ధి నిధులు ఉపయోగించాలన్నారు. కొడంగల్ నియోజకవర్గాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం. ప్రతి గ్రామం, తండాకు రోడ్లు పూర్తి చేస్తాం. గుడి, బడి, తాగునీరు, పేదలకు ఇళ్లు, రేషన్ కార్డులు అందిస్తాం. నిరుద్యోగుల కోసం ఇండస్ట్రియల్ పార్కును అభివృద్ధి చేస్తాం. నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు.. గ్రామాల్లో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా ప్రజా సేవ చేయాలి. దేశ పునాదులు గ్రామాల్లో ఉన్నాయని గాంధీజీ చెప్పారు. గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది. పేదలకు పథకాలు చేరినప్పుడే నిజమైన పాలన అందుబాటులోకి వస్తుంది. కొడంగల్‌ను ఆదర్శ నియోజకవర్గంగా నిలబెట్టిన నాయకులను అభినందిస్తున్నా. ఇక్కడి సమస్యల పరిష్కారానికి మా సోదరుడు తిరుపతిరెడ్డిని అందుబాటులో ఉంచా. ఎన్నికలు ముగిశాయి.. ఇక ఎలాంటి రాజకీయాలు లేవు. ఎన్నికల్లో పోటీ చేసినప్పుడే పార్టీలు, పంథాలు ఉండాలి. రాష్ట్రానికి నాయకత్వ వహిస్తున్న మనం అందరినీ కలుపుకొని పోదాం అని అన్నారు. నియోజకవర్గంలోని గ్రామాలు, తండాల్లో ఎలాంటి సమస్యలు ఉండకూడదని సీఎం అన్నారు. కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, స్థానిక ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

# నీటి ద్రోహంపై జవాబు చెప్పలేక నిక్కృష్టపు మాటలు

**రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా చలనం లేని సీఎం**

**ఎక్స్ వేదికగా మండిపడ్డ కేటీఆర్**



**హైదరాబాద్, డిసెంబర్ 24:** 2028లో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టడం ఖాయమని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కోస్గి సభలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ మండిపడ్డారు. నీటి ద్రోహంపై జవాబు చెప్పలేక నిక్కృష్టపు మాటలు మాట్లాడుతున్నారని 'ఎక్స్' వేదికగా ధ్వజమెత్తారు. 'జల హక్కులను కాపాడటం రేవంత్‌రెడ్డికి చేతకాదు. పాలమూరు ప్రాజెక్టు గొంతుకోసి.. సొంత జిల్లానే దగా చేస్తున్నారు. తెలంగాణ సోయిలేని.. రాష్ట్ర ప్రయోజనాలు రక్షించలేని వ్యక్తి రేవంత్‌రెడ్డి. శాసన సభలో.. జనసభలో ప్రతిచోటా కాంగ్రెస్ జలద్రోహాన్ని ఎండగడతాం. జనం అన్నీ గమనిస్తున్నారు.. సందర్భం వచ్చినప్పుడు తొక్కి నారతీస్తారు' అని కేటీఆర్ అన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో 750 మందికి పైగా రైతులు మరణించినా సీఎం రేవంత్ రెడ్డికి కనీసం చీమ కుట్టినట్టు కూడా లేదని కేటీఆర్ విమర్శించారు. పంట కొనే దిక్కులేక కొనుగోలు కేంద్రం వద్దే జమ్మన్న అనే రైతు గుండెపోటుతో కుప్పకూలి మరణించడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. గద్వాల జిల్లా మానవపాడు మండలంలోని కలుకుంట్ల మొక్కజొన్న కేంద్రం వద్ద జరిగిన ఈ ఘటనకు పూర్తి బాధ్యత ముఖ్యమంత్రిదే అని చెప్పారు. నాలుగు రోజులుగా పడిగాపులు పడుతున్నా కూడా మొక్కజొన్న పంట కొనకుండా కాంగ్రెస్ సర్కారు అన్నదాత నిండు ప్రాణాన్ని బలితీసుకుందన్నారు. ఓ వైపు పెట్టుబడి సాయం అందక అప్పుల పాలై రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, మరోవైపు భారీ వర్షాలతో పంట నష్టపోయినా కూడా కనీసం పరిహారం అందక కౌలు రైతులు సైతం బలవన్మరణాలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఇంకోవైపు పనికిరాని యాప్‌లతో యూరియా అందక అన్నదాతలు మళ్లీ ఈ సీజన్‌లోనూ అష్టకష్టాలు పడుతున్నారన్నారు. దేళ్లపాటు సంతోషంగా సాగిన సాగును కన్నీటి సేద్యంగా మార్చి.. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా సంక్షోభంలోకి నెట్టిన ఈ పాపం ఊరికే పోదని చెప్పారు. కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు పడుతున్న రైతుల కష్టాలు తీర్చేందుకు ఇప్పటికైనా రేవంత్ సర్కార్ మొద్దు నిద్ర వీడాలని అన్నారు. ముఖ్యమంత్రి నిర్వాకంతో ఇవాళ గుండె పగిలి మరణించిన జమ్మన్న కుటుంబానికి రూ.25లక్షల పరిహారం అందిచాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# నేనున్నంత కాలం నీకు అధికారం కలే

- రాష్ట్రంలో బీఆర్ఎస్, కేసీఆర్ ఇక గత చరిత్రే
- కేసీఆర్‌వి సోయిలేని మాటలు.. స్థాయిలేని విమర్శలు
- వరుస ఓటములు ఎదురయినా సిగ్గురాలేదా
- నన్నూ..నా కుటుంబాన్ని ఇబ్బంది పెట్టినా పట్టించుకోలే
- కేసులు పెట్టి జైలుకు తోసినా లాభం లేదని మిన్నకున్నా
- ఫామ్‌హౌజ్‌నే జైలుగా మార్చుకుని ఉంటున్నావని గుర్తుంచుకో
- నీలా పాస్‌పోర్టు బ్రోకర్ దందా చేసి పైకి రాలేదు
- సొంత చెల్లిని మెడబట్టి గెంటిన కేటీఆర్ నాపై విమర్శలా
- నీలాంటి వారిని చాలామందిని చూసా..గుర్తుంచుకో
- కిందిస్థాయి నుంచి వచ్చి సీఎంగా అయ్యా
- కొడంగల్ సభలో కేసీఆర్‌పై ఘాటు విమర్శలు చేసిన రేవంత్



**మహబూబ్‌నగర్, డిసెంబర్ 24:** తాను రాజకీయాల్లో ఉన్నంతకాలం కేసీఆర్, ఆయన కుటుంబానికి అధికారం దక్కనివ్వనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శపథం చేశారు. మంతరిగా, కేంద్రమంత్రిగా, సిఎంగా పదేళ్లు పనిచేసిన కెసిఆర్ నాలుగు మంచి మాటలు చెప్పకుండా తోలు తీస్తానంటూ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. నీలాగా తిట్టుడు మొదలు పెడితే తట్టుకోలేవు కెసిఆర్ అంటూ హెచ్చరికలు చేశారు. నారాయణపేట జిల్లా కోస్గిలో ఏర్పాటు చేసిన సర్పంచ్‌ల సన్మాన సభలో సీఎం మాట్లాడుతూ.. కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. 'రెండేళ్ల తర్వాత కేసీఆర్ బయటకు వచ్చి తోలు తీస్తానంటున్నారు. కేసీఆర్‌వి సోయిలేని మాటలు.. స్థాయిలేని విమర్శలు. గతంలో నన్ను, నా కుటుంబాన్ని ఎన్నో రకాలుగా ఇబ్బందులు పెట్టారు. పగ సాధించడం మెదలుపెడితే రాష్ట్రానికి నష్టం జరుగుతుందని వదిలిపెట్టా. నేను ప్రమాణం చేసినప్పుడే కూలబడ్డారు.. ఇంతకంటే పెద్ద శిక్ష ఇంకేం ఉంటుంది. ఫాంహౌస్‌ను కేసీఆర్ బందీఖానాగా మార్చుకుని చుట్టూ పోలీసులున్నారు. చర్లపల్లికైనా, చంచల్‌గూడ జైలుకు పంపినా అదే పరిస్థితి ఉంటుంది కదా. నన్ను గెలకవద్దు.. మర్యాదగా ఉండదని మాట్లాడటం లేదు. నల్లమల నుంచి వచ్చి జడ్పీటీసీ, ఎమ్మెల్యే, ఎంపీ తర్వాత సీఎం అయ్యా అంటూ ఘాటైన విమర్శలు చేశారు. పాలమూరు రంగారెడ్డి, ఎస్ఎల్‌బిసి వంటి ప్రాజెక్టులను పండబెట్టిన ఘనుడవని విమర్శించారు. స్థిరాస్తి వ్యాపారం దందా చేస్తున్నానని కేసీఆర్ ఆరోపిస్తున్నారు. ఇదేం పాస్‌పోర్టు బ్రోకర్ వ్యవహారం కాదు. దుబాయ్ పంపుతామని ఎవరినీ మోసం చేయలేదు. రియల్ ఎస్టేట్ వ్యాపారంతో రాష్ట్రానికి ఆదాయం వస్తుంది. మరో వైపు.. హైదరాబాద్‌లో స్థిరాస్తి వ్యాపారం పడిపోయిందని కేటీఆర్ చెబుతున్నారు. కక్ష సాధింపు రాజకీయాలు చేయం.. ఎవరి పాపాన వారు పోతారని వదిలేశాం. మైకు ముందుకు రావట్లేదు.. దాక్కున్నానని కేటీఆర్ ఆరోపిస్తున్నారు. నువ్వెంత.. నీ స్థాయి ఎంత? తండ్రి పేరు చెప్పుకొని బతుకుతున్నావు. ఏపీలో చదువుకున్న కేటీఆర్‌కు తెలంగాణ గురించి ఏం తెలుసు? మా ఊరికొస్తావా? మీ ఊరికి రావాలా? ఎవరు భయపడుతున్నారో తెలుస్తుంది. గజ్వేల్‌లో లక్షలాది మంది కార్యకర్తలతో నిరసన చేపడితో పాతాళానికి వెళ్లారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 119 సీట్లు అయితే.. 2/3 వంతు మెజార్టీతో 80కి పైగా సీట్లతో మళ్లీ మేమే అధికారంలోకి వస్తాం. ఒకవేళ 153 సీట్లయితే.. 100కి పైగా స్థానాల్లో విజయం సాధించి రెండో సారి ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు రాసి పెట్టుకోండి.. ఇదే నా సవాల్. నేను రాజకీయం చేసినంత కాలం కాలకూట విషం లాంటి కేసీఆర్ కుటుంబాన్ని అధికారంలోకి రానివ్వను.. ఇదే నా శపథం. కొడంగల్ బిడ్డగా ఈ గడ్డపై నుంచి శపథం చేస్తున్నా. నేను రాజకీయాల్లో ఉన్నంత కాలం... వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ కుటుంబానికి అధికారమనేది కల. భారత రాష్ట్ర సమితి, కేసీఆర్ చరిత్ర ఖతమే. మీ పార్టీకి, మీకు భవిష్యత్తు లేదు. బీఆర్ఎస్, కేసీఆర్ గతమే.. తెలంగాణ భవిష్యత్తు కాంగ్రెస్. గత చరిత్రతో ఒరిగేదేమీ లేదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించాం. పార్లమెంట్ ఎన్నికల్లో గుండు సున్నా ఇచ్చాం. కంటోన్మెంట్‌లో బండకేసి కొట్టాం. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బోరబండలో బండ కింద పాతిపెట్టినం. 12,726 పంచాయతీల్లో 8,335 మంది సర్పంచ్‌లను గెలిపించుకున్నాం. ఇన్ని సార్లు ఓడించినా.. ఇంకా నాదే పైచేయి అంటారా? 2029 అసెంబ్లీ ఎన్నికల్లో తేల్చుకుందాం రండి. ఇప్పటికైనా కేసీఆర్ వయసును గౌరవిస్తాం. ఈనెల 29 నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగబోతున్నాయి. మీరు చెప్పిన అన్ని అంశాలపై చర్చిద్దాం రండి. అసెంబ్లీలో చర్చించకుండా ఫాంహౌస్‌లో నిద్రపోయి.. ఖాళీగా ఉన్నప్పుడు పార్టీ ఆఫీసుకు వచ్చి ప్రెస్‌మీట్‌లు పెట్టడం కాదు. నిజమైన చర్చ అసెంబ్లీలో చేద్దాం.. ఎవరు ఏం మాట్లాడుతున్నారో ప్రజలు వింటారని కేసీఆర్ , ఆయన కుటుంబంపై నిప్పులు చెరిగారు. అత్యంత ఘాటైన పదజాలంతో విరుచుకుపడిన సీఎం, తనను , తన కుటుంబాన్ని గతంలో కేసీఆర్ వేధించారని, జైల్లో పెట్టి ఇబ్బందులకు గురిచేశారని గుర్తు చేసుకున్నారు. ఆయన చేసిన పాపాలే ఆయనను వెంటాడుతున్నాయి. జైల్లో పెట్టి ప్రభుత్వ ఖర్చుతో ఆయనకు తిండి పెట్టడం ఎందుకని నేను ఒక్క కేసు కూడా పెట్టకుండా వదిలేశాను. కానీ ఇప్పుడు సోయి లేకుండా మాట్లాడుతూ తోలు తీస్తా అని స్థాయి లేని మాటలు మాట్లాడుతున్నారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ వ్యాఖ్యలకు ప్రతిసవాల్ విసురుతూ, 'రా.. నీ చింతమడకకు రమ్మంటావా లేక కొడంగల్ వస్తావా? ఎక్కడైనా తేల్చుకుందాం. మటన్ కొట్టు మస్తాన్ దగ్గర పొట్టేలును కోసిన తర్వాత తోలు తీసే పని కేసీఆర్‌కు ఇమ్మని చెప్పాను. సాయంత్రం వెళ్లేటప్పుడు దావత్ కోసం ముక్కో బొక్కో ఇచ్చి పంపమని సూచించాను. నన్ను గెలికితే నేను మాట్లాడటం మొదలుపెడితే నువ్వు ఉరి వేసుకుని చస్తావు. మల్లన్న సాగర్‌లో పడి చావాల్సిందే అని అన్నారు. ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందనే భయంతో సొంత బిడ్డను, అల్లుడిని వెళ్లగొట్టాడని, సొంత చెల్లెలిని పండుగకు కూడా ఇంటికి పిలవలేని వ్యక్తి తన గురించి మాట్లాడటం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. 'పిడకల మూతి బోడిలింగం లాంటి కేటీఆర్, నువ్వు, నీ జాతి అంతా వచ్చినా నేను భయపడను. మీ రాజకీయం ఏంటో చూపిస్తా, రాసి పెట్టుకో' అని సవాల్ విసిరారు. సమావేశంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, మంత్రి వాకిటి పాల్గొన్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# సీఎం ఊరూరా ప్రచారం చేసినా ఫలితం రాలే



**సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు బుద్ధి చెప్పిన ప్రజలు**

**సర్పంచ్‌ల అభినందనలో హరీష్ రావు**

**మెదక్, డిసెంబర్ 24:** సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ దెబ్బకు సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలంటేనే గడగడ వణుకుతున్నడని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన నర్సపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ సర్పంచ్‌లు, వార్డు మెంబర్‌ల సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గెలిచిన వారికి శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. రేవంత్‌రెడ్డిని ఏకిపారేశారు. 'సర్పంచ్ ఎన్నికల్లో గెలిచిన వారికి నా పక్షాన, బీఆర్ఎస్ పార్టీ పక్షాన హృదయపూర్వక శుభాకాంక్షలు, అభినందనలు. ఈ గెలుపు మామూలు గెలుపు కాదు, అద్భుతమైన గెలుపు. ఓటమి భయంతో రేవంత్‌రెడ్డి కాలికి బలపం కట్టుకుని తిరిగినా ఫలితం దక్కలేదు. సాధారణంగా పంచాయతీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి ప్రచారం చేయరు. కానీ ఓడిపోతామనే భయంతో రేవంత్‌రెడ్డి ఊరూరు తిరిగిండు. 'అందిరికీ బతుకమ్మ చీరలు ఇచ్చిన, ఆ చీరలు కట్టుకుని వచ్చి కాంగ్రెపోళ్లకు ఓటేయాలె' చిల్లర మాటలు మాట్లాడిండు. అయినా కూడా కాంగ్రెస్ పార్టీ భంగపడింది. సాధారణంగా పంచాయతీ ఎన్నికల్లో అధికార పార్టీకి 90 శాతం, వీలైతే 100 శాతం విజయాలు దక్కాలి. కానీ కాంగ్రెస్‌కు 64 శాతం ఫలితాలే వచ్చాయి. కాంగ్రెస్ 6 వేల సర్పంచ్ పదవులు గెలిస్తే, బీఆర్ఎస్ 4 వేల సర్పంచ్ పదవులు గెలుచుకుంది' అన్నారు. 'బీఆర్ఎస్ హయాంల 32 జిల్లాపరిషత్‌లు మనమే గెలిచినం. 10 డీసీసీబీలు, 10 డీసీఎంఎస్‌లు ఉంటే వంద శాతం మనమే గెలిచినం. సర్పంచ్ ఎన్నికల్లో 80 నుంచి 90 శాతం మనమే గెలిచినం. కానీ ఇప్పుడు సీన్ రివర్స్ అయ్యింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా 35 నుంచి 40 శాతం బీఆర్ఎస్ సర్పంచ్‌లను గెలిపించింద్రు ప్రజలు. కాంగ్రెసోళ్లు పైసలు పంచి, సారా పంచి, గూండాగురి చేసినా గూడా బీఆర్ఎస్ పార్టీ నుంచి 4 వేల మంది సర్పంచ్‌లుగా గెలువడం మామూలు విషయం కాదు. రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ లేదు సచ్చిపోయింది అంటడు. కానీ నిద్రల గూడా బీఆర్ఎస్ పార్టీ గురించే కలువరిస్తడు. బీఆర్ఎస్ పార్టీ పేరు తీయకుండా, కేసీఆర్ పేరు తీయకుండా ఎప్పుడన్న మాట్లడుతడా రేవంత్‌రెడ్డి..? మల్ల మిదికెల్లి మేకపోతు గాంభీర్యం. ఓసారి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇగ బీఆర్ఎస్ పని అయిపోయింది. ఇక నుంచి ఆ పార్టీ విత్తనం కూడా మొలకెత్తనియ్యను అని శపథం చేసిండు. కానీ ఇప్పుడు రేవంత్‌రెడ్డి గుండెల నుంచి 4 వేల మంది బీఆర్ఎస్ సర్పంచులు మొలకెత్తింద్రు' అని వ్యాఖ్యానించారు. 'నీకు దమ్ముంటే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పెట్టు. కారు గుర్తులేని సర్పంచ్ ఎన్నికలల్లనే 4 వేల మంది గెలిచింద్రు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పెడితే అండ్ల కారు గుర్తు ఉంటది. కారు గుర్తు అంటే కేసీఆర్ గుర్తు. జనం కారు గుర్తు మీద ఓట్లు గుద్దిగుద్ది సంపుతరు నిన్ను ఏమనుకుంటున్నవో. కారు గుర్తు ఉండే ఎన్నికలు పెట్టాలంటే కాంగ్రెస్ పార్టీకి భయం పట్టుకుంది. ఎన్నికలంటేనే రేవంత్‌రెడ్డి గడగడ వణుకుతున్నడు' అని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు.

# రాబోయే స్థానిక ఎన్నికల్లోనూ సత్తా చాటుతాం

**కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే జీవోలు పారదర్శకం**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజినరీ నేత**

**టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమర్ గౌడ్**



**నిజామాబాద్, డిసెంబర్ 24:** రాష్ట్రంలో అత్యధిక కాంగ్రెస్ సర్పంచులు నిజామాబాద్ జిల్లాలోనే గెలుపొందారని.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సత్తా చాటుతామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే జీవోలు పారదర్శకంగా ఉంటాయన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క జీవోను కూడా బహిర్గతం చేయలేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక విజన్ ఉన్న నాయకుడని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమర్ గౌడ్ అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. గ్లోబల్ సమ్మిట్‌లో రూ. 1.70 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులకు ఒప్పందం కుదరడం ఇందుకు ఉదాహరణ అని అన్నారు. ప్రజా ప్రభుత్వం పాలనలో పదేళ్ల విధ్వంసం నుంచి వికాసం దిశగా ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అనవసరంగా విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కేసీఆర్ నోరు జారి మాట్లాడితే తమ ప్రతాపం చూపిస్తామని మందలించారు. ఆయనలా దిగజారి తాము మాట్లాడమని చెప్పుకొచ్చారు. ప్రజలే కేసీఆర్ అండ్ కోకు బుద్ధి చెబుతారని వార్నింగ్ ఇచ్చారు. ప్రజలకు మంచి చేస్తున్న తమ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు విషం కక్కుతున్నారని ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వంలో ప్రతి పైసా ప్రజల కోసమే ఖర్చు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఒక్క రూపాయి కూడా తాము దుర్వినియోగం చేయట్లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని వ్యాఖ్యానించారు. రైతులకు అవసరమైన విద్యుత్తు అందించేందుకు సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులు సాగు చేసిన పంటలకు అవసరమైన నీరు అందించాలంటే విద్యుత్తు ఎంతో అవసరమని వివరించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ప్రజలు ఆశీర్వదించారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ఫామ్‌హౌస్‌లో కూర్చున్న కేసీఆర్ బయటకు వచ్చి విమర్శిస్తున్నారని ఫైర్ అయ్యారు. అసెంబ్లీకి రాని ప్రతిపక్ష నేత నేడు మాయమాటలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చే దమ్ముందా అని సవాల్ విసిరారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా తాము సత్తా చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అన్నదాతల సంక్షేమం కోసం రైతు రుణమాఫీ, రైతు భరోసా, బీమా పథకం అమలు చేస్తున్నామని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు.

# పంచాయతీలకు వెంటనే నిధులు ఇవ్వాలి

**లేకుంటే రాష్ట్ర ప్రభుత్వ మెడలు వంచుతాం**

**కేంద్ర మంత్రి బండి సంజయ్**



**కరీంనగర్,డిసెంబర్24:** గ్రామ పంచాయతీలకు నెలరోజుల్లోగా నిధులు విడుదల చేయాలని.. లేకుంటే రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచుతామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హెచ్చరించారు. రెండేళ్లుగా రాష్ట్రంలోని పంచాయతీలకు నిధులు ఇవ్వలేదంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన మండిపడ్డారు. బుధవారం కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. పంచాయితీలకు ఇచ్చిన నిధులన్నీ కేంద్రానివే అని స్పష్టం చేశారు. పంచాయతీలకు ఇచ్చిన నిధులపై శ్వేత పత్రం విడుదల చేయాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ రాకముందే.. నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఆయన సూచించారు. ఇటీవల తెలంగాణలో మూడు విడతలుగా గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక గ్రామ పంచాయతీలను గెలుచుకుంది. గ్రామ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు.. మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అయితే ఈ పంచాయతీలకు వెంటనే నిధులు విడుదల చేయాలంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్.. రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదీకాక.. రాష్ట్రవ్యాప్తంగా ఎంపీపీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించేందుకు సర్కార్ కసరత్తు చేస్తుంది. వీటిని సంక్రాంతి పండగ వెళ్లిన తర్వాత చేపట్టాలని భావిస్తుంది. ఒకవేళ ఈ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడితే.. ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. ఇది నిధుల విడుదలకు అడ్డంకిగా మారుతోంది. ఈ నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# ఇన్సూరెన్స్ డబ్బుల కోసం భర్త హత్య

**వీరన్న హత్య కేసులో అసలుగుట్టు రట్టు**




**మహబూబాబాద్,డిసెంబర్24:** జిల్లాలో కేసముద్రం మండలం బోడమంచ్యా తండాలో వీరన్న అనే వ్యక్తి దారుణ హత్యలో అసలు దోషి భార్యే అని తేలింది. ఆమె హత్య చేసినట్లు గుర్తించారు. వీరన్న హత్యకు గురవడం తీవ్ర కలకలం సృష్టించింది. ఈ హత్యలో అసలు నిజాలు వెలుగులోకి వచ్చాయి. ప్రియుడితో కలిసి భార్య విజయే భర్తను హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. భర్తను హత్య చేసి ఆపై ప్రమాదంగా చిత్రీకరించేందుకు యత్నించారు. అయితే మృతుడి పేరుపై ముందే రూ. 10 లక్షలు ఇన్సూరెన్స్ చేయించారు భార్య విజయ, ఆమె ప్రియుడు ఆర్ఎంపి డాక్టర్ భరత్. ఈ కారణంగానే భర్తను దారుణంగా హత్య చేసినట్లు విచారణలో పోలీసులు తేల్చారు. మరోవైపు వీరన్న హత్యతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మృతుడి బంధువులు గ్రామంలో ఆందోళనకు దిగారు. వీరన్న హత్యకు కారకుడైన ఆర్ఎంపీ వైద్యుడు భరత్‌కు చెందిన రేకుల షెడ్డును ధ్వంసం చేశారు. అంతేకాకుండా ఓ బైక్‌ను కూడా మృతుడి బంధువులు దహనం చేశారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు గ్రామంలోకి చేరుకుని వారికి నచ్చజెప్పేందుకు ప్రయత్నిస్తున్న పరిస్థితి. తమకు న్యాయం కావాలంటూ వీరన్న బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లాలో చిరుత సంచారం

**అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక**

**రాజన్న సిరిసిల్ల,డిసెంబర్24:** తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో చిరుతల సంచారం తీవ్ర కలకలం రేపుతోంది. ప్రధానంగా కామారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లోని కొన్ని గ్రామాల్లో తరచుగా చిరుత సంచరిస్తుండంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. చిరుత సంచిరిస్తున్న గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాల్లోకి వెళ్లాలన్నా, రాత్రుళ్లు ఇళ్లలో నుంచి బయటకు వెళ్లాలంటేనే స్థానిక ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. చిరుత ఎప్పుడు, ఎక్కడి నుంచి వస్తుందో తెలియక ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకున్న బిక్కుబిక్కుమంటూ ప్రజలు గడుపుతున్నారు. తాజాగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో చిరుత సంచారంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. జిల్లాలోని రుద్రంగి మండల కేంద్రంలోని శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయ పరిసర ప్రాంతాల్లో చిరుత సంచరిస్తున్నట్లు గ్రామస్తులు గుర్తించారు. రాత్రి ఓ బండపై ఉన్న చిరుతను అటువైపు వెళ్తున్న కొందరు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు.



# మేడారం మహాజాతరకు ముమ్మరంగా ఏర్పాట్లు

**గద్దెలపై కొలువుదీరిన పగిడిద్దరాజు, గోవిందరాజులు**

**సంప్రదాయ గిరిజన పద్దతిలో పూజల నిర్వహణ**

**కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్క, అధికారులు**

**ములుగు,డిసెంబర్24:** మేడారం మహాజాతర కోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో గద్దెలపై పగిడిద్దరాజు, గోవిందరాజులు కొలువుదీరారు. ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం గోవిందరాజును బుధవారం ఉదయం 6 గంటలకు, పగిడిద్దరాజును 9.45 గంటలకు పూజారులు ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, జాతర కార్యనిర్వహణాధికారి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులను గద్దెల ప్రాంగణంలోకి రానివ్వకుండా భద్రత ఏర్పాట్లు చేపట్టారు. సమ్మక్క సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు పూజారులు కుటుంబాలతోపాటు హాజరై పూజా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. మేడారం జాతర వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు జరుగనుంది. దీనికి తెలంగాణతోపాటు చుట్టుపక్కల ఉండే రాష్ట్రాలనుంచి కోటి మందికిపైగా భక్తులు తరలి వస్తారని అంచనా. ఈ సారిగా నూతనంగా నిర్మించిన గద్దెలపై సమ్మక్క, సారలమ్మతోపాటు పగిడిద్ద రాజు, గోవిందరాజులను కొలువుదీర్చుతున్నారు. జాతర ప్రాంగణాన్ని చారిత్రక కట్టడాల మాదిరిగా పటిష్ఠంగా ఉండేలా రాతితో పునర్నిర్మిస్తున్నారు. 46 పిల్లర్లతో 271 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ ప్రాకారం ఉండనుంది. దాని మధ్య 40 అడుగుల వెడల్పుతో మూడు, 30 అడుగుల వెడల్పుతో ఐదు స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తున్నారు. గద్దెల ప్రాంగణానికి ఎదుట 50 అడుగుల వెడల్పు ప్రధాన స్వాగత తోరణం ఉంటుంది. పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెలను సమ్మక్క-సారలమ్మ గద్దెలు ఉండే వరుసలోకి మార్చారు. ఈ ఏర్పాటు ద్వారా భక్తులంతా ఒక వరుసలో దర్శనానికి వెళ్లేందుకు వీలు కలుగనుంది. వృత్తాకారంలో ఉండే గద్దెల చుట్టూ 8 స్తంభాలు ఉంటాయి. వాటి మధ్యలో వెదురు బొంగులతో డెకరేషన్ చేస్తారు.

# గుజరాత్ నుంచి తీసుకు వచ్చి పిల్లల విక్రయం

**20మంది ముఠా సభ్యులను పట్టుకున్నాం**

**మాదాపూర్ డీసీపీ రితు రాజ్ వెల్లడి**

**హైదరాబాద్,డిసెంబర్24:** చిన్నారుల అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముఠాను మాదాపూర్ ఎస్‌వోటీ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలను మాదాపూర్ డీసీపీ రితు రాజ్ మీడియా సమావేశంలో వెల్లడించారు. గుజరాత్ నుంచి చిన్నారులను తీసుకొచ్చి హైదరాబాద్, మంచిర్యాలలో విక్రయించారు. దాదాపు 20 మంది ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నాం. ముఠాలో సృష్టి ఫెర్టిలిటీ కేసుకు సంబంధించిన నిందితులు ఉన్నట్టు గుర్తించాం. సృష్టి కేసులో బెయిల్‌పై వచ్చి చిన్నారులను విక్రయిస్తున్నారు. ఒక్కో చిన్నారిని రూ. 4లక్షల నుంచి రూ. 5 లక్షలకు విక్రయిస్తున్నట్టు దర్యాప్తులో తేలిందని డీసీపీ తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పిల్లలను తెచ్చి అమ్ముతున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. హైదరాబాద్‌లో దాదాపు 15 మంది పిల్లలను అమ్మిన ముఠాను సైబరాబాద్ ఎస్వోటీ పోలీసులు పట్టుకున్నారు. పక్కా ప్రణాళికతో శిశువులను విక్రయిస్తున్న 12 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరంతా నగరంలోని ఎనిమిది ఆస్పత్రులకు ఏజెంట్లగా పనిచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ముఠా నుంచి ఇద్దరు బాలలను ఎస్వోటీ పోలీసులు కాపాడారు. అంతే కాకుండా ఒక్కొక్క శిశువు అమ్మకం వెనకాల 15 లక్షల రూపాయల లావాదేవీలు జరిగినట్లు పోలీసుల విచారణలో బయటపడింది.

# ఏఐ సాయంతో హైటెక్ కాపీయంగ్

**ఎట్టకేలకు పట్టుబడ్డ ఇద్దరు యువకులు**

**ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన**

**హైదరాబాద్,డిసెంబర్24:** ఎఐ సాయంతో నకలు కొట్టబోయి దొరికిన ఓ యువకుడి వ్యవహారం ఆలస్యంగా వెలుగుచూసింది. గతంలో నేరుగా చిట్టీలతో కాపీ కొట్టేవారు. ఇప్పుడు ఎఐ వచ్చింది. ఈ ఎఐ టెక్నాలజీని వాడి పరీక్షల్లో కాపీ కొట్టేద్దామనుకున్న ఇద్దరు యువకులను అధికారులు గుర్తించారు. ఈ ఘటన గత ఆదివారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జరిగింది. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నాన్-టీచింగ్ విభాగంలో జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్ ఉద్యోగ నియామకాల కోసం ఇటీవల నోటిఫికేషన్ విడుదలయ్యింది. ఈ మేరకు ఈ నెల 21వ తేదీన ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు యూనివర్సిటీ క్యాంపస్‌లో రాత పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు హర్యానాకి చెందిన అనిల్ (30) హాజరయ్యాడు. పరీక్ష రాస్తున్న సమయంలో అతని చెవిలో ఉన్న బ్లూటూత్ డివైస్ నుంచి పదేపదే బీప్ సౌండ్ రావడంతో ఇన్విజిలేటర్ కు అనుమానం వచ్చి వెంటనే ఆ యువకుడిని తనిఖీ చేశారు. ఆ సోదాలో అనిల్ షర్ట్‌కు అమర్చిన స్కానర్ డివైస్ బయటపడింది. అనిల్ క్వశ్చన్ పేపర్‌ను ఆ స్కానర్ ద్వారా స్కాన్ చేసి, బాత్‌రూంకు వెళ్లి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో సమాధానాలు తెలుసుకుని, చెవిలో ఉన్న బ్లూటూత్ ద్వారా వాటిని వింటూ జవాబులు రాస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ ఘటనతో అప్రమత్తమైన యూనివర్సిటీ అధికారులు పరీక్ష హాలులోని ఇతర అభ్యర్థులను కూడా నిశితంగా పరిశీలించారు. సోదాలు చేశారు. ఈ క్రమంలోనే హర్యానాకు చెందిన మరో యువకుడు సతీష్ కూడా ఇదే తరహాలో హైటెక్ పద్ధతిలో కాపీ చేస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్న వర్సిటీ అధికారులు, వారిని గచ్చిబౌలి పోలీసులకు అప్పగించారు. హెచ్‌సీయూ రిజిస్ట్రార్ దేవేష్ నిగమ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేసిన పోలీసులు? అనంతరం రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనతో ఉద్యోగ పరీక్షల్లో హైటెక్ కాపీయింగ్ ముప్పు మరోసారి వెలుగుచూసింది. ఆధునిక సాంకేతికతను అక్రమ మార్గాల్లో వినియోగిస్తూ పరీక్షల విశ్వసనీయతను దెబ్బతీస్తున్న ఘటనలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని విద్యా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# నాడు ఆశా వర్కర్.. నేడు సర్పంచ్



### ఉద్యోగానికి రాజీనామా చేసి.. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ

### కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థిపై 176 ఓట్ల మెజార్టీతో గెలుపు

### పోరెడ్డిపల్లి సర్పంచ్‌గా దబ్బేట రజిత

**కోహెడ, డిసెంబర్ 24 (మనసులో మాట):**

నిన్నటి వరకు ఆశా వర్కర్‌గా ప్రజల ఆరోగ్య బాగోగులు చూసిన ఆమె.. నేడు సర్పంచ్‌గా గ్రామాభివృద్ధి బాధ్యతలు చేపట్టారు. కోహెడ మండలం పోరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దబ్బేట రజిత ఆశా వర్కర్ ఉద్యోగానికి రాజీనామా చేసి, సర్పంచ్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఘన విజయం సాధించారు. పోరెడ్డిపల్లి సర్పంచ్ స్థానం ఎస్సీ మహిళకు రిజర్వ్ కావడంతో, గ్రామానికి సేవ చేయాలన్న సంకల్పంతో రజిత తన ఆశా వర్కర్ ఉద్యోగాన్ని వదులుకున్నారు. ప్రజలతో ఉన్న మమేకం, మంచి సంబంధాలతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగారు. ప్రధాన పార్టీ అయిన కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థిపై పోటీ చేసి 176 ఓట్ల మెజార్టీతో గెలుపొంది సంచలనం సృష్టించారు. ఈ సందర్భంగా రజిత మాట్లాడుతూ.. తనను నమ్మి గెలిపించిన గ్రామ ప్రజలకు, మహిళలకు, యువకులకు, తనకు సహకరించిన కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# ఎర్దనూర్ సర్పంచ్‌కు అరుదైన గౌరవం

### ఘనంగా సన్మానించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య



**సంగారెడ్డి, డిసెంబర్ 24 (మనసులో మాట):**

సంగారెడ్డి జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య చేతుల మీదుగా ఎర్దనూర్ గ్రామ నూతన సర్పంచ్ పంబల జ్యోతి దుర్గా ప్రసాద్ సన్మానం అందుకున్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో చైర్మన్.. సర్పంచ్‌ను శాలువా, పూల బొకేతో ఘనంగా సత్కరించారు. అలాగే జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్, అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్‌లను కూడా ఈ సందర్భంగా మర్యాదపూర్వకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీపీఎఫ్ శంకర్, రవీందర్, సదానంద్, ఏపీఎం వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



# నంగునూర్ సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా సంతోష్ రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక

### హరీష్ రావు సారథ్యంలో గ్రామాభివృద్ధే లక్ష్యం

### కాంగ్రెస్ పాలనలో పల్లెలు అపరిశుభ్రం: నూతన అధ్యక్షుడు

**నంగునూరు, డిసెంబర్ 24 (మనసులో మాట):**

నంగునూర్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ రేకులపల్లి సంతోష్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం మండలంలోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచులందరూ సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సంతోష్ రెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి హరీష్ రావు నాయకత్వంలో పల్లెలు పచ్చదనం, పరిశుభ్రతతో రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచాయని గుర్తు చేశారు. కానీ, గత రెండేళ్లుగా కాంగ్రెస్ పాలనలో గ్రామాలు అపరిశుభ్రంగా మారాయని, పారిశుధ్య నిర్వహణ లోపించిందని విమర్శించారు. మాజీ మంత్రి హరీష్ రావు ఆధ్వర్యంలో సర్పంచులం అందరం ఐక్యతతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఇన్‌చార్జి గుండు భూపేష్, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, పార్టీ అధ్యక్షుడు అనగోని లింగం గౌడ్, సీనియర్ నాయకులు వేముల వెంకట్ రెడ్డి, దువ్వల మల్లయ్య, రాగుల సారయ్య, ఎడ్ల సోమిరెడ్డి, కోలా రమేష్, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

**నూతన కార్యవర్గం ఇదే..**

- అధ్యక్షుడు: రేకులపల్లి సంతోష్ రెడ్డి (వెంకటాపూర్)
- ఉపాధ్యక్షుడు: ఓజెలు (పాలమాకుల)
- ప్రధాన కార్యదర్శి: సాయిలు (ఘనపూర్)
- జాయింట్ సెక్రటరీ: శనిగరం స్వాతి బాబు (నర్మెట)
- కోశాధికారి: ఇంగు నరేష్ (గట్ల మల్యాల)



# రియల్ ఎస్టేట్ ప్రచారానికి విద్యార్థులా?

### ఎంఈఓ నాగారం శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలి

### ఎస్ఎఫ్ఐ డిమాండ్ - అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు

**సంగారెడ్డి, డిసెంబర్ 24 (మనసులో మాట):**

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఎటువంటి అనుమతి లేకుండా ప్రైవేట్ రియల్ ఎస్టేట్ కార్యక్రమానికి తీసుకెళ్లిన సిర్గాపూర్ ఎంఈఓ నాగారం శ్రీనివాస్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం ఎస్ఎఫ్ఐ నాయకులు జిల్లా అదనపు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎర్రోళ్ల మహేష్ మాట్లాడుతూ.. నారాయణఖేడ్ డివిజన్ సిర్గాపూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను 'సంపంగి ఫామ్ ల్యాండ్' వారి రియల్ ఎస్టేట్ కార్యక్రమానికి ఎంఈఓ తీసుకెళ్లడం నిబంధనలకు విరుద్ధమని మండిపడ్డారు. ప్రస్తుతం జిల్లాలో చలి తీవ్రత దృష్ట్యా ప్రజలు బయటకు రావద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తుంటే, ఎంఈఓ మాత్రం బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని ఆరోపించారు. రాత్రి 9ఉ10 గంటల వరకు ఎముకలు కొరికే చలిలో విద్యార్థులను ఉంచడం వారి ప్రాణాలతో చెలగాటం ఆడటమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల భద్రతను గాలికి వదిలేసిన ఎంఈఓపై తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్, జిల్లా నాయకులు లక్ష్మణ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

# మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

### నాణ్యమైన చేప పిల్లల పంపిణీ

### మహబూబ్ సాగర్ చెరువులో చేప పిల్లలు విడుదల చేసిన నిర్మలా జగ్గారెడ్డి, మెట్టు సాయికుమార్

### కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మత్స్యకారులకు న్యాయం



**సంగారెడ్డి, డిసెంబర్ 24 (మనసులో మాట):**

మత్స్యకారుల సంక్షేమం, వారి ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. బుధవారం సంగారెడ్డి పట్టణంలోని మహబూబ్ సాగర్ చెరువులో వారు చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో లెక్కాపత్రం లేకుండా నాసిరకం చేప పిల్లలను వదిలేవారని, కానీ తమ ప్రభుత్వం నాణ్యమైన చేప విత్తనాలను మాత్రమే సరఫరా చేస్తోందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి నాయకత్వంలో మత్స్యకారుల కోసం మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేయబోతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులతో పాటు కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, మత్స్య సహకార సొసైటీ అధ్యక్షుడు నగేష్, చిదంబర సాయి, రాజేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# బస్వాపూర్ నూతన పాలకవర్గానికి ఘన సన్మానం

### గీతాంజలి స్కూల్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు



**కోహెడ, డిసెంబర్ 24 (మనసులో మాట):**

కోహెడ మండలం బస్వాపూర్ గ్రామంలో ఇటీవల ఎన్నికైన నూతన పాలకవర్గాన్ని గీతాంజలి ప్రైమరీ స్కూల్ యాజమాన్యం ఘనంగా సన్మానించింది. మంగళవారం పాఠశాల ఆవరణలో క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శాలిని కుమారి, డైరెక్టర్ తాటిపాము శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో.. గ్రామ నూతన సర్పంచ్ బానోత్ లింగం, ఉప సర్పంచ్ తాటిపాముల ప్రవీణ్, వార్డు సభ్యులను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలుపుతూ, విద్యార్థులతో కలిసి క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కోహెడ మార్కెట్ డైరెక్టర్ బిజుగా యాదగిరి, నాయకులు నరేష్, రంజిత్, కనుకయ్య, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రేమ, శాంతికి నిదర్శనం క్రిస్మస్

### యేసు బోధనలు అందరికీ స్ఫూర్తిదాయకం

### క్రైస్తవ సోదరులకు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ శుభాకాంక్షలు



**సంగారెడ్డి, డిసెంబర్ 24 (మనసులో మాట):**

క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని సంగారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ నియోజకవర్గంలోని క్రైస్తవ సోదరసోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రిస్మస్ పండుగ ప్రేమ, శాంతి, కరుణ, సేవా నిరతికి ప్రతీక అని అన్నారు. యేసుక్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరి జీవితానికి స్ఫూర్తిగా నిలవాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఐక్యతతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ పండుగ అందరి జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, సిరిసంపదలను తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురు క్రైస్తవ మత పెద్దలు, నాయకులు ఎమ్మెల్యేను కలిసి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

# పన్ను వసూళ్లు వంద శాతం పూర్తి కావాలి

### అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

### ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి

### లాంగ్ స్టాండింగ్ ఉద్యోగులకు స్థానచలనం

### బోధన్‌లో అధికారుల సమీక్ష

### గైర్హాజరైన వారిపై సీరియస్ అయిన కలెక్టర్



**నిజామాబాద్, డిసెంబర్ 24:** పల్లెల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులదే కీలక పాత్ర అని, విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే పి. సుదర్శన్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం బోధన్ పట్టణంలోని లయన్స్ భవన్‌లో నియోజకవర్గ స్థాయి పంచాయతీ కార్యదర్శుల పనితీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, సబ్ కలెక్టర్ వికాస్ మహతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం పల్లెల సర్వతోముఖాభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే నిధులు ముఖ్యమని, అందుకే పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మార్చి నెలాఖరు నాటికి ప్రతి గ్రామంలో 100 శాతం పన్ను వసూళ్లు పూర్తి కావాలని టార్గెట్ విధించారు. సుదీర్ఘ కాలంగా పన్నులు కట్టని వారికి నోటీసులు ఇచ్చి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. వసూళ్లలో వెనుకబడిన కార్యదర్శులకు వివరణ కోరుతూ నోటీసులు ఇవ్వాలని డీపీఓను ఆదేశించారు. ఒకేచోట సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న కార్యదర్శులకు స్థానచలనం కల్పిస్తూ, పారదర్శకంగా బదిలీలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యదర్శులు స్థానికంగా అందుబాటులో ఉంటూ, ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం, వీధి దీపాలు, తాగునీరు, మురుగు కాల్వల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, పల్లెల్లో స్పష్టమైన మార్పు కనిపించేలా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ముందస్తు అనుమతి లేకుండా సమీక్షకు గైర్హాజరైన కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని డీపీఓను ఆదేశించారు. వసూలు చేసిన పన్ను వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. తాను స్వయంగా పన్ను వసూళ్ల ప్రగతిని సమీక్షిస్తానని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# రాపిడో డ్రైవర్ ముసుగులో దొంగతనం

**మహిళపై కత్తితో దాడి**

**పుస్తెలతాడు లాక్కెళ్లిన నిందితుడు**

**24 గంటల్లోనే అరెస్ట్**

**సంగారెడ్డి జిల్లా మామిడిపల్లిలో ఘటన**



**సంగారెడ్డి, డిసెంబర్ 24 (మనసులో మాట):**

జల్సాలకు బానిసై, అప్పుల బాధతో ఓ రాపిడో డ్రైవర్ కిరాతకుడిగా మారాడు. ఒంటరి మహిళపై కత్తితో దాడి చేసి మెడలోని పుస్తెలతాడును ఎత్తుకెళ్లిన ఘటన సంగారెడ్డి జిల్లాలో కలకలం రేపింది. ఈ కేసులో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి 24 గంటల్లోనే నిందితుడిని అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే: కంది మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన మ్యాతరి జగన్ (37) రాపిడో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడటంతో అప్పులు పెరిగిపోయాయి. వాటిని తీర్చుకునేందుకు నేర మార్గాన్ని ఎంచుకున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 22న మామిడిపల్లిలో ఓ మహిళను గమనించిన జగన్, ఆమెను కత్తితో బెదిరించి, దాడి చేసి మెడలోని 4 తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు డీఎస్పీ సత్తయ్య గౌడ్ నేతృత్వంలో పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు చేపట్టి, కేవలం 24 గంటల్లోపే నిందితుడు జగన్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి చోరీ సొత్తు, దాడికి వాడిన కత్తి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

# గుడిలో దొంగతనానికి యత్నం

**అడ్డంగా దొరికిన పాత నేరస్తుడు**

**బక్రిచెప్యాల పెద్దమ్మ గుడిలో ఘటన..**

**పట్టుకున్న గ్రామస్తులు**

**గతంలోనూ పలు ఆలయాల్లో చోరీలు**

**10 నెలలు జైలు జీవితం**

**నిందితుడి నుంచి బైక్, సెల్ ఫోన్ స్వాధీనం**



**సిద్దిపేట, డిసెంబర్ 24 (మనసులో మాట):**

జల్సాలకు అలవాటు పడి వరుసగా ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఓ పాత నేరస్తుడు మరోసారి దొంగతనానికి యత్నిస్తూ గ్రామస్తులకు పట్టుబడ్డాడు. ఈ ఘటన సిద్దిపేట రూరల్ పరిధిలోని బక్రిచెప్యాల గ్రామ శివారులో చోటుచేసుకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం తెట్టేకుంట అగ్రహారానికి చెందిన వల్లెపు పర్శరాములు (22) ప్రస్తుతం సిద్దిపేట ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్నాడు. కూలి పనులు చేసుకునే ఇతడు సులభంగా డబ్బు సంపాదించేందుకు దొంగతనాలు ఎంచుకున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 23న సాయంత్రం తన భార్యతో కలిసి బక్రిచెప్యాల శివారులోని పెద్దమ్మ గుడికి వెళ్లాడు. వెంట తెచ్చుకున్న ఇనుప రాడ్‌తో గుడి తలుపులు పగులగొట్టి లోపలికి ప్రవేశించి, హుండీని పగలగొట్టే ప్రయత్నం చేస్తుండగా గ్రామస్తులు గమనించి పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల విచారణలో పర్శరాములు పాత నేరస్తుడని తేలింది. గతంలో ఇతడు చందుర్తి, హుస్నాబాద్, కోడిమ్యాల, వేములవాడ, తంగళ్ళపల్లి, ఇల్లంతకుంట, బోయినిపల్లి, గంగాధర, తిమ్మాపూర్ (ఎల్ఎండీ) పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడ్డాడు. ఈ కేసుల్లో కరీంనగర్ జైలులో సుమారు 10 నెలల పాటు శిక్ష కూడా అనుభవించాడు. నిందితుడి నుంచి దొంగతనానికి వాడిన ఇనుప రాడ్, ఒక మొబైల్ ఫోన్‌తో పాటు.. గతంలో సిద్దిపేట వన్ టౌన్ పరిధిలో చోరీ చేసిన ఫ్యాషన్ ప్రో బైక్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై బిఎన్ఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిద్దిపేట త్రీ టౌన్ పోలీసులు తెలిపారు. ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.


# రాష్ట్ర ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు

**మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

**హైదరాబాద్, డిసెంబర్ 24:** క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా క్రైస్తవ సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు బోధనలు ప్రేమ, శాంతి, త్యాగం, సేవా భావాన్ని గుర్తుచేస్తాయని అన్నారు. క్రిస్మస్ పండుగ సమాజంలో మానవత్వాన్ని, పరస్పర గౌరవాన్ని మరింత బలోపేతం చేస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ పవిత్ర పర్వదినాన ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం, సుఖశాంతులు వెల్లివిరియాలని మంత్రి ఆకాంక్షించారు.

# పదో తరగతి ఫలితాల్లో సిద్దిపేట 'నెంబర్ వన్' కావాలి

## చదువు మాత్రమే ప్రపంచంలో హాని లేని వ్యసనం



- పేదరికాన్ని జయించే ఆయుధం
- టీవీలు, సెల్‌ఫోన్లు బంద్
- ఈ మూడు నెలలు చదువుకే అంకితం
- విద్యార్థుల తల్లిదండ్రులకు ఎమ్మెల్యే హరీష్ రావు ఆత్మీయ లేఖ

**సిద్దిపేట, డిసెంబర్ 24 (మనసులో మాట):**

"అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలుస్తున్న సిద్దిపేట.. చదువులోనూ రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలవాలి. వచ్చే మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షల్లో మన పిల్లలు ప్రభంజనం సృష్టించాలి" అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ఆకాంక్షించారు. వార్షిక పరీక్షల సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో, నియోజకవర్గంలోని పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు ఆయన ఒక ఆత్మీయ లేఖ రాశారు. అందులో విద్యార్థుల భవిష్యత్తు కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తల్లిదండ్రుల బాధ్యతలను సవివరంగా ప్రస్తావించారు.

### చదువే తలరాతను మారుస్తుంది

లేఖలో హరీష్ రావు భావోద్వేగంగా స్పందించారు. "ప్రపంచంలో ఎలాంటి హానీ కలిగించని ఏకైక వ్యసనం చదువు మాత్రమే. మనం ఎంత ఎక్కువ చదివితే అంత మంచి భవిష్యత్తు మన సొంతమవుతుంది. నిరుపేద కుటుంబాల్లో పుట్టి, దేశాలను పాలించే స్థాయికి ఎదిగిన మహనీయులందరూ చదువునే ఆయుధంగా మార్చుకున్నవారే. ప్రణాళికాబద్ధమైన చదువు మన తలరాతనే మార్చే శక్తి కలిగి ఉంది" అని విద్యార్థులకు స్ఫూర్తినిచ్చారు.


### ఈ జాగ్రత్తలు తప్పనిసరి

పదో తరగతి అనేది విద్యార్థి జీవితంలో అత్యంత కీలకమైన మలుపు అని, ఈ సమయంలో తల్లిదండ్రుల పర్యవేక్షణ అత్యవసరమని హరీష్ రావు సూచించారు. పరీక్షలు పూర్తయ్యే వరకు పిల్లలను టీవీలు, సెల్ ఫోన్లకు పూర్తిగా దూరంగా ఉంచాలి. వినోదాలకు దూరం: విందులు, వినోదాలు, శుభకార్యాలు, సినిమాలకు పిల్లలను తీసుకెళ్లకూడదు. ఇంటి పనులు గానీ, వ్యవసాయ పనులు గానీ చెప్పకుండా.. వారి సమయం మొత్తం చదువుకే కేటాయించేలా చూడాలి. చదువుతో పాటు విద్యార్థుల చేతిరాత బాగుండేలా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలి.

### ట్రిపుల్ ఐటీ రికార్డు కొనసాగాలి

సిద్దిపేట విద్యార్థులు గతేడాది అద్భుత ఫలితాలు సాధించారని హరీష్ రావు గుర్తు చేశారు. "గత ఏడాది బాసర ట్రిపుల్ ఐటీ లో సిద్దిపేట నియోజకవర్గానికి చెందిన 169 మంది విద్యార్థులు సీట్లు సాధించడం మనందరికీ గర్వకారణం. అక్కడ సీటు వస్తే ఉచిత ఇంజినీరింగ్ విద్యతో పాటు బంగారు భవిష్యత్తు లభిస్తుంది. ఈ ఏడాది కూడా అదే స్ఫూర్తితో చదివి మన పిల్లలు రికార్డు సృష్టించాలి" అని పిలుపునిచ్చారు.

### వసతుల కల్పనలో వెనక్కి తగ్గం:




విద్యార్థుల కోసం ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు, విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నాం. జిల్లా విద్యాధికారి, ప్రధానోపాధ్యాయులతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నాం. డిజిటల్ క్లాస్‌రూములు, మోడల్ టాయిలెట్లు, డిజిటల్ కంటెంట్ పుస్తకాలు అందుబాటులో ఉంచాం. చివరగా.. "ప్రజాప్రతినిధిగా మాత్రమే కాకుండా, మీ కుటుంబ సభ్యుడిగా ఈ లేఖ రాస్తున్నా. మీ బిడ్డల ఉజ్వల భవిష్యత్తు కోసం ఈ మూడు నెలలు అత్యంత కీలకం. నా తపనను అర్థం చేసుకుని, మీ పిల్లలను ఉన్నతమైన దారిలో నడిపిస్తారని ఆశిస్తున్నా" అని హరీష్ రావు లేఖను ముగించారు.

# సజ్జాపూర్ ఘటనపై సీరియస్

**బాధితులకు అండగా ఉంటాం - ఈ నెల 30న గ్రామంలో 'సివిల్ రైట్స్ డే' నిర్వహించాలి**

**కుల వివక్షను సహించేది లేదు -నిందితులపై కఠిన చర్యలు తప్పవు**

**ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**



**కోహీర్, డిసెంబర్ 24:** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం సజ్జాపూర్ గ్రామంలో ఇటీవల దళిత కుటుంబంపై దాడి, షెడ్డు కూల్చివేత ఘటనపై రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సీరియస్ అయ్యింది. బుధవారం కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులు రాంబాబు గ్రామాన్ని సందర్శించి సమగ్ర విచారణ చేపట్టారు. బాధితుడు బేగరి రాములును పరామర్శించి, కమిషన్ పూర్తి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ఈ ఘటనను అగ్రవర్ణాల దాడిగానే పరిగణిస్తున్నామన్నారు. ఇప్పటికే ఆరుగురిపై కేసులు నమోదయ్యాయని పోలీసులు తెలిపారని, నిందితులకు చట్టప్రకారం శిక్ష పడేలా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను, జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గ్రామంలో పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. గ్రామంలో సామాజిక సమానత్వం, సోదరభావం పెంపొందించేందుకు ఈ నెల 30న సజ్జాపూర్‌లో అధికారికంగా 'సివిల్ రైట్స్ డే' నిర్వహించాలని జిల్లా యంత్రాంగాన్ని చైర్మన్ ఆదేశించారు. పౌర హక్కుల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అంతకుముందు కోహీర్ మండలంలోని బాలుర, బాలికల సంక్షేమ హాస్టళ్లను చైర్మన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందుతోందా అని ఆరా తీశారు. భద్రత దృష్ట్యా హాస్టళ్లకు కాంపౌండ్ వాల్ నిర్మించాలని అధికారులను ఆదేశించారు. పదో తరగతిలో జిల్లా 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులు చదవాలని ప్రోత్సహించారు. అనంతరం కోహీర్ సిద్ధి వినాయక ఆలయంలో చైర్మన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ, ఇంచార్జ్ డీపీఓ జానకిరెడ్డి, ఏఎస్డబ్ల్యూఓ శ్రీనివాస్, రెవెన్యూ, పోలీస్ అధికారులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# చేగుంటకు డిగ్రీ కళాశాల.. త్వరలో పెన్షన్ల పెంపు

**వచ్చే ఏడాది నియోజకవర్గానికి మరో 3,500 ఇళ్లు: మంత్రి వివేక్ వెంకటస్వామి - కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ**




**మెదక్, డిసెంబర్ 24:** ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, విద్య ద్వారానే మనిషి జీవితంలో సమూల మార్పులు సాధ్యమవుతాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. మంగళవారం మెదక్ జిల్లా చేగుంట మండలంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, కలెక్టర్ రాహుల్ రాజ్‌తో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 38 మంది లబ్ధిదారులకు రూ. 38,04,408 విలువైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చేగుంట మండలానికి డిగ్రీ కళాశాల మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే చేగుంట గ్రామ పంచాయతీకి నూతన భవనం నిర్మిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 17 లక్షల ఇళ్లు నిర్మించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, వచ్చే ఏడాదికి దుబ్బాక నియోజకవర్గానికి మరో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మంజూరైన ఇళ్లను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. గత విద్యాసంవత్సరంలో 50 వేల మంది టీచర్లను భర్తీ చేశామని, సన్నబియ్యం, ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డుల ప్రక్రియ వేగంగా జరుగుతోందన్నారు. పింఛన్ల పెంపు విషయమై నిన్ననే ముఖ్యమంత్రితో సమావేశం జరిగిందని, త్వరలోనే పెంపు ప్రక్రియ ప్రారంభమవుతుందని మంత్రి వెల్లడించారు. ఎమ్మెల్యే దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పల్లెలు, తండాల్లో రోడ్లు దెబ్బతిన్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంట్, మంచినీటి సమస్యలు, అంగన్‌వాడీల ఇబ్బందులు ఉన్నాయని, దుబ్బాక నియోజకవర్గంపై ప్రత్యేక సమీక్ష సమావేశం ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. అలాగే సర్పంచులు నిధుల లేమితో ఇబ్బంది పడుతున్నారని, వారికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సర్పంచులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర పాల్గొన్నారు.

# పల్లె ప్రగతే లక్ష్యం కావాలి

- 137 పంచాయతీల్లో 111 చోట్ల మన గెలుపే
- ఇది ప్రజల విశ్వాసానికి నిదర్శనం
- రాజకీయాలు పక్కన పెట్టి.. ప్రజాసేవ చేయాలి
- బాన్సువాడలో నూతన సర్పంచులకు దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే పోచారం

**బాన్సువాడ, డిసెంబర్ 24:** గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆ లక్ష్యాన్ని నిజం చేసే శక్తి సర్పంచులు, వార్డు సభ్యుల చేతుల్లోనే ఉందని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం బాన్సువాడ శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నూతన సర్పంచుల సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. బాన్సువాడ నియోజకవర్గంలోని 137 గ్రామ పంచాయతీలకు గాను, తమ బలపరిచిన అభ్యర్థులు 111 స్థానాల్లో (సర్పంచులు/ఉప సర్పంచులుగా) విజయం సాధించడం గర్వకారణమన్నారు. ఈ గెలుపు ప్రజలు తమపై ఉంచిన విశ్వాసానికి నిదర్శనమని, ఇది కేవలం పదవి మాత్రమే కాదని, ఒక గొప్ప బాధ్యత అని గుర్తుచేశారు. గ్రామ పంచాయతీలు కేవలం పరిపాలనా యూనిట్లు కాదని, అవే ప్రజాస్వామ్యానికి పునాదులని అన్నారు. ప్రజల సమస్యలకు మొదటి పరిష్కార వేదిక సర్పంచే అని తెలిపారు. తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్, పారిశుద్ధ్యం, పాఠశాలలు, అంగన్‌వాడీల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రతి రూపాయి గ్రామానికి ఉపయోగపడేలా ఖర్చు చేయాలని, అవినీతికి తావులేని పారదర్శక పాలన అందించాలని కోరారు. గ్రామంలో గొడవలు కాకుండా గౌరవం పెరిగేలా నడుచుకోవాలని, ఎన్నికల రాజకీయాలు పక్కన పెట్టి ప్రజాసేవకే అంకితం కావాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, నాయకులు పోచారం సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొని నూతన సర్పంచులకు శుభాకాంక్షలు తెలిపారు.



# ఆసుపత్రులు, గురుకులాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు





- పారిశుధ్యం, మెనూ విషయంలో ఆగ్రహం
- సిబ్బందికి హెచ్చరికలు

**గజ్వేల్/జగదేవపూర్, డిసెంబర్ 24 (మనసులో మాట):**

సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి బుధవారం జగదేవపూర్ మండలం తిగుల్ పీహెచ్‌సీతో పాటు గజ్వేల్, ప్రజ్ఞాపూర్‌లోని గురుకుల పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తిగుల్ పీహెచ్‌సీలోఆసుపత్రి రికార్డులు, మరమ్మతు పనులను కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశించారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన సర్పంచ్ రజితను అభినందిస్తూ గ్రామాభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. కాగా, ఆసుపత్రిలో సిబ్బంది కొరతపై సీపీఐ నాయకుడు దయానంద్ రెడ్డి ప్రస్తావించగా.. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కలెక్టర్ బదులివ్వడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజ్ఞాపూర్‌లోని సాంఘిక సంక్షేమ బాలుర, మైనారిటీ బాలికల గురుకులాలను కలెక్టర్ సందర్శించారు. బాలుర గురుకులంలో చెత్తాచెదారం పేరుకుపోవడం, కామన్ డైట్ మెనూ పాటించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపాల్, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు సమయం వృథా చేయకుండా చదువుపై శ్రద్ధ పెట్టాలని, వంట సిబ్బంది నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.

## ఏఐటీయూసీలో చేరిన దౌలాపూర్ హమాలీ కార్మికులు



**జగదేవపూర్, డిసెంబర్ 24(మనసులో మాట):**

జగదేవపూర్ మండలం దౌలాపూర్ గ్రామంలో ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సభ్యులు శివలింగ్ కృష్ణ ఆధ్వర్యంలో పలువురు హమాలీ కార్మికులు ఏఐటీయూసీ కార్మిక సంఘంలో చేరారు. ఈ సందర్భంగా వారికి సభ్యత్వ కార్డులు అందించి సంఘంలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు స్వర్గం రాజేశం, జిల్లా నాయకులు బొడ్ల సాయి, దౌలాపూర్ సర్పంచ్ కుక్కునూరు కృష్ణ, హైకోర్టు న్యాయవాది కుక్కునూరు శ్రీనివాస్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

## హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య



**జగదేవపూర్, డిసెంబర్ 24(మనసులో మాట):**

సరుకు రవాణాలో కీలక పాత్ర పోషిస్తున్న హమాలీ కార్మికుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని, వారికి సమగ్ర బీమా చట్టం అమలు చేయాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. జగదేవపూర్ మండలం అనంతసాగర్ గ్రామంలో నిర్వహించిన హమాలీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్పత్తిదారుల నుంచి వినియోగదారుల వరకు సరుకులు చేరవేయడంలో, ప్రభుత్వానికి వేల కోట్ల ఆదాయం సమకూర్చడంలో హమాలీలది ముఖ్య భూమిక అని అన్నారు. అయితే, వడ్లు, మొక్కజొన్న, పత్తి బస్తాలను ఎత్తడం, దించడం వల్ల ధూళి, బరువు కారణంగా కార్మికులు ఊపిరితిత్తులు, వెన్నుముక వ్యాధుల బారిన పడి త్వరగా వృద్ధాప్య సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పనిలో ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే వారి కుటుంబాలకు ఎలాంటి ఆర్థిక భరోసా లేదని, కాబట్టి ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రత్యేక బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మాసంపల్లి కనకయ్య, యాదయ్య, నరేష్, నవీన్, కిష్టయ్య, బాలరాజు, శ్రీకాంత్, గణేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## మామిడ్యాల సర్పంచ్ పోచయ్యకు ఘన సన్మానం

ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి: ఇందిరమ్మ కమిటీ సభ్యులు

**గజ్వేల్, డిసెంబర్ 24 (మనసులో మాట):**

కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని పనిచేసే నాయకులకు, కార్యకర్తలకు ఎప్పటికైనా తగిన గుర్తింపు ఉంటుందని ఇందిరమ్మ కమిటీ సభ్యులు నల్ల వినోద్ కుమార్ అన్నారు. సిద్దిపేట జిల్లా ములుగు మండలం మామిడ్యాల గ్రామ సర్పంచ్‌గా (కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థి) గెలుపొందిన ఎడ్ల పోచయ్యను మంగళవారం ఘనంగా సన్మానించారు. క్షీరసాగర్ వార్డు సభ్యులు సత్యనారాయణతో కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా, వారి ఐక్యతతో మామిడ్యాలను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని సూచించారు. పారదర్శకమైన పాలన అందిస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నారు. గ్రామంలో మౌలిక వసతులు, సిసి రోడ్లు, తాగునీరు, విద్య, వైద్య రంగాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో సర్పంచ్‌లు కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

## క్రిస్టియన్ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు

కేసీఆర్ హయాంలోనే క్రైస్తవులకు పెద్దపీట: వంటేరు ప్రతాప్ రెడ్డి



**గజ్వేల్, డిసెంబర్ 24(మనసులో మాట):**

క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి ముందస్తుగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో క్రిస్టియన్ సొసైటీ జిల్లా అధ్యక్షులు మోసెస్, మండల అధ్యక్షుడు రాజులతో కలిసి ఆయన కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వంటేరు మాట్లాడుతూ.. ఏసు ప్రభువు దయతో ప్రజలందరికీ అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. గత కేసీఆర్ ప్రభుత్వం క్రిస్టియన్ సోదరులకు పెద్దపీట వేసిందని, పండుగ కానుకగా క్రిస్మస్ గిఫ్ట్‌లను అందించి గౌరవించిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, రాష్ట్ర నాయకులు ఖాజా విరాసత్ అలీ, కౌన్సిలర్ గుంటుకు రాజు పాల్గొన్నారు.

## పాలకవర్గాన్ని సన్మానించిన రేషన్ డీలర్లు

రేషన్ డీలర్ సర్పంచ్‌గా గెలవడం గర్వకారణం: సంఘం నేతలు



**జగదేవపూర్, డిసెంబర్ 24 (మనసులో మాట):**

చాలీచాలని కమిషన్లతో పనిచేస్తూనే ప్రజాసేవలో ముందుండే రేషన్ డీలర్లు, సర్పంచ్‌గా ఎన్నికవడం సంతోషకరమని సిద్దిపేట జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి షబానా తబ్సుమ్ అజీజ్, ఉపాధ్యక్షులు చెక్కల రమేష్ అన్నారు. బుధవారం జగదేవపూర్ మండలం తీగుల్ నర్సాపూర్ గ్రామ నూతన సర్పంచ్ ఏలూరి సంధ్యా శ్రీనివాస్, ఉప సర్పంచ్ కంచర్ల స్వామిలను రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాసేవ కోసం అనునిత్యం పరితపించే రేషన్ డీలర్లు, గ్రామానికి ప్రథమ పౌరుడిగా (సర్పంచ్‌గా) ఎన్నికవడం హర్షించదగ్గ విషయమన్నారు. లాభాపేక్ష లేకుండా సమాజ సేవలో సంధ్యా శ్రీనివాస్ ముందుండడం అభినందనీయమని, భవిష్యత్తులో రేషన్ డీలర్లు మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. అంతకుముందు కొండపోచమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగదేవపూర్, గజ్వేల్ మండలాల ప్రధాన కార్యదర్శులు గాండ్ల అన్నపూర్ణ నర్సింలు, చెప్యాల రాజు, కార్యవర్గ సభ్యులు లింగాల పరమేశ్వర్, సయ్యద్ మునీర్, దేవసాని బలరాం, గ్రామస్తులు కనకా రెడ్డి, కనకయ్య, కృష్ణ, కిరణ్ పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి రూ. 50 వేల విరాళం

దమ్మన్నపేట నూతన పాలకవర్గానికి అందజేసిన న్యాయవాది పాదం తిరుపతి



**గొల్లపెల్లి, డిసెంబర్ 24 (మనసులో మాట):**

జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలం దమ్మన్నపేట గ్రామాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తూ న్యాయవాది, బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి పాదం తిరుపతి ఉదారత చాటుకున్నారు. బుధవారం గ్రామంలో నూతన సర్పంచ్‌గా ముదాం గౌతమి జానారెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పాదం తిరుపతి.. తన తల్లిదండ్రులు కీ.శే. పాదం రాజవ్వ-రాజయ్యల జ్ఞాపకార్థం రూ. 50 వేల విరాళాన్ని (చెక్కు రూపంలో) నూతన పాలకవర్గానికి అందజేశారు. గ్రామాభివృద్ధిలో భాగస్వాములవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ కందుకూరి కృష్ణారెడ్డి, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ ఐలయ్య, ఉపసర్పంచ్ మామిడిపల్లి శ్రీమతి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## చిన్నశంకరంపేట సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా మోహన్ నాయక్

ఏకగ్రీవ ఎన్నిక.. ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్ కుమార్

**చిన్నశంకరంపేట, డిసెంబర్ 24 (మనసులో మాట):**

చిన్నశంకరంపేట మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా హలవత్ మోహన్ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం మండల కేంద్రంలోని రాదేశ్యామ్ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాన సత్యనారాయణ, జిల్లా నాయకుడు రాజిరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులందరూ ఏకగ్రీవంగా మోహన్ నాయక్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అలాగే ఫోరం ప్రధాన కార్యదర్శిగా నాయిని ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షురాలిగా (వైస్ ప్రెసిడెంట్) బిమరి రాణి గణేష్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కంచర్ల చంద్రశేఖర్, ఆవుల గోపాల్ రెడ్డి, అశోక్ నాయక్, ప్రియా నాయక్, అనసూయ, ఇతర కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

## మాజీ కౌన్సిలర్ సుభాష్ చంద్రబోస్‌కు జన్మదిన శుభాకాంక్షలు

విష్ చేసిన రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ దేశబోయిని నర్సింలు



**గజ్వేల్, డిసెంబర్ 24 (మనసులో మాట):**

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ సుభాష్ చంద్రబోస్ పుట్టినరోజు సందర్భంగా రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ దేశబోయిని నర్సింలు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కౌన్సిలర్‌గా సుభాష్ ప్రజలకు అందించిన సేవలను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. భవిష్యత్తులో సుభాష్ మరిన్ని ఉన్నత పదవులు అధిష్టించాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని డాక్టర్ నర్సింలు ఆకాంక్షించారు.

## మహాదేవ్ ఇండస్ట్రీస్ రైస్ మిల్లు ప్రారంభం

ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు



**చిన్నశంకరంపేట, డిసెంబర్ 24 (మనసులో మాట):**

చిన్నశంకరంపేట మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహాదేవ్ ఇండస్ట్రీస్ రైస్ మిల్లును కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు బుధవారం ప్రారంభించారు. మాజీ సర్పంచ్ శ్రీమాన్ రెడ్డి, కిషన్ సేఠ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో.. రైస్ మిల్లులో ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్విచ్ ఆన్ చేసి యంత్రాలను ప్రారంభించారు.

## పని చేయడం లేదని మందలించారని..

**పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య**

**ధర్మపురి మండలం ఆరేపల్లిలో విషాదం**



**గొల్లపెల్లి, డిసెంబర్ 24 (మనసులో మాట):**

తల్లిదండ్రులు మందలించారన్న చిన్న కారణంతో క్షణికావేశానికి లోనైన ఓ యువతి, పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన ధర్మపురి మండలం ఆరేపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరేపల్లికి చెందిన నూతి కట్ల రాజన్నకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె నీరజ (20). ఇంటి పనులు చేయడానికి తరచూ మారాం చేసేది. ఈ క్రమంలో ఈ నెల 17న ఇంట్లో ఓ చిన్న పని చెప్పగా ఆమె నిరాకరించింది. దీంతో "ఇలాగే ఏ పనీ చేయకుండా ఉంటావా?" అని తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్థాపానికి గురైన నీరజ, క్షణికావేశంలో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో మృతి చెందింది. మృతురాలి తండ్రి రాజన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ధర్మపురి ఎస్సై మహేష్ తెలిపారు.

## వ్యసనాలకు బానిసై.. భార్యను బలిగొని..

**అత్తమామలకు ఫిర్యాదు చేసేందుకు వెళ్తుండగా దాడి**

**పిడిగుద్దులతో ప్రాణం తీసిన భర్త.. మియాపూర్‌లో దారుణం**



**మియాపూర్, డిసెంబర్ 24 (మనసులో మాట):**

చెడు వ్యసనాలకు బానిసైన ఓ భర్త, తన పద్ధతి మార్చుకోవాలని మందలించిన భార్యను కిరాతకంగా కొట్టి చంపిన విషాద ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. రారాజు తన మేనకోడలైన విజయలక్ష్మిని 14 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు. గత ఎనిమిదేళ్లుగా వీరు మాతృశ్రీనగర్‌లోని గోకుల్ ప్లాట్స్ లో నివాసం ఉంటున్నారు. అయితే, రారాజు ఇటీవల చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. పద్ధతి మార్చుకోవాలని భార్య విజయలక్ష్మి పలుమార్లు కోరినా పెడచెవిన పెట్టాడు. భర్త తీరు మారకపోవడంతో, ఈ విషయాన్ని రారాజు తల్లిదండ్రులకు ఫిర్యాదు చేసేందుకు విజయలక్ష్మి నిర్ణయించుకుంది. ఆమె వారి వద్దకు వెళ్తుండగా రారాజు అడ్డగించాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆగ్రహంతో ఊగిపోయిన రారాజు.. భార్యపై విచక్షణారహితంగా పిడిగుద్దులు కురిపించాడు. దెబ్బలకు తాళలేక ఆమె అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. వెంటనే భర్తే ఆమెను సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. నిందితుడు రారాజును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

**పరామర్శించిన కాంగ్రెస్ మండల అధ్యక్షులు వేముల సుభాష్**



**గొల్లపెల్లి, డిసెంబర్ 24 (మనసులో మాట):**

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడికి కాంగ్రెస్ నేత అండగా నిలిచారు. జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం యశ్వంతరావ్ పేట గ్రామానికి చెందిన చిర్ర సాయి చరణ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న బుగ్గారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల సుభాష్ మంగళవారం సాయి చరణ్‌ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడంతో పాటు, కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని తక్షణ సాయంగా రూ. 5,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బండారి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## చర్చిల్లో క్రిస్మస్ విందు కోసం రూ. 34 లక్షలు

**మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాలకు నిధులు విడుదల**

**100 చర్చిలకు రూ. 30 వేల చొప్పున ఆర్థిక సాయం**

**వివరాలు వెల్లడించిన కలెక్టర్ రాహుల్ రాజ్**

**మెదక్, డిసెంబర్ 24:** క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని క్రైస్తవ సోదరులు ఆనందంగా పండుగ జరుపుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మెదక్ జిల్లాలోని వివిధ చర్చిల్లో విందు (ఫీస్ట్) ఏర్పాటు కోసం మొత్తం రూ. 34 లక్షలను ప్రభుత్వం కేటాయించినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. నిధుల వివరాలివే: బుధవారం ఆయన ఈ విషయమై మాట్లాడుతూ.. మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లోని ప్రధాన వేడుకల నిర్వహణకు ఒక్కో నియోజకవర్గానికి రూ. 2 లక్షల చొప్పున మొత్తం రూ. 4 లక్షలు మంజూరు చేశామన్నారు. అలాగే, జిల్లాలోని రెండు నియోజకవర్గాల పరిధిలో ఎంపిక చేసిన 100 చర్చిలకు.. ఒక్కో చర్చికి రూ. 30 వేల చొప్పున మొత్తం రూ. 30 లక్షలు విడుదల చేసినట్లు వివరించారు. ఇప్పటికే ఈ నిధులను సంబంధిత చర్చిలకు అందజేశామని తెలిపారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- మహిళా సంక్షేమానికి పెద్దపీట
- ధర్మపురిలో ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేసిన మంత్రి అడ్లూరి



**ధర్మపురి, డిసెంబర్ 24(మనసులో మాట):**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తోందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గతంలో 104 మందికి, తాజాగా మరో 68 మంది లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, 'ఇందిర మహిళా శక్తి' ద్వారా మహిళలను పారిశ్రామికవేత్తలుగా మారుస్తోందని అన్నారు. వడ్డీలేని రుణాలు, రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని వివరించారు. ధర్మపురి మున్సిపాలిటీ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కన్నం హరిని, మున్సిపల్ కమిషనర్, ధర్మపురి తహసీల్దార్ మార్కెట్ కమిటీ చైర్మన్, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధే లక్ష్యం కావాలి

- ఉపాధి హామీ పనులే గ్రామీణ ప్రాంతానికి వరం
- ఇటిక్యాల నూతన పాలకవర్గానికి మాజీ మంత్రి జీవన్ రెడ్డి దిశానిర్దేశం



**రాయికల్, డిసెంబర్ 24 (మనసులో మాట):**

ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత రాజకీయాలకు అతీతంగా, గ్రామ అభివృద్ధిని మాత్రమే దృష్టిలో ఉంచుకొని పాలకవర్గం పనిచేయాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం జగిత్యాలలోని ఇందిరా భవన్‌లో రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామ నూతన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు మాజీ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు పరస్పరం సన్మానించుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. రాయికల్ మండలంగా గుర్తింపు పొందడంలో ఇటిక్యాల పాత్ర కీలకమని కొనియాడారు. గతంలో జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్, సబ్ స్టేషన్, సింగిల్ విండో గోదాముల నిర్మాణానికి గ్రామస్తులు విలువైన స్థలాలు అందించి ఆదర్శంగా నిలిచారని గుర్తు చేశారు. దళితులకు, గీత కార్మికులకు (ఈత వనం కోసం) భూములు కేటాయించడంలో గ్రామం ముందుందన్నారు. ధరణి స్థానంలో ప్రభుత్వం తీసుకురానున్న 'భూభారతి' ద్వారా రెవెన్యూ సమస్యలన్నీ పరిష్కారమవుతాయని తెలిపారు. వడ్డెర కాలనీకి సిసి రోడ్డు, కళాశాలకు వెళ్లేందుకు బీటీ రోడ్డు మంజూరు చేయించామని చెప్పారు. గతంలో మహిళా సంఘాల డబ్బులు దుర్వినియోగం కాకుండా, బ్యాంకు లింకేజీని పైడిమడుగు నుంచి ఇటిక్యాల నుంచే జరిగేలా మార్చామన్నారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రాంతానికి ఒక వరమని, దీని ద్వారా కూలీలకు పనులు కల్పిస్తూనే గ్రామానికి ఆస్తులు సమకూర్చుకోవాలని సూచించారు. ప్రధానంగా మురికి కాలువల శుభ్రత, తాగునీరు, వీధి దీపాల వంటి మౌలిక వసతులపై నూతన పాలకవర్గం దృష్టి సారించాలని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని హితవు పలికారు.

## ఆడపడుచులకు క్రిస్మస్ కానుక

**ఇంటింటికీ చీరల పంపిణీ**

**సొంత ఖర్చులతో వితరణ చాటిన సర్పంచ్ శరణప్ప**



**కంగ్టి. డిసెంబర్ 24(మనసులో మాట):**

కంగ్టి మండలం తుర్కవడగం గ్రామంలో సర్పంచ్ శరణప్ప తన దాతృత్వాన్ని చాటుకున్నారు. బుధవారం క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని గ్రామంలోని మహిళలందరికీ పండుగ కానుకగా ఉచితంగా చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా గ్రామంలోని ఆడపడుచులందరికీ చీరలు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తన గెలుపునకు సహకరించిన గ్రామస్తులకు, కార్యకర్తలకు ఈ సందర్భంగా ఆయన పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

## ఏసు చూపిన మార్గంలో నడవాలి

**పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం**

**త్వరలో కొత్త పెన్షన్లు, రేషన్ కార్డులు**

**మంత్రి వివేక్ వెంకటస్వామి**

**దౌలతాబాద్, డిసెంబర్ 24:** ప్రపంచానికి శాంతిని, క్షమాగుణాన్ని ప్రసాదించిన ఏసుక్రీస్తు బోధనలు అందరికీ ఆదర్శనీయమని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. దౌలతాబాద్ మండల కేంద్రంలోని ఎస్వీ ఫంక్షన్ హాల్‌లో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తాను చిన్ననాటి నుంచే క్రిస్మస్ వేడుకల్లో పాల్గొంటున్నానని, క్రీస్తు చూపిన క్షమాగుణాన్ని అలవర్చుకున్నానని తెలిపారు. క్రైస్తవ సోదరులు సంతోషంగా పండుగ జరుపుకోవాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా వేడుకలు నిర్వహిస్తోందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని, ఇప్పటికే మహిళా సంఘాలకు రూ. 27 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందించామన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీతో పాటు త్వరలోనే అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ప్రజల మధ్య పండుగ జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. నూతనంగా ఎన్నికైన గ్రామ పంచాయతీ పాలకవర్గానికి, ప్రజలకు దేవుడి ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం అతిథులు క్రిస్మస్ కేక్ కట్ చేసి క్రైస్తవ సోదరులకు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దౌలతాబాద్ సర్పంచ్ అనురాధ రమేష్, స్థానిక పాస్టర్లు, క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జనవరిలో 'రైతు యాంత్రీకరణ' షురూ

- సీఎం చేతుల మీదుగా ప్రారంభం
- 1.31 లక్షల మంది రైతులకు వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు
- రైతుభరోసా కోసం శాటిలైట్ మ్యాపింగ్ వేగవంతం చేయాలి
- యూరియా యాప్‌పై అపోహలు వద్దు
- త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలు
- అధికారుల సమీక్షలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి

**హైదరాబాద్, డిసెంబర్ 24(మనసులో మాట)::**

గత ప్రభుత్వం నిలిపివేసిన 'రైతు యాంత్రీకరణ పథకాన్ని' జనవరి నెలలో ఘనంగా పునఃప్రారంభించనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం సచివాలయంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు. జనవరి మొదటి వారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ పథకాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన కేంద్ర ప్రభుత్వ పథకాలను తమ ప్రభుత్వం ఒక్కొక్కటిగా పునరుద్ధరిస్తోందని తెలిపారు. ఇప్పటికే జాతీయ ఆహార భద్రత మిషన్ ద్వారా పప్పుదినుసుల విత్తనాలను సబ్సిడీపై అందించామన్నారు. ఇప్పుడు రైతు యాంత్రీకరణ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1,31,000 మంది రైతులకు సబ్సిడీపై ఆధునిక యంత్రాలు, పనిముట్లు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, జనవరిలోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. యూరియా యాప్‌పై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని మంత్రి మండిపడ్డారు. ఇప్పటికే 5 జిల్లాల్లో ఈ యాప్ విజయవంతంగా అమలవుతోందని, రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. యాప్ ద్వారా కావలసినంత యూరియా కొనుగోలు చేయవచ్చని, రైతులు ఆందోళన చెందవద్దని కోరారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేస్తామన్నారు. రబీ సీజన్ రైతుభరోసా నిధుల విడుదలకు సంబంధించి శాటిలైట్ ఇమేజ్ మ్యాపింగ్‌ను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే, కేంద్రం నుంచి వచ్చే నిధులను సద్వినియోగం చేసుకోవడానికి స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్‌ను ఎప్పటికప్పుడు విడుదల చేస్తున్నామని, ఇప్పటికే రూ. 400 కోట్లు వినియోగించామని తెలిపారు. జనవరి మొదటి వారంలో జిల్లా అధికారులు మండలాల వారీగా పర్యటించి, సబ్సిడీలు, యాంత్రీకరణ దరఖాస్తులు, యూరియా యాప్ అమలుపై రైతుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచడం, సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి తుమ్మల అధికారులకు దిశానిర్దేశం చేశారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

SPORTS NEWS
స్పోర్ట్స్ న్యూస్

గురువారం
25 డిసెంబర్ 2025

# సెంచరీలతో దుమ్మురేపిన కోహ్లీ, రోహిత్ శర్మ



## ప్రారంభమైన విజయ్ హజారే ట్రోఫీ

### పరుగుల వరద పారించిన దిగ్గజాలు



భారత దేశవాళీ వన్డే టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీ బుధవారం ఘనంగా ప్రారంభమైంది. తొలి రోజే టీమ్ ఇండియా దిగ్గజాలు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ తమ బ్యాట్‌లతో మైదానంలో పరుగుల వరద పారించారు. ఒకవైపు విరాట్ కోహ్లీ అంతర్జాతీయ స్థాయి మైలురాయిని అధిగమించగా, మరోవైపు రోహిత్ శర్మ తన ట్రేడ్ మార్క్ ఇన్నింగ్స్‌తో అభిమానులను ఉర్రూతలూగించారు. ఢిల్లీ తరఫున బరిలోకి దిగిన విరాట్ కోహ్లీ ఆంధ్రప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన చేశారు. ఈ మ్యాచ్‌లో కేవలం ఒక్క పరుగు తీయడం ద్వారా విరాట్ లిస్ట్-ఎ క్రికెట్‌లో 16,000 పరుగుల చారిత్రక రికార్డు మైలురాయిని చేరుకున్నారు. సచిన్ టెండూల్కర్ తర్వాత ఈ ఘనత సాధించిన రెండో భారతీయ బ్యాట్స్‌మన్‌గా విరాట్ కోహ్లీ చరిత్ర సృష్టించారు. ప్రపంచవ్యాప్తంగా ఈ మైలురాయిని అందుకున్న 9వ ఆటగాడు కోహ్లీ కావడం విశేషం. 299 పరుగుల లక్ష్యఛేదనలో కోహ్లీ కేవలం 83 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేశారు. 110 బంతుల్లో 131 పరుగులు చేసి వెనుదిరిగాడు కోహ్లీ. ఈ మ్యాచ్‌లో ఢిల్లీ టీమ్ 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. సిక్కింతో జరిగిన మ్యాచ్‌లో విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడారు. కేవలం 61 బంతుల్లోనే సెంచరీ మార్కును అందుకున్న రోహిత్, మొత్తంగా 94 బంతుల్లో 155 పరుగులు (18 ఫోర్లు, 9 సిక్సర్లు) సాధించి ఔట్ అయ్యారు. 237 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని రోహిత్ తన ఒంటిచేత్తో ఛేదించి ముంబైకి ఘనవిజయాన్ని అందించారు. జైపూర్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో రోహిత్‌ను చూడటానికి వేలాదిగా అభిమానులు తరలివచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఈ మైలురాయిని అందుకున్న 9వ ఆటగాడు కోహ్లీ కావడం విశేషం. 299 పరుగుల లక్ష్యఛేదనలో కోహ్లీ కేవలం 83 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేశారు. 110 బంతుల్లో 131 పరుగులు చేసి వెనుదిరిగాడు కోహ్లీ. ఈ మ్యాచ్‌లో ఢిల్లీ టీమ్ 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. మరోవైపు విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా ముంబై జట్టు తరఫున ఆడుతున్న రోహిత్ శర్మ, సిక్కింతో జరిగిన మ్యాచ్‌లో విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడారు. కేవలం 61 బంతుల్లోనే సెంచరీ మార్కును అందుకున్న రోహిత్, మొత్తంగా 94 బంతుల్లో 155 పరుగులు (18 ఫోర్లు, 9 సిక్సర్లు) సాధించి ఔట్ అయ్యారు. 237 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని రోహిత్ తన ఒంటిచేత్తో ఛేదించి ముంబైకి ఘనవిజయాన్ని అందించారు. జైపూర్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో రోహిత్‌ను చూడటానికి వేలాదిగా అభిమానులు తరలివచ్చారు. దేశీయ 50 ఓవర్ల టోర్నమెంట్లు (విజయ్ హజారే వంటివి), అంతర్జాతీయ వన్డేలు రెండింటినీ కలిపి 'లిస్ట్-ఎ' క్రికెట్‌గా పరిగణిస్తారు. ఇందులో అత్యధిక పరుగుల రికార్డు ఇంగ్లాండ్ దిగ్గజం గ్రాహం గూచ్ (22,000 పైచిలుకు) పేరిట ఉంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇద్దరు కలిసి తమ జట్ల కోసం ఇరువురు సెంచరీలతో ఆకట్టుకున్నారు. ఈ ఇద్దరు దిగ్గజాలు ఫామ్‌లోకి రావడం భారత క్రికెట్ అభిమానులకు పెద్ద పండగ లాంటి వార్త.

## కోహ్లీ 16 వేల పరుగుల మైలురాయి

భారతదేశ దేశీయ వన్డే టోర్నమెంట్ అయిన విజయ్ హజారే ట్రోఫీలో ఈసారి చాలా మంది సూపర్ స్టార్ ఆటగాళ్లు ఆడుతున్నారు. బుధవారం నుంచే ఈ దేశీయ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్‌లో దిగ్గజ బ్యాట్స్‌మెన్ విరాట్ కోహ్లీ ఢిల్లీ జట్టులో సభ్యుడు. ఇక హిట్ మ్యాన్‌గా పేరుగాంచిన రోహిత్ శర్మ ముంబై తరఫున ఆడుతున్నాడు. విరాట్ కోహ్లీ ఢిల్లీ తరఫున ఆడుతూ 83 బంతుల్లో సెంచరీ సాధించాడు. ఛేజ్ మాస్టర్ ఆంధ్రతో జరిగిన మ్యాచ్ లో 299 పరుగుల లక్ష్యాన్ని ఛేదిస్తూ 9 ఫోర్లు, 3 సిక్సర్ల సహాయంతో సెంచరీ పూర్తి చేశాడు. ఇక ముంబై తరఫున సిక్కింతో జరిగిన మ్యాచ్ లో 237 పరుగుల లక్ష్యాన్ని ఛేదిస్తూ రోహిత్ శర్మ 71 బంతుల్లో సెంచరీ సాధించాడు. రోహిత్ కేవలం 94 బంతుల్లో 155 పరుగుల భారీ ఇన్నింగ్స్ ఆడాడు. హిట్ మ్యాన్ బ్యాట్ నుంచి 18 ఫోర్లు, 9 సిక్సర్లు వచ్చాయి. విరాట్ కోహ్లీ 101 బంతుల్లో 131 పరుగులతో నాటౌట్‌గా ఉన్నాడు. అతను 14 ఫోర్లు, 3 సిక్సర్లు కొట్టాడు. ఇంకా ఢిల్లీకి గెలవడానికి 25 పరుగులు కావాల్సిన టైంలో విరాట్ అవుట్ అయ్యాడు. అతని వికెట్‌ను సత్యనారాయణరాజు తీశాడు. ఆ జట్టులో ఆడుతున్న నితీష్ రాణా ఫిఫ్టీ కొట్టాడు. ఇక రోహిత్ శర్మ జట్టు మ్యాచ్ గెలిచింది. రోహిత్ 155 పరుగులు చేసి క్యాచ్ అవుట్ అయ్యాడు. రోహిత్ కేవలం 61 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. రోహిత్ శర్మ తన సెంచరీ ఇన్నింగ్స్‌లో 8 సిక్సర్లు, 9 ఫోర్లు కొట్టాడు. జైపూర్‌లో జరుగుతున్న ముంబై వర్సెస్ సిక్కిం మ్యాచ్‌ను చూడటానికి రోహిత్ శర్మ కోసం చాలా మంది ప్రేక్షకులు తరలివచ్చారు. ఢిల్లీ తరఫున కేవలం ఒక పరుగు చేయడంతోనే విరాట్ కోహ్లీ లిస్ట్ ఏ క్రికెట్ లో 16 వేల పరుగులు పూర్తి చేసుకున్నాడు. ఈ మ్యాచ్ కు ముందు వరకు విరాట్ ఖాతాలో 342 లిస్ట్ ఏ మ్యాచ్ లలో 15999 పరుగులు ఉన్నాయి. విరాట్ ఇప్పుడు సచిన్ టెండూల్కర్ తర్వాత లిస్ట్ ఏ మ్యాచ్‌లలో 16 వేల పరుగుల మైలురాయిని అందుకున్న రెండో భారతీయుడిగా నిలిచాడు. ఇక ప్రపంచంలో ఈ ఘనత సాధించిన 9వ బ్యాట్స్ మెన్ గా నిలిచాడు. ఇంగ్లాండ్ మాజీ దిగ్గజం గ్రాహం గూచ్ లిస్ట్ ఏ క్రికెట్ లో అత్యధిక పరుగులు చేసిన రికార్డును కలిగి ఉన్నాడు. గూచ్ ఖాతాలో 22 వేలకు పైగా పరుగులు ఉన్నాయి. దేశీయ 50 ఓవర్ల మ్యాచ్ లు, వన్డే ఇంటర్నేషనల్ పరుగులు లిస్ట్ ఏ మ్యాచ్ లలో చేరుస్తారు.

## 36 బంతుల్లో సెంచరీ.. 54 బంతుల్లో 150..


### విజయ్ హజారే ట్రోఫీలో వైభవ్ సూర్యవంశీ బీభత్సం



బీహార్ సంచలనం 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ దేశవాళీ క్రికెట్‌లో మరోసారి చరిత్ర సృష్టించాడు. విజయ్ హజారే ట్రోఫీ 2025-26లో భాగంగా అరుణాచల్ ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. ఈ క్రమంలో దక్షిణాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలియర్స్ పేరిట ఉన్న వరల్డ్ రికార్డును కేవలం 10 బంతుల తేడాతో బద్దలు కొట్టాడు. రాంచీలోని జేఎస్‌సీఏ ఓవల్ మైదానంలో అరుణాచల్ ప్రదేశ్‌పై వైభవ్ సూర్యవంశీ విధ్వంసం సృష్టించాడు. కేవలం 84 బంతుల్లో 190 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. ఈ మెరుపు ఇన్నింగ్స్‌లో 16 ఫోర్లు, 15 భారీ సిక్సర్లు ఉన్నాయి. 226 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసిన వైభవ్, కేవలం 36 బంతుల్లోనే తన సెంచరీ పూర్తి చేశాడు. ఇది విజయ్ హజారే ట్రోఫీ చరిత్రలో రెండో వేగవంతమైన సెంచరీగా రికార్డులకు ఎక్కింది. కొద్దిలో డబుల్ సెంచరీ మిస్ అయినప్పటికీ, అతను సృష్టించిన ప్రభంజనం మాత్రం మామూలుగా లేదు. లిస్ట్-ఏ క్రికెట్‌లో అతివేగంగా 150 పరుగుల మార్కును అందుకున్న ఆటగాడిగా వైభవ్ సూర్యవంశీ ఇప్పుడు చరిత్ర సృష్టించాడు. గతంలో ఈ రికార్డు ఏబీ డివిలియర్స్ పేరిట ఉండేది. డివిలియర్స్ 2015 ప్రపంచకప్‌లో వెస్టిండీస్‌పై 64 బంతుల్లో 150 పరుగులు పూర్తి చేశాడు. అయితే, వైభవ్ కేవలం 54 బంతుల్లోనే 150 పరుగుల మైలురాయిని చేరుకుని, డివిలియర్స్ కంటే 10 బంతులు తక్కువ ఆడి ఈ వరల్డ్ రికార్డును తన సొంతం చేసుకున్నాడు. కేవలం 14 ఏళ్ల 272 రోజుల వయసులోనే లిస్ట్-ఏ క్రికెట్‌లో సెంచరీ సాధించిన అతి పిన్న వయస్కుడైన ఆటగాడిగా వైభవ్ ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఇప్పటి వరకు ఏ ప్రొఫెషనల్ వన్డే టోర్నీలోనూ ఇంత చిన్న వయసులో ఎవరూ సెంచరీ చేయలేదు. ఇటీవలే ఐపీఎల్ వేలంలో రాజస్థాన్ రాయల్స్ జట్టు ఇతడిని భారీ ధరకు కొనుగోలు చేయగా, ఈ ఇన్నింగ్స్‌తో తానెందుకు స్పెషలో వైభవ్ మరోసారి నిరూపించుకున్నాడు. అండర్-19 ఆసియా కప్ ఓటమి బాధ నుంచి త్వరగానే కోలుకుని, సీనియర్ స్థాయిలో ఈ అద్భుత ప్రదర్శన చేయడం విశేషం.

## సూర్యకుమార్ వల్లే శుభ్‌మన్ గిల్‌పై వేటు

### మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్ప విమర్శ



టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కారణంగానే శుభ్‌మన్ గిల్‌పై వేటు పడిందని మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్ప అన్నాడు. ఇద్దరూ ఫామ్‌లో లేని ఆటగాళ్లను కొనసాగించడం జట్టుకు శ్రేయాస్కారం కాదనే భారత సెలెక్టర్లు ఈ నిర్ణయం తీసుకున్నారని అభిప్రాయపడ్డాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 బరిలోకి దిగే భారత జట్టును ఇటీవల బీసీసీఐ ప్రకటించిన సంగతి తెలిసిందే. రెగ్యులర్ టీ20 టీమ్‌లో రెండు మార్పులు చేసిన సెలెక్టర్లు.. మిగతా జట్టును కొనసాగించారు. పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడిన వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ను తప్పించి ఇషాన్ కిషన్‌ను బ్యాకప్ వికెట్ కీపర్ కమ్ ఓపెనర్‌గా ఎంపిక చేశారు. జితేశ్ శర్మను తప్పించి రింకూ సింగ్‌ను తీసుకున్నారు. అక్షర్ పటేల్‌కు తిరిగి వైస్ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించారు. తాజాగా ఈ టీమ్ గురించి మాట్లాడిన రాబిన్ ఊతప్ప.. సూర్య వల్లే గిల్‌పై పక్కనపెట్టాల్సి వచ్చిందన్నాడు. 'ప్రపంచకప్ నేపథ్యంలో జట్టులో ఫామ్‌లో లేని ఒక్క ఆటగాడిని మాత్రమే కొనసాగించవచ్చు. అంతకంటే ఎక్కువ మందిని తీసుకుంటే జట్టుకు ఇబ్బందులు ఎదురవుతాయి. సూర్యకుమార్ యాదవ్ ఈ మధ్య అంతగా పరుగులు చేయడం లేదు. అందుకే శుభ్‌మన్ గిల్ జట్టులో చోటు దక్కలేదని నా అభిప్రాయం. సూర్య ఫామ్‌లో లేదని నేను చెప్పలేను. కానీ అతను పరుగులు చేయడం లేదు. శుభ్‌మన్ గిల్ మాత్రం ఫామ్‌లో లేడు. అతను పరుగులు చేయడానికి ఇబ్బంది పడుతున్నాడు. శుభ్‌మన్ గిల్ కాస్త గందరగోళంగా కనిపిస్తున్నాడు. సౌతాఫ్రికాతో సిరీస్‌లో లుంగి ఎంగిడి అద్భుతంగా బౌలింగ్ చేశాడు. అతను శుభ్‌మన్ గిల్‌ను తన బంతులతో ఇబ్బంది పెట్టాడు. టీ20 ప్రపంచకప్ జట్టును చూసి నేను షాకయ్యా. నిద్రలోంచి మేల్కొని నా ఫోన్ చూశాం. నేను చాలా ఆనందపడ్డా. వారు నిజంగా అద్భుతమైన జట్టును ఎంపిక చేశారు. అయితే వారు ముందుగా గిల్‌ను టీ20 జట్టుకు వైస్ కెప్టెన్‌గా ప్రకటించకుండా ఉండాల్సింది.'అని రాబిన్ ఊతప్ప అభిప్రాయపడ్డాడు.

## రిషబ్ పంత్‌కు అమిత్ మిశ్రా స్ట్రాంగ్ వార్నింగ్

టీమిండియా స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ ఆటతీరుపై మాజీ స్పిన్నర్ అమిత్ మిశ్రా సంచలన వ్యాఖ్యలు చేశారు. పంత్ తన బ్యాటింగ్ శైలిని మార్చుకోకపోతే జట్టులో చోటు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. 2018లో అరంగేట్రం చేసిన పంత్, టెస్టుల్లో అద్భుతమైన రికార్డులు కలిగి ఉన్నప్పటికీ, నిలకడలేమి అతనికి శాపంగా మారిందని మిశ్రా అభిప్రాయపడ్డారు. ఒకప్పుడు పంత్ అంటే కుర్రాడు, తప్పులు చేస్తాడులే అని సరిపెట్టుకునే వాళ్లమని, కానీ ఇప్పుడు అతనికి 28 ఏళ్లు వచ్చాయని మిశ్రా గుర్తు చేశారు. "రిషబ్ 2018 నుంచి జట్టులో ఉన్నాడు. ఇప్పుడు అతన్ని యంగ్ ప్లేయర్ అని అనలేము. కెరీర్‌లో ఒక స్థాయికి వచ్చాక పరిస్థితులకు తగ్గట్టుగా ఆటను మార్చుకోవడం చాలా అవసరం. కానీ పంత్ మాత్రం పదే పదే ఒకే రకమైన పొరపాట్లు చేస్తూ వికెట్ పారేసుకుంటున్నాడు" అని ఒక పాడ్‌కాస్ట్‌లో మిశ్రా విమర్శించారు. అంతర్జాతీయ క్రికెట్‌లో ప్రత్యర్థి జట్లు ఆటగాళ్ల బలహీనతలను లోతుగా విశ్లేషిస్తాయని మిశ్రా హెచ్చరించారు. "నువ్వు ఏ బంతిని అటాక్ చేస్తావు, ఏ బంతిని ఆడలేవు అనేది ప్రత్యర్థులు గమనిస్తున్నారు. ప్రతిసారీ నేను ఇలాగే ఆడతాను.. ఇదే నా స్టైల్ అంటే కుదరదు. అలా మొండిగా ఉంటే మరో నాలుగు ఐదు మ్యాచ్‌లు ఆడిస్తారేమో కానీ, ఆ తర్వాత జట్టు నుంచి తప్పిస్తారు. వికెట్, పరిస్థితులకు తగ్గట్టుగా గేర్ మార్చడమే గొప్ప ఆటగాడి లక్షణం" అని పంత్‌కు సూచించారు. ఇటీవల దక్షిణాఫ్రికాతో జరిగిన హోమ్ టెస్ట్ సిరీస్‌లో భారత్ 0-2తో వైట్‌వాష్‌కు గురైంది. ఈ సిరీస్‌లో పంత్ బ్యాటర్‌గా కేవలం 49 పరుగులు మాత్రమే చేసి నిరాశపరిచాడు. శుభ్‌మన్ గిల్ గాయపడటంతో కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టినప్పటికీ, అటు బ్యాటింగ్‌లోనూ, ఇటు నాయకత్వంలోనూ పంత్ ఆశించిన మేర రాణించలేదు. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ.. టర్నింగ్ ట్రాక్‌లు లేదా బౌన్స్ ఉండే పిచ్‌లపై ఒకే రకమైన షాట్లు ఆడటం వల్ల ప్రయోజనం ఉండదని మిశ్రా స్పష్టం చేశారు. రిషబ్ పంత్ టెస్టుల్లో 8 సెంచరీలు బాది భారత వికెట్ కీపర్లలో టాప్ రికార్డు సృష్టించాడు. అయితే వైట్ బాల్ క్రికెట్ లో అతని ప్రదర్శన అంతంతమాత్రంగానే ఉంది. ప్రస్తుతం టెస్ట్ జట్టులో వైస్ కెప్టెన్‌గా ఉన్నప్పటికీ, తన షాట్ సెలక్షన్‌ను మెరుగుపరుచుకోకపోతే త్వరలోనే అతడిపై బోర్డు కఠిన నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అమిత్ మిశ్రా విశ్లేషించారు.

## నా ఫేవరేట్ హీరోయిన్ కాజల్

### టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్, తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డి తన ఫేవరేట్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ అని తెలిపాడు. తాజాగా పాన్ ఇండియా మూవీ ఛాంపియన్ ప్రమోషన్ కార్యక్రమంలో పాల్గొన్న నితీష్ కుమార్ రెడ్డి.. ఈ విషయాన్ని వెల్లడించాడు. ఛాంపియన్ హీరో రోషన్‌తో నితీష్ కుమార్ రెడ్డి సరదాగా చిట్ చాట్ చేశాడు. ఈ మూవీకి సంబంధించిన విషయాలతో పాటు వ్యక్తిగత ఇష్టాల గురించి మాట్లాడుకున్నారు. క్రిస్మస్ సందర్భంగా ఛాంపియన్ రిలీజ్ అవుతుందని రోషన్ చెప్పగా.. తప్పకుండా చూస్తానని నితీష్ తెలిపాడు. ఈ ఇద్దరు స్నేహితుల్లా చాలా సరదాగా చిట్ చాట్ చేశారు. రోషన్ అనస్వర రాజన్ జంటగా ప్రదీప్ అద్వైతం రూపొందించిన పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామా 'ఛాంపియన్'. జీ స్టూడియోస్ సమర్పణలో స్వప్న సినిమాస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ కాన్సెప్ట్ ఫిల్మ్స్ సంస్థలు నిర్మించాయి. ఇప్పటికీ ఈ మూవీ టీజర్, ట్రైలర్, సాంగ్స్‌కు ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ లభించింది. విజయ్ హజారే ట్రోఫీలో ఆంధ్ర జట్టుకు కెప్టెన్‌గా నితీష్ కుమార్ రెడ్డి వ్యవహరిస్తున్నాడు. బెంగళూరు వేదికగా ఢిల్లీతో ఆంధ్ర టీమ్ తొలి మ్యాచ్ ఆడుతుంది. ఢిల్లీ తరఫున కోహ్లీతో పాటు రిషభ్ పంత్ బరిలోకి దిగాడు.





మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# షూటింగ్ విరామంలో ఫ్యామిలీతో మహేశ్‌బాబు



సూపర్ స్టార్ మహేష్ బాబు సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా, కుటుంబానికి సమయం కేటాయించడంలో ఎప్పుడూ ముందుంటారన్న విషయం మరోసారి రుజువైంది. ఈ మంగళవారం మహేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా గడిపారు. దీనికి సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. షూటింగ్ హడావిడి లేకుండా పూర్తిగా రిలాక్స్ మూడ్‌లో కనిపిస్తున్న మహేష్ లుక్ అభిమానులను ఆకట్టుకుంటోంది. వైరల్ అవుతున్న ఫోటోల్లో మహేష్ బాబు చాలా సింపుల్ అయినప్పటికీ స్టైలిష్‌గా కనిపించారు. వైట్ షర్ట్, జీన్స్, తలపై క్యాప్‌తో క్యాజువల్ లుక్‌లో ఉన్న మహేష్ ముఖంలో చిరునవ్వు స్పష్టంగా కనిపిస్తోంది. కుటుంబంతో కలిసి గడిపే ఈ క్షణాలు ఆయనకు ఎంత రిలీఫ్ ఇస్తాయో ఆ ఫోటోలు చూస్తేనే అర్థమవుతోంది. ఎలాంటి ఆర్భాటాలు లేకుండా, పూర్తిగా సాదాసీదాగా ఈ ఫ్యామిలీ గ్యాదరింగ్ జరిగింది. ఈ ఫ్యామిలీ రీయూనియన్‌లో మహేష్ సతీమణి నమ్రతా శిరోద్కర్, సోదరీమణులు మంజుల ఘట్టమనేని, పద్మావతి ఘట్టమనేని సందడి చేశారు. అలాగే మంజుల భర్త సంజయ్ స్వరూప్, మేనల్లుళ్లు అశోక్ గల్లా, భారతి ఘట్టమనేని కూడా ఈ గ్యాదరింగ్‌లో పాల్గొన్నారు. అందరూ కలిసి దిగిన ఫోటోలు అభిమానులకు కన్నుల పండుగలా మారాయి. అయితే ఈ ఫుల్ హౌస్ సెలబ్రేషన్‌లో ఇద్దరు ముఖ్యమైన వ్యక్తులు మాత్రం కనిపించలేదు. వారే మహేష్ బాబు పిల్లలు గౌతమ్, సితార. గౌతమ్ ప్రస్తుతం ఉన్నత చదువుల కోసం అమెరికాలో ఉండటంతో ఈ గ్యాదరింగ్‌కు రాలేకపోయాడని సమాచారం. అలాగే సితార కూడా తన వ్యక్తిగత పనుల్లో బిజీగా ఉండటంతో ఈ ఫ్యామిలీ మీట్‌కు దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. వీరిద్దరూ ఉంటే ఈ వేడుక మరింత ప్రత్యేకంగా ఉండేదని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు.



# ఆఖరికి సావే సచ్చిపోయింది

## మైసా ఫస్ట్ గ్లింప్స్ విడుదల

నాయికా ప్రధానమైన కథలకు కేరాఫ్‌గా మారిపోతున్నారు రష్మిక. 'ది గర్ల్‌ఫ్రెండ్' తర్వాత ఆమె ప్రధాన పాత్రధారిగా తెరకెక్కుతున్న మరో చిత్రం 'మైసా'. రవీంద్ర పుల్లె దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. తాజాగా ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు . బ్యాక్‌గ్రౌండ్‌లో డైలాగులతో రష్మిక పాత్రను పరిచయం చేశారు. 'నా బిడ్డ ఊపిరి మోయలేక అగ్గే బూడిదైంది. నా బిడ్డను సంపలేక.. ఆఖరికి సావే సచ్చిపోయింది' అనే డైలాగులు ఆసక్తి కలిగిస్తున్నాయి. ప్రతీకారం తీర్చుకునే 'మైసా' పాత్రలో రష్మిక నటిస్తున్నట్లు గ్లింప్స్ ఆధారంగా తెలుస్తోంది. 'ది గర్ల్ ఫ్రెండ్' చిత్రంలో అమాయకమైన యువతిగా ఆకట్టుకున్న నేషనల్ క్రష్ రష్మిక మందన్న, ఇప్పుడు తన నెక్స్ట్ మూవీ 'మైసా' కోసం వెరైటీ అవతారంలో ప్రేక్షకుల ముందుకు వచ్చింది.తాజాగా విడుదలైన యాక్షన్ గ్లింప్స్ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. ఈ గ్లింప్స్‌లో రష్మిక కనిపించిన విధానం ఆమె కెరీర్‌లోనే తొలిసారి అని చెప్పాలి. ఒళ్లంతా రక్తం, తెగిపోయిన చేతి బేడీలు, చేతిలో గన్, కళ్లలో రగిలే కోపం? ఒక గిరిజన తిరుగుబాటు యువతిగా ఆమె ప్రెజెన్స్ ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇప్పటివరకు రొమాంటిక్, ఫీల్ గుడ్, కమర్షియల్ పాత్రలతో అభిమానులను మెప్పించిన రష్మిక, ఈసారి పూర్తిగా రెబల్ యాక్షన్ మోడ్‌లోకి మారిపోయింది. గ్లింప్స్‌లో వినిపించే వాయిస్ ఓవర్ పాత్రలోని గాంభీర్యాన్ని మరింత పెంచగా, సంగీత దర్శకుడు జేక్స్ బిజోయ్ అందించిన పవర్‌ఫుల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ యాక్షన్ సీక్వెన్స్‌లకు ప్రాణం పోసింది. ప్రతి ఫ్రేమ్‌లో ఇంటెన్సిటీ కనిపిస్తూ, 'మైసా' ఓ సాధారణ యాక్షన్ సినిమా కాదని ఈ గ్లింప్స్ స్పష్టంగా చెబుతోంది. 'మైసా' అంటే 'అమ్మ' అని అర్థం. గోండు గిరిజన తెగల నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ సినిమా, అన్యాయానికి ఎదురు నిలిచే ఓ సహజ నాయకురాలి కథగా ఉండనున్నట్లు తెలుస్తోంది. స్వేచ్ఛ, పోరాటం, భావోద్వేగాల మేళవింపుతో ఈ చిత్రాన్ని ఓ పవర్‌ఫుల్ యాక్షన్ డ్రామాగా మలుస్తున్నారు. రష్మికతో పాటు, 'పుష్ప 2'లో విలన్ పాత్రతో మెప్పించిన తారక్ పొన్నప్ప కీలక పాత్రలో నటిస్తున్నారు. ప్రస్తుతం సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా, పలు భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. తాజాగా విడుదలైన యాక్షన్ గ్లింప్స్‌తోనే 'మైసా'పై అంచనాలు భారీగా పెరిగాయి. రష్మిక కెరీర్‌లోనే అత్యంత ఫెరోషియస్, ఇంటెన్స్ పాత్రగా ఇది నిలవనుందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# అనుమానాలపై క్లారిటీ ఇచ్చిన కియారా



ప్రముఖ బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తోంది. ఈమధ్య పండంటి బిడ్డకు జన్మనిచ్చిన ఈమె ఇప్పుడిప్పుడే బయటకు వస్తూ.. పలు మీడియా ఇంటర్వ్యూలలో పాల్గొంటూ.. పలు విషయాలను అభిమానులతో పంచుకుంటోంది. ఈ క్రమంలోనే గత కొన్ని రోజులుగా ఈమె ప్రెగ్నెన్సీపై వస్తున్న వార్తలకు.. పెరిగిపోతున్న అనుమానాలకు తాజాగా స్పందించి క్లారిటీ ఇచ్చింది కియారా అద్వానీ. ఈ ఏడాది తెలుగులో రామ్ చరణ్ హీరోగా నటించిన గేమ్ చేంజర్ సినిమాలో నటించింది. ఈ సినిమా డిజాస్టర్ గా నిలిచింది. ఇక బాలీవుడ్లో హృతిక్ రోషన్ హీరోగా నటించిన వార్ 2 సినిమాలో హీరోయిన్ గా నటించింది. ఈ సినిమా కూడా పెద్దగా విజయాన్ని అందించలేదు.. ఇక ఇందులో టాలీవుడ్ స్టార్ హీరో ఎన్టీఆర్ కూడా కీలకపాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఇకపోతే ఈ సినిమాలో ఈమె బికినీ ధరించింది. అదే సమయంలో ప్రెగ్నెంట్ కూడా.. దీంతో ఈమె బికినీ సన్నివేశాల కోసం ఏఐ ఉపయోగించారంటూ కొంతమంది కామెంట్లు చేశారు. దీనిపై కూడా ఆమె స్పందించింది. అసలు విషయంలోకి వెళ్తే తాజాగా ఒక మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కియారా అద్వానీ మాట్లాడుతూ.. "నేను ఎప్పుడు గర్భం దాల్చాను? ఎలా షూటింగ్స్ మేనేజ్ చేశాను? అని చాలామంది అనుమానపడ్డారు. అయితే నేను గర్భం దాల్చిన ఏడో నెల వరకు కూడా షూటింగ్స్ లో పాల్గొన్నాను. అయితే నేను గర్భం దాల్చానన్న విషయం కేవలం దర్శకుడు, నిర్మాతకు మాత్రమే తెలుసు. అంతలా జాగ్రత్తలు తీసుకొని నటించాను. ముఖ్యంగా షాట్ ముగిసిన ప్రతిసారి కారవాన్ లోకి వెళ్లి నా బిడ్డతో మాట్లాడేదాన్ని. కేవలం నటిస్తున్నాను.. భయపడకు అంటూ నా కడుపులో ఉన్న బిడ్డకు భరోసా ఇచ్చేదాన్ని.. అటు గర్భం దాల్చినపుడు ఏడు నెలల వరకు షూటింగ్స్ లో పాల్గొన్నాను. అలా పాల్గొన్న ప్రతిసారి చిత్ర బృందం నాకు ఎంతో సహాయపడింది" అంటూ తెలిపింది. అలాగే వార్ 2లో బికినీ సన్నివేశంపై వస్తున్న వార్తల గురించి మాట్లాడుతూ.. "దీనిని చాలామంది ఏఐ అనుకున్నారు. కానీ బికినీ ఫిజిక్ కోసం కఠోరమైన క్రమశిక్షణ కూడా పాటించాను.."అంటూ తెలిపింది. మొత్తానికైతే ఇన్ని రోజులు తన గర్భం గురించి వస్తున్న వార్తలకు క్లారిటీ ఇచ్చింది కియారా అద్వానీ

# నేటివిటీకి దగ్గరగా దండోరా కథ

### నేడు విడుదల కానున్న చిత్రం



శివాజీ, నవదీప్, బిందు మాధవి, రాహుల్ రామకృష్ణ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'దండోరా' మురళీకాంత్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా 25న గురువారం ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా ఈ మూవీ సెన్సార్ పూర్తి చేసుకుంది. 2.16 గంటల నిడివితో 'దండోరా' ప్రేక్షకుల ముందుకు రానుంది. దీనికి యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసిన సెన్సార్ బోర్డు చిత్ర బృందానికి 15 మార్పులు సూచించింది. ఇందులో వాడిన కొన్ని అసభ్య పదాలను కచ్చితంగా తొలగించాలని ఆదేశించింది. అలాగే సినిమా ప్రారంభంలో వాయిస్ ఓవర్‌తో ఇందులోని పాత్రలు కల్పితమని పేర్కొంటూ గమనిక ఇవ్వాలని సూచించింది. కొన్ని సన్నివేశాలను బ్లర్ చేయాలని ఆదేశించింది. విడుదల నేపథ్యంలో తాజాగా దర్శకుడు ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. మలయాళంలో ఎక్కువ కాన్సెప్ట్ బేస్డ్ సినిమాలొస్తుంటాయి. అలా మన దగ్గర ఎందుకు రావనే ఆలోచనల్లో నుంచి ఈ కథ రాసుకున్నట్లు తెలిపారు. 'అందరూ టీజర్, పాటలు చూసి దీన్ని 'బలగం'తో పోలుస్తున్నారు. నిజానికి దానికి, దీనికి ఏ పోలిక లేదు. వ్యక్తి చనిపోయిన తర్వాత నుంచి ఆ శవాన్ని ఖననం చేసేవరకు ఈ కథ ఉంటుంది. ఆ శవాన్ని పూడ్చనీయకుండా ఓ ఊరి వాళ్లు ఎందుకు అడ్డుకున్నారు? అసలు ఆ ఊరి సమస్య ఏంటి? దానికి పరిష్కారం దొరికిందా? లేదా? అనే అంశాలతో దీన్ని రూపొందించాం' అని చెప్పారు.

CHIEF EDITOR BY **KANCHARLA ATCHUTA RAO** PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169. PRINTED BY **CHAITANYAVARADHI** PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861